www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

క్యాన్సర్‌ను జయించి.. శిశువుకు జన్మనిచ్చి..

గర్భసంచి తొలగింపునకు వచ్చిన యువతికి వైద్యుల భరోసా
పిండాలను ఫ్రీజ్ చేసి.. హిస్టరెక్టమీ చేయకుండానే చికిత్స
క్యాన్సర్ ఉన్న ప్రాంతాన్ని గుర్తించి జాగ్రత్తగా తొలగింపు
ఫ్రీజ్ చేసిన పిండాన్ని గర్భసంచిలో ప్రవేశపెట్టిన వైద్యులు
పూర్తి ఆరోగ్యంతో పుట్టిన పాప.. తల్లి, బిడ్డ క్షేమం 14


బిడ్డకు జన్మనిచ్చిన మౌనికతో డా. వసుంధర

సోమవారం | 29-7-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 121 |
శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, బహుళపక్షం, తిథి: నవమి సా. 5.56 తదుపరి దశమి; నక్షత్రం: భరణి ఉ. 10.55 తదుపరి కృత్తిక; వర్జ్యం: రా.10.39-12.12; దుర్ముహూర్తం: మ.12.47-1.38, మ.3.20-4.12; అమృతఘడియలు: ఉ.6.17-7.50; రాహుకాలం: ఉ.7.30-9.00, సూర్యోదయం: 5.57; సూర్యాస్తమయం: 6.45 | వరంగల్
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మను బోణీ

10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో కాంస్యం
పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు తొలి పతకం
పీవీ సింధు, శ్రీజ, నిఖత్ ముందంజ



ఓవైపు భారీ అంచనాలు.. మరోవైపు గత వైఫల్యపు చేదు జ్ఞాపకాలు.. కానీ, ఆమె ఆత్మస్థైర్యం సడలలేదు..! గురి చెదరలేదు..! హరియాణా అమ్మాయి మనుబాకర్ పట్టు వీడలేదు. అర్హత రౌండ్ నుంచి అదరగొడుతూ ఫైనల్లోనూ పోరాట పటిమ చూపిన ఆమె పారిస్ ఒలింపిక్స్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో కాంస్య పతకం సాధించింది. విశ్వ క్రీడల షూటింగ్ అంశంలో మెడల్ గెలుచుకున్న తొలి భారత మహిళగా చరిత్ర సృష్టించింది. పోటీల రెండో రోజు పతకాల పట్టికలో భారత్‌కు చోటు కల్పించింది. తెలుగు అమ్మాయిల్లో.. హ్యాట్రిక్ పతక వేటలో ఉన్న స్టార్ షట్లర్ పీవీ సింధు గ్రూప్ దశను ఘన విజయంతో ఆరంభించింది. పవర్‌ఫుల్ ప్రదర్శనతో బాక్సర్ నిఖత్ జరీన్ ప్రీ క్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. టేబుల్ టెన్నిస్‌లో ఆకుల శ్రీజ అలవోకగా గెలిచి ముందంజ వేసింది. 11


కల్వకుర్తిలో జరిగిన బహిరంగ సభలో ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభివాదం

ఎల్లుండిలోగా లక్షన్నర

నేను విదేశాల నుంచి రాగానే రూ.2 లక్షల రుణమాఫీ చేస్తాం

రైతుల పట్ల చిత్తశుద్ధిని చాటుకుంటాం
అధికారం పోయిన బాధ తండ్రీకొడుకులకు ఇంకా తగ్గలే
కేసీఆర్, కేటీఆర్ మధ్యే సమన్వయం లేదు
2014లో జైపాల్‌రెడ్డిని సీఎం అభ్యర్థిగా ప్రకటించి ఉంటే కాంగ్రెస్ గెలిచేది
పార్లమెంటు తలుపులు మూసి తెలంగాణ బిల్లును పాస్ చేయించడంలో ఆయనదే కీలకపాత్ర
అప్పటి స్పీకర్ మీరాకుమార్‌ను ఒప్పించారు
రూ.10 కోట్లతో కల్వకుర్తికి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్
హైదరాబాద్-కల్వకుర్తి మధ్య 4 వరుసల రహదారి
కల్వకుర్తిలో జైపాల్ విగ్రహావిష్కరణ సభలో సీఎం రేవంత్

నాగర్‌కర్నూల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రైతుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఈ నెలాఖరు (ఎల్లుండి)లోగా రైతులకు రూ.1.50 లక్షల రుణాలను మాఫీ చేసి, తమ నిబద్ధతను చాటుకుంటామని తెలిపారు. రైతులకు రుణమాఫీ చేసి, వారిని ఆదుకోవాలన్నదే కాంగ్రెస్ సంకల్పమని స్పష్టం చేశారు. పదేళ్ల పాలనలో తెలంగాణను తెగనమ్ముకున్న ఒక సన్నాసి ఆగస్టులోగా రుణమాఫీ చేయాలని సవాల్ విసిరాడని.. తాము జూలైలోనే రూ.లక్ష రుణమాఫీ చేసి 6 వేల కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమచేశామని చెప్పారు. అధికారం కోల్పోయామన్న బాధ నుంచి తండ్రీకొడుకులు (కేసీఆర్, కేటీఆర్) ఇంకా తేరుకోలేకపోతున్నారని దుయ్యబట్టారు. 2014 ఎన్నికల కంటే ముందు సూదిని జైపాల్‌రెడ్డిని సీఎంగా ప్రకటించి ఉంటే

మిగతా 13వ పేజీలో...

'సెంట్రలైజ్డ్ కిచెన్'లతో
మధ్యాహ్న భోజనం

పైలట్ ప్రాజెక్టుగా కొడంగల్‌లో.. 13
తర్వాత రాష్ట్రమంతా..
హరేరామ-హరేకృష్ణ ఫౌండేషన్ సహకారంతో
ఆ సంస్థ ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష

1000 కోట్ల జీఎస్టీ అక్రమాలు..
మాజీ సీఎస్ సోమేశ్‌పై కేసు

ఇద్దరు వాణిజ్యపన్నుల అధికారులపైనా..
ఎఫ్ఐఆర్‌లో ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్
జీఎస్టీ సాఫ్ట్‌వేర్ తయారీ కంపెనీలు కూడా
70 కంపెనీలకు అడ్డగోలుగా ఇన్‌పుట్ క్రెడిట్స్
ఫిర్యాదు చేసిన కమిషనర్ రవి.. కేసు నమోదు
ఫిబ్రవరిలోనే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'
అప్పట్లోనే అధికారులపై సోమేశ్ ఒత్తిడి!
విచారణ నిలిపివేతకు యత్నాలు.. సీఎస్‌గా ఉన్నప్పుడు ఆయన వద్దే వాణిజ్య పన్నుల శాఖ



హైదరాబాద్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): వాణిజ్యపన్నుల శాఖలో రూ.1000 కోట్ల గూడ్స్ అండ్ సర్వీస్ ట్యాక్స్(జీఎస్టీ) కుంభకోణంలో తెలంగాణ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి(సీఎస్) సోమేశ్‌కుమార్‌పై హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆయనతోపాటు.. మరో ఇద్దరు ఉన్నతాధికారులపైనా ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు సమాచారం. 70 కంపెనీల ఐజీఎస్టీ చెల్లింపుల్లో భారీగా అవకతవకలకు పాల్పడడమే కాకుండా.. ఐజీఎస్టీ కింద రూ.1000 కోట్ల మేర అక్రమంగా ఇన్‌పుట్ క్రెడిట్ బదిలీ చేసినట్లు రాష్ట్ర వాణిజ్యపన్నుల శాఖ విచారణలో అంతర్గతంగా

మిగతా 13వ పేజీలో...


శ్రీశైలం జలాశయంలోకి చేరిన వరద

రేపు శ్రీశైలం 6 గేట్ల ఎత్తివేత!

ప్రాజెక్టుకు 4.41 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
జూరాల, సుంకేశుల నుంచి భారీగా వరద!
ఈసారి జులైలోనే తెరుచుకోనున్న గేట్లు
నాగార్జున సాగర్‌కు 62 వేల క్యూసెక్కులు
కాళేశ్వరం కట్టినప్పుడు కూలినప్పుడు అధికారంలో మీరే
మేడిగడ్డలో నీళ్లు లిఫ్ట్‌చేసి ఎక్కడ పోయాలి? మీ నెత్తిల పోయాల్నా?: మంత్రి ఉత్తమ్

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

నిరుటి ఇబ్బందికర పరిస్థితి మళ్లీ తలెత్తకుండా చేస్తూ.. వానాకాలం పంటలకు ఊపిరి పోస్తూ.. శ్రీశైలం నుంచి కృష్ణమ్మ దిగువకు పరుగులు పెట్టనుంది. జూలై నెలలోనే బిరబిరా తరలివస్తూ.. నాగార్జున సాగర్‌ను చేరనుంది. గత ఏడాది తక్కువ వర్షపాతం నమోదు కావడంతో శ్రీశైలం గేట్లు తెరుచుకోలేదు. ఈసారి ఊహించని వరదతో రావడంతో ప్రాజెక్టు

మిగతా 12వ పేజీలో...

ఆశలు జలసమాధి

ఢిల్లీలోని రావూస్ ఐఏఎస్ కోచింగ్ సెంటర్ బేస్‌మెంట్‌లోకి భారీగా పోటెత్తిన వరద నీరు
పార్కింగ్, స్టోర్‌రూమ్‌గా వాడాల్సిన చోట లైబ్రరీ
ఘటనలో ముగ్గురు సివిల్స్ అభ్యర్థుల మృతి
మృతుల్లో.. బిహార్‌కు చెందిన తానియా సోని
24 ఏళ్లుగా సింగరేణిలో పనిచేస్తున్న ఆమె తండ్రి
కోచింగ్ సెంటర్ యజమాని సహా ఇద్దరి అరెస్ట్
సోని మృతిపై సీఎం రేవంత్, కిషన్‌రెడ్డి దిగ్భ్రాంతి
వ్యవస్థల వైఫల్యం వల్లే ఈ దారుణం: రాహుల్

నా బాధ చెప్పడానికి మాటలు రావట్లేదు. గొంతు పెగలట్లేదు. తానియా సోని నా పెద్ద కుమార్తె. ఏదో సాధించాలని పెద్ద పెద్ద కలలు కనేది. నా బిడ్డ ఇలా చనిపోతుందని ఊహించలేదు. ఇప్పుడేం చేయాలో కూడా మాకు తోచట్లేదు.
- విజయ్‌కుమార్
(తానియాసోని తండ్రి)

న్యూఢిల్లీ, హైదరాబాద్, శ్రీరాంపూర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సివిల్స్ సాధించాలనే తమ కలలను సాకారం చేసుకునేందుకు దేశ రాజధాని ఢిల్లీ బాట పట్టారా ముగ్గురూ! ఐఏఎస్, ఐపీఎస్ వంటి సర్వీసుల్లో చేరి ఏదో సాధించాలని ఆశపడ్డారు. కానీ.. తమ లక్ష్యాన్ని చేరుకునేలోపే.. చదువులో నిమగ్నమై.. జలసమాధి అయిపోయారు. దేశరాజధాని ఢిల్లీలో శనివారం జరిగిందీ దుర్ఘటన. సెంట్రల్ ఢిల్లీలోని పాత రాజేంద్ర నగర్ కోచింగ్ సెంటర్లకు ప్రధాన కేంద్రం. దేశం నలుమూలల నుంచి సివిల్స్ సహా ఇతర కోచింగ్‌ల కోసం విద్యార్థులు వస్తుంటారు. అక్కడే రావూస్ ఐఏఎస్

మిగతా 2వ పేజీలో...


తానియా సోని (ఫైల్)


హైదరాబాద్‌లోని మూసాపేటలో అమ్మవారికి బోనం తీసుకెళ్తున్న భక్తులు

బోనమెత్తిన భాగ్యనగరం

హైదరాబాద్‌లో ఘనంగా ఉత్సవాలు.. పాత బస్తీలో అంబరాన్నంటిన వేడుకలు
లాల్ దర్వాజ గుడికి పోటెత్తిన భక్తజనం.. అమ్మవారి సన్నిధిలో ప్రముఖుల పూజలు

హైదరాబాద్ సిటీ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): నెత్తిన బోనమెత్తిన ఆడబిడ్డల భక్తి పారవశ్యం.. అమ్మవారు ఆవహించి సిగమూగిన శివసత్తుల పూనకం.. ఒంటి నిండా పసుపు ధరించి, ముఖానికి మెరిసే రంగులద్ది, చేతిలో కొరడా ఝుళిపిస్తూ పోతరాజుల వీరంగం.. డప్పు చప్పుళ్లు, పోరగాళ్ల చిందుల నడుమ ఆదివారం హైదరాబాద్ వ్యాప్తంగా బోనాల పండుగ జోరుగా సాగింది. ముఖ్యంగా పాత బస్తీ ప్రాంతంలోని అమ్మవారి ఆలయాల్లో వేడుకలు అంబరాన్నంటాయి. ఇక్కడి ప్రముఖ ఆలయమైన లాల్‌దర్వాజ సింహవాహిని మహంకాళి దేవస్థానంలో ఉత్సవాలు వైభవంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచే అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. మహాకాళికి కొత్త బట్టలు పెట్టి, బోనం సమర్పించి మొక్కులు

మిగతా 14వ పేజీలో...



వైద్యశాఖలో యూనియన్ నేతలకూ బదిలీ!

ఆఫీస్ బేరర్ లేఖలతో ట్రాన్స్‌ఫర్ ఆపుకొన్న వారిపై వైద్యశాఖ కొరడా
సుమారు 250 మంది నేతల ఆఫీస్ బేరర్ లేఖలు రద్దు 14

తెలంగాణకు కరెంటు వద్దా?

ఎన్టీపీసీ నాలుగు సార్లు లేఖలు రాసినా ఎందుకు స్పందించరు?
మీ అలసత్వంతో 2,400 మెగావాట్ల విద్యుత్ ఇతర రాష్ట్రాలకు వెళ్లే పరిస్థితి
సర్కారుపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శ
రామగుండం ఎన్టీపీసీ-2 ప్రాజెక్టు పీపీఏకు ముందుకు రావటం లేదని వెల్లడి
కేంద్రం సహకరిస్తున్నా పట్టించుకోవటం లేదని ఆరోపణ



న్యూఢిల్లీ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రామగుండం మెగా పవర్ ప్లాంట్ల పీపీఏపై ఎన్టీపీసీ ఎన్నిసార్లు లేఖలు రాసినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జీ కిషన్ రెడ్డి ఆరోపించారు. తెలంగాణలో ఉత్పత్తి అయ్యే విద్యుత్తుపై రాష్ట్రానికే తొలి హక్కు ఉంటుందని, అయితే, రాష్ట్ర ప్రభుత్వ అలసత్వంతో ఈ కరెంటు ఇతర రాష్ట్రాలకు వెళ్లే పరిస్థితి తలెత్తవచ్చని హెచ్చరించారు. తెలంగాణకు విద్యుత్

మిగతా 12వ పేజీలో...

దమ్ముంటే కొడంగల్‌లో పోటీ చెయ్
డిపాజిట్ కూడా దక్కనివ్వం.. మజ్లిస్ గోడ మీది పిల్లి
అక్బరుద్దీన్‌కు కేంద్ర మంత్రి బండి సంజయ్ సవాల్ 12

బెయిల్ పిటిషన్లలో జడ్జిలకు కామన్ సెన్స్ అవసరం



» సీజేఐ జస్టిస్ చంద్రచూడ్

బెంగళూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): బెయిల్ పిటిషన్ల విచారణ సందర్భంగా న్యాయమూర్తులకు కామన్ సెన్స్ అవసరమని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ అన్నారు. కొన్ని ముఖ్యమైన కేసుల్లో ఏదైనా అనుమానాస్పదంగా ఉంటే వారు బెయిల్ మంజూరు చేయకుండా సేఫ్‌గా తప్పుకోవడానికే ఇష్టపడుతున్నారని వ్యాఖ్యానించారు. అయితే ప్రతి కేసునూ నిస్సందేహంగా పరిశీలించడానికి ధ్రుడమైన ఇంగిత జ్ఞానం కావాలని పేర్కొన్నారు. బెంగళూరు లా యూనివర్సిటీ ఆధ్వర్యంలో 'కంపారిటివ్ ఈక్వాలిటీ అండ్ యాంటీ డిస్క్రిమినేషన్' అనే అంశంపై ఆదివారం జరిగిన సదస్సులో న్యాయవాదులు, విద్యార్థులను ఉద్దేశించి చీఫ్ జస్టిస్ ప్రసంగించారు. ట్రయల్ కోర్టుల్లో బెయిల్ పొందాల్సిన వ్యక్తులు అక్కడ సాధ్యం కాకపోవడంతో హైకోర్టులకు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. అక్కడా బెయిల్ లభించకపోతే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తున్నారని అన్నారు. ఈ జాప్యం వలన ఏకపక్ష అరెస్టులను ఎదుర్కొంటున్న వారికి మరిన్ని ఇబ్బందులు తప్పడం లేదని చెప్పారు. ప్రతిపక్షాల ముఖ్యులు, కార్యకర్తలు, విద్యావేత్తలు, జర్నలిస్టులను నిర్బంధించడం ద్వారా రాజకీయ ప్రేరేపిత విధానంలో ప్రభుత్వ అధికారులు ప్రవర్తించినట్టు కనిపిస్తోందని అన్నారు.

బాల్య వివాహాల నిషేధ చట్టం అన్ని మతాల వారికీ వర్తింపు

» మినహాయింపులు లేవు.. కేరళ హైకోర్టు స్పష్టీకరణ

కోచి, జూలై 28: బాల్య వివాహాల నిషేధ చట్టం అన్ని మతాల వారికీ వర్తిస్తుందని కేరళ హైకోర్టు స్పష్టం చేసింది. ఇందులో ఎలాంటి మినహాయింపులు ఉండవని తెలిపింది. తొలుత అందరూ భారత పౌరులని, ఆ తరువాతే ఆయా మతాల సభ్యులని పేర్కొంది. బాల్య వివాహాన్ని చేయించారన్న కారణంతో 2012లో పాలక్కాడ్‌కు చెందిన ఓ వ్యక్తిపై నమోదైన కేసును కొట్టివేయడానికి నిరాకరిస్తూ న్యాయమూర్తి జస్టిస్ పి.వి.కున్హికృష్ణన్ ఈ వ్యాఖ్యలు చేశారు. ముస్లిం పర్సనల్ లా ప్రకారం రజస్వల అయిన తరువాత అంటే 15 ఏళ్లు నిండిన తరువాత బాలికను పెళ్లి చేయవచ్చని, ఇది బాల్య వివాహం పరిధిలోకి రాదని పిటిషనర్ వాదించారు. ఈ వాదనతో న్యాయమూర్తి ఏకీభవించలేదు. బాల్య వివాహ నిరోధక చట్టం అన్ని మతాల వారికి వరిస్తుందని తెలిపారు. బాలికలకు పెళ్లి చేయడం అంటే విద్య, ఆరోగ్యం వంటి వారి ప్రాథమిక హక్కులను హరించడమేనన్నారు.

అయోధ్య మసీదుకిచ్చిన స్థలం నాది!

» సుప్రీంకోర్టును ఆశ్రయిస్తానన్న ఢిల్లీ మహిళ

లఖ్‌నవూ, జూలై 28: రామజన్మభూమి-బాబ్రీ మసీదు వివాదంలో సుప్రీంకోర్టు తీర్పు మేరకు అయోధ్యలోని ధన్నీపూర్ గ్రామంలో మసీదు నిర్మాణానికి ప్రభుత్వం కేటాయించిన ఐదెకరాల స్థలం తన కుటుంబానికి చెందినదని ఢిల్లీకి చెందిన మహిళ రాణీ పంజాబీ చెప్పారు. ధన్నీపూర్ గ్రామంలో తమ కుటుంబానికి 28.35 ఎకరాల భూమి ఉందని, అందులోనే 5 ఎకరాలను మసీదు కోసం ప్రభుత్వం కేటాయించిందని ఆమె తెలిపారు. స్థల యాజమాన్యానికి సంబంధించిన అన్ని పత్రాలూ తమ వద్ద ఉన్నాయని, స్థలాన్ని తిరిగి సొంతం చేసుకునేందుకు సుప్రీంకోర్టును ఆశ్రయిస్తానని ఆమె పీటీఐకి తెలిపారు. 1983వ సంవత్సరం వరకు ఆ భూమిలో తాను, తన కుటుంబం వ్యవసాయం చేశామని, తన తండ్రి ఆరోగ్యం క్షీణించడంతో చికిత్స కోసం ఢిల్లీకి వచ్చి స్థిరపడ్డామని చెప్పారు. ఆ భూమిలో మసీదు నిర్మించడంపై తనకేమీ అభ్యంతరం లేదని, అయితే ప్రభుత్వం తనకూ న్యాయం చేయాలని కోరుతున్నానని చెప్పారు. అయితే, మసీదు నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన ఇండో-ఇస్లామిక్ కల్చరల్ ఫౌండేషన్ అధ్యక్షుడు, సున్నీ సెంట్రల్ వక్ఫ్ బోర్డు చైర్మన్ జుఫర్ ఫారూఖీ ఆమె వాదనను తోసిపుచ్చారు. ఆమె వాదనను 2021లోనే అలహాబాద్ హైకోర్టు కొట్టివేసిందన్నారు. తాము ఇప్పటికే అనేకసార్లు రాణిని కలిసి, ఆధారాలు చూపించాలని కోరామని, అయితే, ఆమె చూపలేదని ఫౌండేషన్ సభ్యుడొకరు చెప్పారు. కాగా, మసీదు నిర్మాణం ప్రాజెక్టు పనులు ఈ ఏడాది అక్టోబరులో ప్రారంభం కానున్నట్టు జుఫర్ ఫారూఖీ తెలిపారు. మసీదు డిజైన్లను తిరిగి రూపొందించడం వల్ల నిర్మాణంలో జాప్యం జరిగిందని, నిధుల సమీకరణకు సంబంధించి ఎఫ్‌సీఆర్ఏ సర్టిఫికెట్ కూడా ఇంకా రాలేదని చెప్పారు.

సీయూఈటీ ఫలితాల వెల్లడి

న్యూఢిల్లీ, జూలై 28: అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన కామన్ యూనివర్సిటీ ఎంట్రెన్స్ టెస్ట్ (సీయూఈటీ-యూజీ) పరీక్షల ఫలితాలను ఆదివారం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) వెల్లడించింది. ఈ పరీక్షలకు సంబంధించిన జవాబుల 'కీ'ని ఈ నెల ఏడో తేదీన విడుదల చేసింది. వేయి మందికిపైగా అభ్యర్థులకు సమస్యలు ఎదురుకావడంతో వారి కోసం ఈ నెల 19న ప్రత్యేకంగా రీటెస్ట్ జరపాల్సి వచ్చింది. ఈ కారణంగా ఫలితాల వెల్లడిలో జాప్యం జరిగింది. ముందుగా నిర్ణయించినదాని ప్రకారమయితే జూన్ 30నే ఫలితాలు వెల్లడి కావాల్సి ఉండగా, ఇతర పరీక్షల్లో అక్రమాలు జరిగినట్టు ఆరోపణలు రావడంతో వీటి విడుదలను కూడా ఎన్‌టీఏ జాప్యం చేసింది. 261 సెంట్రల్, స్టేట్, డీమ్డ్, ప్రయివేటు వర్సిటీల్లో ప్రవేశాల కోసం 13.4 లక్షల విద్యార్థులు ఈ పరీక్షలు రాశారు.

మెజార్టీ బడి పిల్లలు వ్యాయామ విద్యకు దూరం

న్యూఢిల్లీ, జూలై 28: ప్రపంచంలో అత్యధిక శాతం బడి పిల్లలకు కనీస వ్యాయామ విద్య అందుబాటులో లేదని యునెస్కో పేర్కొంది. ఈ మేరకు 'గ్లోబల్ స్టేట్ ఆఫ్ ప్లే' పేరిట తొలిసారి ఫిజికల్ ఎడ్యుకేషన్‌పై రూపొందించిన నివేదికను తాజా వెల్లడించింది. నివేదిక ప్రకారం... 58 శాతం దేశాలు మాత్రమే బాలికలకు శారీరక విద్యను తప్పనిసరి చేశాయి. 7 శాతం దేశాలు మాత్రమే అబ్బాయిలతో అమ్మాయిలు సమానంగా వ్యాయామ విద్యను నేర్చుకోవడానికి అవకాశం కల్పిస్తున్నాయి. సగం మంది ప్రాథమిక విద్యను అభ్యసించే పిల్లలు, ప్రతి ముగ్గురిలో ఇద్దరు మాధ్యమిక స్థాయి స్కూల్ పిల్లలకు వారంలో కనీసం నిర్వహించవల్సిన ఫిజికల్ ఎడ్యుకేషన్ తరగతులు జరగడం లేదని తెలిపింది. అలాగే ప్రపంచవ్యాప్తంగా ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి ఇద్దరు ఉపాధ్యాయుల్లో ఒకరి కంటే తక్కువ మందే వ్యాయామ విద్యలో శిక్షణ పొందారని పేర్కొంది. మూడింట రెండొంతుల దేశాలు తమ విద్యా బడ్జెట్‌లో 2 శాతం కూడా కేటాయించడం లేదని యునెస్కో తన నివేదికలో తెలిపింది.

సునాక్ స్థానం కోసం భారత సంతతి మహిళ పోటీ

» బ్రిటన్ కన్జర్వేటివ్ పార్టీ అధ్యక్ష రేసులో ప్రీతి



లండన్, జూలై 28: బ్రిటన్ ప్రతిపక్ష కన్జర్వేటివ్ పార్టీ అధ్యక్ష రేసులో మొదటి సారిగా ఓ మహిళ, భారత సంతతి వ్యక్తి అయిన ప్రీతి పటేల్ (52) పోటీ పడుతున్నారు. ఈమె గతంలో బ్రిటన్ హోం సెక్రటరీగా పని చేశారు. ఈ నెల 4న బ్రిటన్‌లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రిషీ సునాక్ నేతృత్వంలోని కన్జర్వేటివ్ పార్టీ పరాజయం పాలైన సంగతి తెలిసిందే. దీనికి బాధ్యత వహిస్తూ జూలై 5న రిషీ సునాక్ తన పదవికి రాజీనామా చేశారు. దాంతో కన్జర్వేటివ్ పార్టీకి నూతన అధ్యక్షుడిని ఎన్నుకోవడం అనివార్యమయింది. కాగా, సోమవారం నామినేషన్ల ప్రక్రియ ముగియనుంది. ఇప్పటి వరకు ప్రీతి పటేల్‌తో పాటు మరో నలుగురు తమ నామినేషన్లను దాఖలు చేశారు. నామినేషన్లను దాఖలు చేసిన వారిలో మాజీ మంత్రులు జేమ్స్ క్లెవర్లీ, టామ్ తుగెందాత్, మెల్ స్ట్రైడ్, రాబర్ట్ జెనరిక్ ఉన్నారు.

పరిశోధన రంగంలో బెంగళూరుకు భారీ లబ్ధి

» కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మల



బెంగళూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పరిశోధనలు, ఆవిష్కరణలు, అభివృద్ధికి దోహదపడేలా బెంగళూరుకు భారీగా లబ్ధి చేకూరనుందని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టాక తొలిసారి బెంగళూరుకు వచ్చిన ఆమె మల్లేశ్వరంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం మీడియాతో మాట్లాడారు. వ్యవసాయ రంగంలో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అమలు చేయనుండటం బెంగళూరుకు అనుకూలం కానుందన్నారు. అంతరిక్ష ప్రయోగాలకు పెద్దమొత్తంలో నిధి (వెంచర్ కేపిటల్) ఇచ్చామని, ఇస్రో సంబంధిత పనులు ఇక్కడే కొనసాగుతాయని పేర్కొన్నారు. స్టార్టప్‌లపై ఏంజెల్ టాక్స్ రద్దు చేశామనీ, అది కూడా బెంగళూరు అభివృద్ధికి తోడ్పడుతుందన్నారు.

ఆశలు జల సమాధి

(మొదటి పేజీ తరువాయి)

అకాడమీ కూడా ఉంది. శనివారం సాయంత్రం 7 గంటల ప్రాంతంలో.. కోచింగ్ సెంటర్‌లోకి వరద నీరు పోటెత్తింది. ఆ సమయంలో కొందరు విద్యార్థులు ఆ కోచింగ్ సెంటర్‌లోని బేస్‌మెంట్‌లో ఉన్న లైబ్రరీలో చదువుకుంటున్నారు. వారంతా చదువులో నిమగ్నమై ఉండగా వరద నీరు చుట్టుముట్టింది. అక్కడ ఉన్నవారిలో కొంతమంది తప్పించుకోగా.. బిహార్‌కు చెందిన తానియా సోని (25), ఉత్తరప్రదేశ్‌కు చెందిన శ్రేయ యాదవ్ (25), కేరళకు చెందిన నెవిన్ డాల్విన్ (28) మృతి చెందారు. విషయం తెలియగానే ఢిల్లీ పోలీసులు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు అక్కడికి చేరుకుని.. వరదలో చిక్కుకున్న విద్యార్థులను బయటికి తీసే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. కాగా తానియా సోని.. తండ్రి విజయ్ కుమార్ బిహార్‌లోని ఔరంగాబాద్ ప్రాంత వాసి. 24 సంవత్సరాలుగా ఆయన సింగరేణిలో పనిచేస్తున్నారు. ప్రస్తుతం మంచిర్యాల్ జిల్లా శ్రీరాంపూర్‌లోని ఎస్ఆర్పీ1 గనిలో సీనియర్ మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పెద్ద కుమార్తె తానియా సోని డిగ్రీ, పీజీ ఢిల్లీలోనే పూర్తిచేసింది. సివిల్స్ కోచింగ్ కోసం ఈ ఏడాదే రావూస్‌లో చేరింది. ఈ ప్రమాదంలో ఆమె మరణించిందన్న విషయం తెలియగానే విజయ్‌కుమార్ కుటుంబం వెంటనే బయల్దేరి నాగపూర్‌కు చేరుకుని.. అక్కణ్నుంచీ విమానంలో ఢిల్లీకి చేరుకున్నారు. కాగా.. ఈ ప్రమాదం నేపథ్యంలో కోచింగ్ సెంటర్ యజమాని అభిషేక్ గుప్తా, సెంటర్ కో-ఆర్డినేటర్ దేశ్‌పాల్ సింగ్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. భారత న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని 105, 106(1), 115(2), 290, 35 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను.. కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు. కాగా.. ఈ ఘటనలో శ్రేయ యాదవ్ మరణించిన విషయాన్ని తాను న్యూస్ చానళ్ల ద్వారానే తెలుసుకున్నానని ఆమె బంధువు ధర్మేందర్ యాదవ్ తెలిపారు. 'ఆమెతో ఫోన్‌లో మాట్లాడడానికి నేను ప్రయత్నించాను. కానీ స్విచాఫ్ వచ్చింది. కోచింగ్ సెంటర్ నంబర్ కూడా పని చేయలేదు. దీంతో వెంటనే ఘజియాబాద్ నుంచి బయల్దేరి ఢిల్లీకి చేరుకుని ఆమె రూమ్‌కు వెళ్లాను. ఆ గదికి తాళం వేసి ఉంది. ఆమె కోసం అకాడమీకి వెళ్తే.. తనను ఆస్పత్రికి తీసుకెళ్లారని పోలీసులు చెప్పారు. అక్కడికి వెళ్తే.. ఆమె మృతదేహాన్ని చూపార'ని వాపోయారు. ప్రమాదం శనివారం సాయంత్రం జరిగితే.. ఆదివారం మధ్యాహ్నం దాకా మృతదేహాలను తమకు చూపలేదని మృతుల కుటుంబసభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



నెవిన్ డాల్విన్(ఫైల్)



శ్రేయ యాదవ్(ఫైల్)



ఢిల్లీలోని కరోల్‌బాగ్ మెట్రో స్టేషన్ దగ్గర అభ్యర్థుల నిరసన ప్రదర్శన

పార్కింగ్ స్థలంలో లైబ్రరీ

రావూస్ ఐఏఎస్ కోచింగ్ సెంటర్ నిర్మాణంలో నిబంధనల ఉల్లంఘన జరిగినట్టు అధికారులు గుర్తించారు. ఈ కోచింగ్ సెంటర్‌కు సంబంధించి 2021లో మూడంతస్తుల భవన నిర్మాణ ప్లాన్‌కు అనుమతి తీసుకున్నారు. సెల్లార్‌ను పార్కింగ్, సరకు నిల్వ (స్టోర్ రూమ్) కోసమే వినియోగిస్తామని చెప్పి.. అగ్నిమాపక శాఖ నుంచి నిరభ్యంతర పత్రం కూడా తీసుకున్నారు. కానీ, నిబంధనలకు విరుద్ధంగా అక్కడ లైబ్రరీ ఏర్పాటు చేసినట్లు అధికారులు చెప్పారు. శనివారం సాయంత్రం 7.10 గంటల సమయంలో ఈ ఘటన గురించి తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఐదుగురు నీటిని తోడిపోసే యంత్రాలతో హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. కానీ, లోపలి నుంచి నీరు తోడి బయటకు పోద్దామంటే.. అప్పటికే వాననీటితో రోడ్డు నిండిపోయింది. దీంతో ఆ నీరు పోయే దాకా వేచి ఉండి, ఆ తర్వాత బేస్‌మెంట్‌లోంచి నీటిని బయటకు పంప్ చేశామని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. కాగా, ఈ ఘటనపై స్పందించిన ఢిల్లీ మేయర్ షెల్లీ ఒబెరాయ్.. రాజకీయాలకు అతీతంగా చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. దీనిపై న్యాయ విచారణకు ఆదేశించినట్టు ఆప్ మంత్రి అతిశీ తెలిపారు. మరోవైపు.. ఢిల్లీలో నిబంధనలకు ఉల్లంఘిస్తున్న కోచింగ్ సెంటర్లపై ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్ కొరడా ఝళిపించడం ప్రారంభించింది.



మృతులకు తోటి సివిల్స్ అభ్యర్థుల నివాళి

రేవంత్ రెడ్డి, కిషన్ రెడ్డి పరామర్శ

తానియా సోని మృతిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆమె తండ్రి విజయ్‌కుమార్‌ను ఫోన్లో పరామర్శించారు. ఢిల్లీ పోలీసులు, ఇతర అధికారులతో మాట్లాడి.. పెండింగ్‌లో ఉన్న అన్ని ఫార్మాలిటీసన్నింటినీ త్వరగా పూర్తిచేయడంలో చొరవ తీసుకోవాలని ఢిల్లీలోని తన కార్యాలయాన్ని కిషన్ రెడ్డి ఆదేశించారు. సీఎం రేవంత్ రెడ్డి కూడా జరిగిన ఘటనలపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్‌తో మాట్లాడిన రేవంత్.. మృతుల్లో ఎవరైనా రాష్ట్రవాసులు ఉంటే బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయం అందించాలని ఆదేశించారు. దీనికి గౌరవ్.. తెలంగాణ వాసులెవరూ లేరని, మృతుల్లో తానియా సోని బిహార్‌కు చెందిన యువతి అని, ఆమె తండ్రి విజయ్‌కుమార్ సింగరేణిలో సీనియర్ మేనేజర్‌గా మంచిర్యాలలో విధులు నిర్వహిస్తున్నారని వివరించారు. దీంతో.. వారి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయసహకారాలు అందించాలని రెసిడెంట్ కమిషనర్‌ను సీఎం ఆదేశించారు.

లోకం తీరు



వ్యవస్థల వైఫల్యంవల్లే: రాహుల్



రావూస్ ఐఏఎస్ కోచింగ్ సెంటర్‌ను వరద నీరు ముంచెత్తిన ఘటనలో ముగ్గురు విద్యార్థులు మృతి చెందడంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వ్యవస్థల వైఫల్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఆయన ఆరోపించారు. "ఢిల్లీలోని ఓ భవనం బేస్‌మెంట్‌లో నీరు చేరి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు మృతి చెందడం చాలా బాధాకరం. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. వ్యవస్థల వైఫల్యం వల్లే ఈ ఘటన జరిగింది. నిర్మాణం సరిగా లేకపోవడం, ప్రణాళికలోపం, సంస్థల బాధ్యతారాహిత్యం వల్ల సామాన్యులు ప్రాణాలు కోల్పోతున్నారు. సురక్షితంగా, సౌకర్యవంతంగా జీవించడం ప్రతి పౌరుడి హక్కు.. దానిని అందించడం ప్రభుత్వాల బాధ్యత" అని రాహుల్ వ్యాఖ్యానించారు.

స్వాతి మాలివాల్‌కు చేదు అనుభవం

రావూస్ కోచింగ్ సెంటర్ విషాదం గురించి తెలియగానే ఆప్ ఎంపీ స్వాతి మలివాల్ ఘటనా స్థలానికి వెళ్లారు. విద్యార్థుల ఆందోళనకు సంఘీభావం ప్రకటించేందుకు వెళ్లగా ఆమెకు చేదు అనుభవం ఎదురైంది. పలువురు విద్యార్థులు ఆమెపై మండిపడ్డారు. ఈ అంశానికి రాజకీయ రంగు పులమవద్దని నినాదాలు చేశారు. ఆ తర్వాత స్వాతి మలివాల్ మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఈ మరణాలు ప్రకృతి వైపరీత్యాల వల్ల జరిగినవి కావని, వీటిని 'హత్య'లుగానే భావించాలని అన్నారు. బాధ్యులైన ప్రభుత్వ అధికారులందరిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని, మృతుల కుటుంబానికి రూ.కోటి చొప్పున పరిహారం అందించాలని ఆమె డిమాండ్ చేశారు.

ఆశించిన ఫలితాలు ఎందుకు రాలేదు?

కారణాలు ఏమిటో సమీక్షించాలి.. పునరావృతం కాకుండా కార్యాచరణ

» బీజేపీ సీఎంల సమావేశంలో నిర్ణయం

» సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

» కొత్తవి ప్రారంభించి పర్యవేక్షించాలి

» సీఎంలకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు

న్యూఢిల్లీ, జులై 28 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అనుకున్న విధంగా ఫలితాలను సాధించపోవడానికి కారణాలను సమీక్షించుకుని, భవిష్యత్‌లో ఓటమి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని రెండు రోజులపాటు ఢిల్లీలో జరిగిన బీజేపీ ముఖ్యమంత్రుల సమావేశం నిర్ణయించింది. శనివారం నీతీఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్‌కు హాజరైన బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఆ సమావేశం తర్వాత.. పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన సదస్సుకు హాజరయ్యారు. ఆదివారం జరిగిన రెండోరోజు సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర పథకాలను కిందిస్థాయి వరకు అమలయ్యేలా చూడాలని ముఖ్యమంత్రులను కోరారు. నీతీఆయోగ్ సమావేశంలో నిర్ణయించిన విధంగా 2047 కల్లా వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించేందుకు వీలుగా ప్రభుత్వ పథకాలను వేగంగా అమలు చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై), హర్ ఘర్ జల్ వంటి పథకాల ప్రయోజనాలను పూర్తిస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొత్త పథకాలను ప్రారంభించాలని, వాటి అమలును నిరంతరం పర్యవేక్షించాలని, సుపరిపాలన విభాగాలను ఏర్పాటు చేయాలని మోదీ సూచించారు. వివిధ రాష్ట్రాల్లో ఎన్నికల ఫలితాలపై ముఖ్యమంత్రులు తమ అభిప్రాయాలను వెల్లడించడంతోపాటు ఆయా రాష్ట్రాల్లో తాము అమలుచేస్తున్న పథకాల గురించి వివరించినట్లు తెలిసింది. రెండ్రోజుల సీఎంల సమావేశంలో సంస్థాగత వ్యవహారాలను, రాజకీయాలను పెద్దగా చర్చించలేదని.. పథకాల అమలుపైనే దృష్టి కేంద్రీకరించారని పార్టీ వర్గాలు తెలిపాయి. పార్టీకి, ప్రభుత్వానికి మధ్య సమన్వయం ఉండేలా చూడాలని పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ప్రధానిని కోరినట్లు తెలిసింది. అదేవిధంగా కేంద్ర పథకాలను రాష్ట్రాల్లో మార్చవద్దని సూచించినట్లు సమాచారం. మధ్యప్రదేశ్‌లో అమలు చేస్తున్న లాడ్లీ బీమా యోజన, మహారాష్ట్రలో ప్రారంభించిన లడ్కీ బీమా యోజన పథకాలను, యూపీలో గ్రామ సచివాలయాల డిజిటలీకరణ వంటి కార్యక్రమాలను ఇతర బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కూడా అమలు చేయాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. కాగా, సమావేశం తర్వాత.. "సుపరిపాలనతో ప్రజల ఆకాంక్షలను తీర్చేందుకు బీజేపీ అవిశ్రాంతంగా పనిచేస్తోంది. బీజేపీ పాలిత రాష్ట్రాలు సుపరిపాలనకు ఉదాహరణలు" అని ప్రధాని మోదీ ఎక్స్‌లో పోస్టు చేశారు.

నల్లమల చెంచులే టైగర్ ట్రాకర్లు

వన్యప్రాణుల సమాచారమంతా సేకరించారు

» ప్రపంచంలోని 70% పులులు భారత్‌లోనే

» ఒలింపిక్స్‌లో మన ఆటగాళ్లకు మద్దతివ్వండి

» 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ పిలుపు



న్యూఢిల్లీ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని నల్లమల అడవుల్లో నివసించే చెంచులు టైగర్ ట్రాకర్లని ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించారు. ఆదివారం 'మన్ కీ బాత్' 112వ ఎపిసోడ్‌లో భాగంగా ఆయన మాట్లాడారు. జూలై 29న పులుల దినోత్సవాన్ని ప్రపంచమంతా జరుపుకుంటోందని తెలిపారు. పులులు మన సంస్కృతిలో అంతర్భాగంగా ఉన్నాయని, వాటికి సంబంధించిన కథలను వింటూ మనమంతా పెరిగామని పేర్కొన్నారు. పులితో సామరస్యంగా ఎలా జీవించాలో అడవి చుట్టూ ఉన్న గ్రామాల్లో ప్రతి ఒక్కరికీ తెలుసని చెప్పారు. మనుషులు, పులుల మధ్య ఎప్పుడూ ఘర్షణలు జరగని ప్రాంతాలు కూడా దేశంలో ఉన్నాయని తెలిపారు. "ఆంధ్రప్రదేశ్‌లో నల్లమల కొండలపై నివసించే 'చెంచు' తెగ కృషి చూసి మీరు కూడా ఆశ్చర్యపోతారు. వారు టైగర్ ట్రాకర్లుగా, అడవిలో వన్యప్రాణుల సంచారం గురించి ప్రతి సమాచారాన్ని సేకరించారు. దీంతో పాటు ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న అక్రమాలపైనా నిఘా పెట్టారు" అంటూ మోదీ కొనియాడారు. ఇటువంటి చర్యలతో దేశంలో పులుల సంఖ్య ఏటా పెరుగుతోందని, ప్రస్తుతం ప్రపంచంలోని 70 శాతం పులులు మన దేశంలోనే ఉన్నాయని ప్రధాని వివరించారు.

1.5 లక్షల కోట్లు దాటిన ఖాదీ వ్యాపారం

ఖాదీ గ్రామోద్యోగ్ వ్యాపారం తొలిసారి రూ.1.5 లక్షల కోట్లు దాటిందని, దేశ వ్యాప్తంగా ఖద్దరు, చేనేత విక్రయాలు 400శాతం పెరగడం ద్వారా పెద్ద సంఖ్యలో కొత్త ఉద్యోగావకాశాలు ఏర్పడుతున్నాయని మోదీ అన్నారు. ఇప్పటి వరకూ ఖద్దరు దుస్తులు కొనుగోలు చేయనివారు వెంటనే వాటిని కొనడం ప్రారంభించాలని కోరారు. పారిస్ ఒలింపిక్స్‌లో బరిలోకి దిగుతున్న భారత క్రీడాకారులకు మద్దతుగా నిలబడాలని దేశ ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. అలాగే అసోంలోని 'మొయిదమ్స్'ను యునెస్కో ప్రపంచ వారసత్వ జాబితాలో చేర్చడం ప్రతి భారతీయుడు సంతోషించాల్సిన అంశమని అన్నారు. మాదకద్రవ్యాలపై పోరాటంలో భాగంగా ప్రభుత్వం 'మానస్' పేరుతో ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేసిందని, డ్రగ్స్‌కు సంబంధించిన ఎలాంటి సమాచారం ఉన్నా 1933 టోల్‌ఫ్రీ నంబరుకు కాల్ చేసి చెప్పాలన్నారు. ప్రపంచంలోని పులుల్లో 70శాతం భారత్‌లోనే ఉన్నాయని ఇది మనమంతా గర్వపడాల్సిన విషయమని చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవం సమీపిస్తున్న నేపథ్యంలో జాతీయ జెండాతో సెల్ఫీలు దిగి హర్‌తిరంగా డాట్ కామ్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ దేశ ప్రజలను మోదీ కోరారు.

హెజ్‌బొల్లా దాడిలో చనిపోయిన చిన్నారులకు కన్నీటి వీడ్కోలు

» దాడికి ప్రతీకారం తప్పదని ఇజ్రాయెల్ హెచ్చరిక

» లెబనాన్‌లోని హెజ్‌బొల్లా స్థావరాలు ధ్వంసం



టెల్అవీవ్, జూలై 28: ఇజ్రాయెల్‌లోని గోలన్ హైట్స్‌లో సాకర్ ఆడుతూ శనివారం హెజ్‌బొల్లా రాకెట్ దాడిలో ప్రాణాలు కోల్పోయిన చిన్నారుల, యువత మృతదేహాలకు ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. వీరి మృతదేహాలను కడసారి చూసేందుకు భారీ సంఖ్యలో జనాలు వీధుల్లోకి వచ్చి కన్నీటి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన మంత్రులను ప్రజలు నిలదీశారు. 9 నెలలుగా హెజ్‌బొల్లా దాడులు జరుగుతున్నా తమను పట్టించుకోలేదని, ఏ మొహం పెట్టుకుని ఇక్కడకు వచ్చారని ప్రశ్నించారు. కాగా, లెబనాన్‌వైపు నుంచి హెజ్‌బొల్లా ప్రయోగించిన రాకెట్లు గోలన్ హైట్స్‌లో ఫుట్‌బాల్ గ్రౌండ్‌పై పడడంతో అక్కడ ఆడుతున్న ఐదుగురు చిన్నారులు, ఏడుగురు యువత ప్రాణాలు కోల్పోగా.. మరో 20మంది గాయపడ్డారు. ఈ ఘటన జరిగినప్పుడు అమెరికా పర్యటనలో ఉన్న ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు దాడి గురించి తెలుసుకుని అర్ధంతరంగా తన పర్యటన ముగించుకొని తిరిగి వస్తున్నట్లు ప్రకటించారు. కాగా ఈ దాడితో తమకు సంబంధం లేదని హెజ్‌బొల్లా చెబుతుండగా, పిల్లల ప్రాణాలకు ప్రతీకారం తప్పదని ఇజ్రాయెల్ హెచ్చరించింది. ఇజ్రాయెల్ ఇక యుద్ధంలోకి దిగుతుందని రక్షణ రంగ నిపుణులు పేర్కొన్నారు. ఆదివారం తూర్పు లెబనాన్‌లోని బక్కా వ్యాలీ, షబ్రిహ, బుర్జ్ అల్- షెమలీ, కఫార్ కిలా సహా పలు ప్రాంతాల్లోని హెజ్‌బొల్లా స్థావరాలను ధ్వంసం చేసినట్లు ఇజ్రాయెల్ ఆదివారం ప్రకటించింది.

నిత్యకల్యాణం... నగలతో పలాయనం

» 20 మంది మహిళలతో వివాహం

» మహారాష్ట్ర పోలీసులకు చిక్కిన నిత్య పెళ్లికొడుకు ఫిరోజ్ నియాజ్

పాల్ఘర్, జూలై28: విడాకులు తీసుకున్న మహిళలు, ఒంటరి వితంతువులే లక్ష్యంగా మ్యాట్రిమోని వెబ్‌సైట్‌లో అతను వివరాలు పెడతాడు. ఎవరైనా ఆకర్షితులైతే స్నేహం చేసి పెళ్లి చేసుకుంటాడు. ఆపై భాగస్వామికి చెందిన నగానట్రా తీసుకుని పరారవుతాడు. ఇలా ఏకంగా 20మంది మహిళల్ని మోసం చేసి పెళ్లిచేసుకున్నాక విలువైన వస్తువులతో ఉడాయించిన ఓ నిత్య పెళ్లికొడుకుని మహారాష్ట్ర పోలీసులు అరెస్టు చేశారు. ఇటీవల ఓ బాధితురాలు ఫిర్యాదుతో ఈ విషయం వెలుగులో కొచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. ఫిరోజ్ నియాజ్ షేక్ (43)ను బాధిత మహిళ మ్యాట్రిమోని వెబ్‌సైట్ ద్వారా కలిసింది. తర్వాత అతన్ని పెళ్లిచేసుకుంది. 2023 నవంబరులో ఆమె తాలూకు నగదు, ల్యాప్‌టాప్, ఇతరత్రా రూ.6.5లక్షల విలువైన వస్తువులతో షేక్ ఉడాయించాడు. నిందితుడు థానేలోని కల్యాణ్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించిన పోలీసులు... పాల్ఘర్ జిల్లాలో అదుపులోకి తీసుకున్నట్లు ఆదివారం తెలిపారు. 2015నుంచి ఇప్పటి దాకా 20 మందిని అతను పెళ్లిచేసుకున్నాడన్నారు.

వారంలోనే 1,674 కోట్లు

కమలా హారిస్‌కు వెల్లువెత్తుతున్న విరాళాలు



వాషింగ్టన్, జూలై 28: అమెరికా అధ్యక్ష రేసులోకి కమలా హారిస్ వచ్చాక వారం వ్యవధిలోనే ఆమె ప్రచారం కోసం రూ.1,674.45 కోట్ల(200 మిలియన్ డాలర్ల) విరాళాలు వచ్చాయి. ఆమె ప్రచార బృందం ఆదివారం ఈ విషయాన్ని వెల్లడించింది. గతంలో ఎన్నడూ ఇంత తక్కువ వ్యవధిలో అంత ఎక్కువ విరాళాలురాలేదని, ఆమె అభ్యర్థిత్వానికి వెల్లువెత్తుతున్న మద్దతును ఇది తెలియజేస్తోందని ఆ బృందం పేర్కొంది. అందు లో 66శాతం వరకు తొలిసారిగా విరాళాలిస్తున్న దాతల నుంచే వచ్చాయని హారిస్ ఫర్ ప్రెసిడెంట్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ మైకేల్ టేలర్ చెప్పారు. వచ్చే నెల చికాగోలో నిర్వహించే డీఎన్‌సీ(డెమొక్రటిక్ జాతీయ సదస్సు)లో కమల అభ్యర్థిత్వాన్ని అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. క్షేత్రస్థాయి కార్యాలయాలకు జనం, వలంటీర్లు పోటెత్తుతున్నారు. కమల బృందం చేతిలో డొనాల్డ్ ట్రంప్, జేడీ వాన్స్‌కు ఓటమి తప్పదు'అని టేలర్ అన్నారు. అయితే ఈ హోరాహోరీ పోటీలో గెలుపు-ఓటముల మధ్య ఓట్ల తేడా చాలా స్వల్పంగా ఉంటుందని పేర్కొన్నారు. కమలకు విశేషంగా మద్దతు పెరగడం నూతనోత్తేజాన్ని కలిగిస్తోందన్నారు. యువ ఓటర్లు, కార్మికులు, న్యాయవాదులు, బరాక్, మిషెల్ ఒబామా దంపతులు, అనేకమంది నాయకుల నుంచి కమలకు మద్దతు వెల్లువెత్తుతోందని చెప్పారు. పార్టీలోనూ ఆమె అభ్యర్థితానికి మద్దతు పెరుగుతోందన్నారు. గత వారంలోనే కమల బృందంలో 1,70,000 మంది కొత్త వలంటీర్లు చేరారని చెప్పారు. అమెరికావ్యాప్తంగా 2,300 కంటే ఎక్కువ కార్యక్రమాల ద్వారా క్షేత్రస్థాయిలో కమలకు మద్దతు కూడగడతామన్నారు. ఆన్‌లైన్, సాంప్రదాయ మీడియా ద్వారానూ ఆమెకు మద్దతు కూడగడుతున్నామని, కమల స్వయంగా టిక్‌టాక్‌లో చేరి లక్షలాదిమంది ఫాలోవర్లను పొందారని చెప్పారు.

తాగి గోల చేయొద్దన్నాడని చంపేశాడు

» ఉపాధ్యాయుడి మృతి, నిందితుడి పరారీ

అమీర్‌పేట, జూలై 28(ఆంధ్రజ్యోతి): తాగిన మైకంలో ఓ యువకుడు దారుణానికి పాల్పడ్డాడు. తాగి గోల చేయవద్దన్నందుకు గొడవ పడి గడ్డం గీసే కత్తితో దాడి చేసి తన రూమ్‌మేట్‌ను హతమార్చాడు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు బాయ్స్ హాస్టల్‌లో శనివారం అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. ఏపీలోని కర్నూలు జిల్లా ఆలమూరుకు చెందిన నీలి వెంకటరమణ.. హైదరాబాద్ అమీర్‌పేట్‌లోని ఓ ప్రైవేటు హాస్టల్‌లో ఉంటూ స్థానికంగా ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. అలాగే, ఏపీలోని ఏలూరు జిల్లా తంగళ్లపాడు సమీపంలో యాదవనగర్‌కు చెందిన గణేశ్(26) అదే హాస్టల్‌లో నెలన్నరగా వెంకటరమణ గదిలోనే ఉంటున్నాడు. హాస్టల్‌కు సమీపంలోని ఓ సెలూన్‌లో పని చేసే గణేశ్ శనివారం రాత్రి తన స్నేహితులతో కలిసి మద్యం తాగి వచ్చాడు. హాస్టల్ గదిలోకి వస్తూ తలుపును బలంగా కాలితో తన్నాడు. అప్పటికే గదిలో నిద్రపోతున్న వెంకటరమణ ఆ చప్పుడుకు మేల్కొని గణేశ్‌ను మందలించాడు. తాగిన మైకంలో గొడవ చేయవద్దని హెచ్చరించాడు. ఈ క్రమంలో ఇరువురి మధ్య వాగ్వాదం చెలరేగగా.. సహనం కోల్పోయిన గణేశ్ తన వద్ద ఉన్న గడ్డం గీసే కత్తితో వెంకటరమణపై దాడి చేశాడు. దీంతో వెంకటరమణ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా గణేశ్ పరారయ్యాడు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

బాలగోపాల్ సోదరి మాధవి కన్నుమూత

» మానవహక్కుల ఉద్యమంలో క్రియాశీల పాత్ర



హైదరాబాద్ సిటీ, జూలై28 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ మానవహక్కుల ఉద్యమనేత బాలగోపాల్ పెద్ద చెల్లెలు పి.మాధవి (70) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం తుదిశ్వాస విడిచారు. సికింద్రాబాద్‌లోని కస్తూర్బాగాంధీ మహిళా కళాశాలలో మాధవి కామర్స్ అధ్యాపకురాలిగా సుదీర్ఘకాలం సేవలందించారు. పీవోడబ్ల్యూ తొలితరం నాయకురాలిగా స్త్రీల హక్కుల పోరాటాల్లో పాల్గొన్నారు. ఏపీసీఎల్సీ మానవహక్కుల వేదికల్లోనూ క్రియాశీలపాత్ర పోషించారు. మానవ హక్కులకు సంబంధించిన పలు పుస్తకాలను తెలుగులోకి అనువదించారు. అమెరికాలో స్థిరపడిన మాధవి కుమారుడు ఆదిత్య మంగళవారం స్వదేశానికి రానున్నారు. బుధవారం ఉదయం వరకు చిక్కడపల్లిలోని స్వగృహంలో బంధు, మిత్రుల సందర్శనార్థం మాధవి భౌతికకాయాన్ని ఉంచనున్నారు. అదేరోజు మధ్యాహ్నం బన్సీలాల్‌పేట శ్మశానవాటికలో ఆమె అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మానవ హక్కుల ఉద్యమంలో మాధవి పాత్రను పీవోడబ్ల్యూ సంధ్య, సజయ తదితరులు గుర్తుచేసుకొన్నారు.

ఎడారి జీవితం!

ఏజెంట్ల మోసాలు, నకిలీ వీసాలు.. ప్రాణాలు దక్కితే చాలనే ఆశ

» పాస్‌పోర్టు లాక్కొని.. జీతాలివ్వరు

» చెప్పేది ఒకటి..చేయించేది మరోటి

» యజమాని దయపైనే జీవితం

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

ఏదో చేద్దామనుకుని వెళ్లి... ఇంకేదో చేస్తూ... ఎలా బయటపడాలో తెలియని దైన్యంలో కొట్టుమిట్టాడే జీవితాలు! సక్రమమైన విధానంలో, సరైన ఉద్యోగంలో చేరితే అంతా మేలే! ఏజెంట్ల మోసాల వలలో పడితే మాత్రం కష్టాలు చుట్టుముడతాయి. గల్ఫ్ వెళ్లాలనుకునే వారి అమాయకత్వాన్ని, బలహీనతను ఆసరాగా చేసుకుంటున్న ఏజెంట్లు లక్షల రూపాయలు వసూలు చేసి మోసం చేస్తున్నారు. కంపెనీల్లో ఉద్యోగాల పేరిట వీసాలు సృష్టించి గల్ఫ్ పంపిన తర్వాత అక్కడ పనులు లేక చాలామంది ఎడారుల్లో గొర్రెలు, ఒంటెలు కాపరులుగా ఒంటరిగా మగ్గిపోతున్నారు.

పాస్‌పోర్టు లాగేసుకుని...

ఇళ్లల్లో పనిచేసేందుకు వెళ్లే కార్మికుల వెతలు అన్నీఇన్నీకావు. గల్ఫ్‌కు వీసాపై వెళ్లాక కఫీల్ అక్కామా(యజమాని అనుమతి ముద్ర) వేస్తేనే ఆ దేశంలో ఉండేందుకు వీలవుతుంది. కొంతమంది యజమానులు మానవతా దృక్పథంతో కార్మికులను బాగానే చూస్తుంటారు. మరికొంతమంది యజమానులు నరకయాతన పెడుతుంటారు. ఇంట్లో పనికి వెళ్లిన వెంటనే యజమానిపాస్‌పోర్టు తీసేసుకుంటాడు. దాంతో గత్యంతరం లేక కష్టమైనా, నష్టమైనా అక్కడే పనిచేయాల్సి వస్తోంది. తిండి సరిగా పెట్టక, జీతాలు ఇవ్వక చాలా ఇబ్బందులకు గురి చేస్తారు. కొంతమంది కఫీల్‌లు పని సరిగా చేయడం లేదని కొడుతూ చిత్రహింసలకు గురి చేస్తారు. కుటుంబ సభ్యులతో మాట్లాడేందుకు ఫోన్ సౌకర్యం కూడా నిలుపుదల చేస్తారు. యజమానుల చిత్రహింసలు భరించలేక చాలా మంది పారిపోతూ బయటకు వచ్చేస్తుంటారు. అయితే వారి వద్ద పాస్‌పోర్టు లేకపోవడంతో అక్కడి పోలీసులు వెంటనే అరెస్టు చేసి జైల్లో పెడతారు. గల్ఫ్ దేశాల్లో ఇటీవల కాలంలో భారతీయుల మరణాలు ఎక్కువగా సంభవిస్తున్నాయి. కొంతమంది అనుమానాస్పద స్థితిలో మృతిచెందగా, మరి కొంతమంది హత్యలకు కూడా గురవుతారు. చాలామంది అనారోగ్యంతో మృతి చెందుతున్నారు. వీరిలో కొన్ని మృతదేహాలు స్వగ్రామం చేరుతుండగా, పాస్‌పోర్టు లేని మృతదేహాలు అనాథ శవాలుగా అక్కడే ఉండిపోవడం కడు దయనీయం.

మినీ గల్ఫ్‌గా రాజోలు దీవి..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి వేల సంఖ్యలో గల్ఫ్‌తో పాటు ఇతర దేశాలకు ఉపాధి కోసం వెళుతుంటారు. మినీ గల్ఫ్‌గా పేరొందిన రాజోలు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని సఖినేటిపల్లి, మలికిపురం, రాజోలు, మామిడికుదురు మండలాల నుంచి గల్ఫ్ దేశాలకు ఉపాధి కోసం వెళ్లే వారి సంఖ్య అధికం. గత కొన్ని సంవత్సరాల క్రితం అరబిక్ దేశాల్లో ద్రవ్యోల్బణం రేటు అధికంగా ఉండటంతో అక్కడికి వెళ్లిన వారిలో చాలా మంది ఆర్థికంగా స్థితిమంతులు కావడం నిజం! కష్టాలు అనుభవిస్తున్న వారు ఉండ టమూ అంతే నిజం!



గల్ఫ్‌లో వలస కార్మికుల దుస్థితి ఇదీ

కళ్లు పోయినా పట్టించుకోలేదు



దుబాయ్‌లో తొమ్మిదేళ్లపాటు పనిచేశా. ఫ్యాక్టరీలో పనిచేసే సమయంలో కెమికల్ కళ్లల్లో పడింది. రెండు కళ్లూ కనిపించకుండా పోయాయి. కంపెనీ ఎటువంటి సమాధానం చెప్పలేదు. చెకప్ కోసం సొంత డబ్బులతో వైద్యం చేయించుకోలేక ఆర్థిక ఇబ్బందులతో ఇటీవల స్వస్థలానికి వచ్చేశాను. గల్ఫ్‌లో కొన్నాళ్ల పాటు కష్టపడితే నా కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగుంటుందని వెళ్తే ఇప్పుడు ఇంటికొచ్చిన తరువాత ఎటువంటి ఉపాధి పనులకూ వెళ్ల లేని నిస్సహాయ పరిస్థితిలో పడిపోయాను.

- గనిశెట్టి రామాంజనేయులు, అంతర్వేది

ఆన్‌లైన్ ఆటకు బలైన డిగ్రీ విద్యార్థి

సారంగాపూర్, జూలై 28: ఆన్‌లైన్ ఆటలకు అలవాటు పడిన ఓ డిగ్రీ విద్యార్థి అందులో డబ్బులు పోగొట్టుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలంలోని గణేష్‌పల్లికి చెందిన సూర కృష్ణ (21) కొంతకాలంగా ఆన్‌లైన్ ఆటలకు అలవాటు పడ్డాడు. తండ్రివద్ద తీసుకున్న రూ.ఆరు లక్షలను ఆటల్లో పోగొట్టుకున్నాడు. దీంతో మనోవేదనకు గురైన కృష్ణ 19న గడ్డి మందు తాగాడు. కరీంనగర్‌లో చికిత్స పొందుతూ ఆదివారం కృష్ణ మృతి చెందాడు.

ఏజెంట్ మోసం.. గల్ఫ్‌లో నరకం

» కాలు విరిగినా యజమాని కనికరించలే

» కొట్టి మరీ పనిచేయించుకున్నారు

» గల్ఫ్ బాధితురాలు నిర్మల ఆవేదన

» ఎట్టకేలకు స్వదేశానికి చేరిక

పంజాగుట్ట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): 'ఇంట్లో పరిస్థితులు బాగాలేక, కుమారుడికి మంచి చదువులు చదివిద్దామని ఆశపడి తణుకుకు చెందిన ఏజెంట్ సంజయ్ అనే వ్యక్తి ద్వారా రెండేళ్ల క్రితం ఒమాన్ రాజధాని మస్కట్‌కు వెళ్లాను. అక్కడ ఇంటి పని, పిల్లలను చూసుకునే పనికి కుదిరాను. కొద్ది రోజులు బాగానే ఉన్నా తరువాత నుంచి యజమాని అఘాయిత్యాలు పెరిగిపోయాయి. తిండి కూడా సరిగ్గా పెట్టకుండా కొట్టి మరీ పనిచేయించేవారు. ఆఖరికి కాలు విరిగినా కనికరించలేదు'.. ఇదీ ఏపీలోని డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా గొల్లకుట్టివారి పాలేనికి చెందిన నిర్మల అనే బాధితురాలి ఆవేదన ఇది. బీసీ యువసేన జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు మురళీరామకృష్ణారెడ్డి సహకారంతో గల్ఫ్ చెర నుంచి బయట పడిన ఆమె.. ఆదివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయనతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఏజెంట్ చేతిలో మోసపోవడం వల్లే ఇన్ని కష్టాలు అనుభవించానని నిర్మల చెప్పారు. ఈ క్రమంలో తాను కింద పడడంతో కాలు విరిగిందని, నడవలేని స్థితిలో ఆసుపత్రిలో చూపించమని తమ యజమానిని వేడుకున్నా పట్టించుకోలేదని, పైగా కొట్టి మరీ పని చేయించుకున్నారని తెలిపారు. అక్కడి నుంచి వేరే ప్రాంతానికి మార్చి ఒక గదిలో బంధించారని, అదే గదిలో ఉంటున్న మరో మహిళ సెల్ ఫోన్‌తో కుటుంబ సభ్యులకు తన గోడు తెలిపానని చెప్పారు. చివరికి బీసీ యువసేన నేత మురళీ రామకృష్ణా రెడ్డికి ఫోన్ చేయగా మస్కట్‌లో ఉంటున్న బొంతు నాగరాజు, రాజీ, తదితరులు అక్కడికి వచ్చి తనను విడిపించారన్నారు. పాస్ పోర్ట్ లేకపోవడంతో భారత్ ఎంబసీతో మాట్లాడి సంబంధిత పత్రాలు సమకూర్చారని, బీసీ యువసేన ప్రతినిధులు, మస్కట్‌లో ఉన్న వారు సుమారు రూ.1.50 లక్షలు అందించగా, ఊర్లో ఉన్న ఇంటిని తనఖా పెట్టి తండ్రి రాంబాబు రూ. 50 వేలు పంపించడంతో తాను ఈ నెల 27న విమానంలో నగరానికి వచ్చినట్టు తెలిపారు. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లోని అనేక మంది ఏజెంట్ల మాయమాటలతో మోసపోయి గల్ఫ్‌లో నరకం అనుభవిస్తున్నారని తెలిపారు. ఆ నరకం నుంచి బయటికి రావడానికి ఎంతోమంది ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఒమాన్ రాజధాని మస్కట్ నుంచి నిర్మలను కాపాడడం సంతృప్తినిచ్చినా, ఇంకా 15 మంది మహిళలు అక్కడ చిక్కుకుని ఉన్నారని తెలిపారు. వారిని ఇండియాకు రప్పించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, దాతలు సహకరించాలని కోరారు.



బీసీ యువ సేన నేత మురళీ రామకృష్ణా రెడ్డితో కలిసి తన గోడు వెళ్లబోసుకుంటున్న గల్ఫ్ బాధితురాలు నిర్మల

వివిధ

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

తెలంగాణి కవితా సంపుటి

జూపాక సుభద్ర తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమంలో రాసిన కవిత్వాన్ని (2010-2024) 'తెలంగాణి కైతల దొంతులు' పేరుతో పుస్తకంగా ప్రచురించారు. ఈ పుస్తకాన్ని ఆగస్టు 3 సా.6గంటలకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో రాష్ట్ర పంచాయితీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డి. అనసూయ సీతక్క ఆవిష్కరిస్తారు. ముఖ్య అతిథి కె. శ్రీనివాస్; అధ్యక్షత జిలుకర శ్రీనివాస్; విశిష్ట అతిథులు మామిడి హరికృష్ణ, బి.ఎస్. రాములు, కంచ ఐలయ్య, సూర్యధనుంజయ, అంబటి సురేంద్ర రాజు, కొండవీటి సత్యవతి, గోగు శ్యామల, కోయి కోటేశ్వర రావు తదితరులు.

దండోరా పబ్లికేషన్స్

అంగర సూర్యారావు జయంతి సభ

అంగర సూర్యారావు 97వ జయంతి సభ ఆగస్టు 3 సాయంత్రం 5.30కు వి శాఖ పౌర గ్రంథాలయం, ద్వారకా నగర్, ఏసీ హాల్‌లో జరుగుతుంది. అంగర సూర్యారావు జీవన సాఫల్య పురస్కారాన్ని భళ్ళమూడి రామమూర్తి స్వీకరిస్తారు. అంగర సూర్యారావు రచన '60ఏళ్ళ ఆంధ్ర సాహిత్య చరిత్రలో పురిపండా' పుస్తకావిష్కరణ జరుగుతుంది. సభలో అడపా రామకృష్ణ, అత్తిలి సుధాకర్, బాదంగీర్, పి.టి. మాధవ్ తదితరులు పాల్గొంటారు.

విశాఖ రచయితల సంఘం

అడిగోపుల సంస్మరణ సభ

ఇటీవల దివంగతులైన అడిగోపుల వెంకటరత్నం సంస్మరణ సభ ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఆధ్వర్యంలో జూలై 29 సాయంత్రం వి జయవాడలోని ప్రెస్ క్లబ్‌లో జరుగుతుంది. అడిగోపులను అభిమానించే ప్రతి ఒక్కరు ఈ సభలో పాల్గొని ఆయనకు ఘన నివాళి అర్పించవలసిందిగా కోరుతున్నాం.

ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం

దీపావళి కథల పోటీ

జాగృతి వారపత్రిక, భండారు సదాశివరావు స్మారక దీపావళి కథల పోటీకి రచనలను ఆహ్వానిస్తున్నాం. మొదటి, రెండవ, మూడవ బహుమతులు వరుసగా: రూ. 12వేలు, రూ.7వేలు, రూ.5వేలు. ఇవి కాక వెయ్యి రూపాయల చొప్పున మరొక ఎనిమిది ప్రత్యేక బహుమతులు. కథలను ఆగస్ట్ 31లోగా ఈమెయిల్: jagriticompetition@gmail.com కు పంపాలి. పోస్ట్/ కొరియర్ లో పంపదలిస్తే చిరునామా: 'కథల పోటీ', జాగృతి వారపత్రిక, 3-4-228/4/1, జాగృతి భవన్, కాచిగూడ, హైదరాబాద్ - 500027కు పంపవచ్చు. వివరాలకు: 99593 10103.

కె. దుర్గారెడ్డి

ఇబ్బందిఖానా



"ఇయ్యాల వొస్తవనుకున్న..." అంటుంది అమ్మ.

అనుకున్నవి జరిగే కాలమాన పరిస్థితులు కావు; ప్రపంచం అంతకన్నా కాదు. దౌడ్ టైటిల్ సాంగ్ మన జాతీయగీతం. లౌడ్‌గా చెప్పలేని నిస్సహాయులం.

ఇల్లు రాత్రి పడుకోవడానికి మాత్రమే పనికొచ్చే లాడ్జి. ఉదయం అనేది రేపటికి తయారవ్వడానికి తగిలించుకునే బ్యాడ్జి.

మరయంత్రం మనం. తంత్రం పట్టుబడని విఫల వీరులం. వికటాట్టహాసం చేసే మనుషులకు వినోద సాధనాలం.

దస్సిపోయి ఇంటికి చేరతాం. డల్‌నెస్‌నంతా పక్కకు తోసి ఫోన్ చేసి పలకరిస్తాం కదా...

"ఇయ్యాల వొస్తవనుకున్న..." అంటుంది అమ్మ.

ఎవరి రావడం పోవడం ఇప్పుడు వాళ్ళ చేతుల్లో లేదని చెప్పడానికి గొంతు పెగలదు. అది విని కలతతో ఆమె పడే కొత్త బాధకు
కారణం కాకూడదని
మనకు మనం చెప్పుకునే సంజాయిషీలోనే...

మరోరోజు మరణిస్తుంది!

మోహన్ రుషి

సినిమా తీయగలిగే నవలలేవీ?

మలయాళం హిట్ సినిమాలు 'జల్లికట్టు', 'ఆడు జీవితం' నుంచి తమిళంలో 'అసురన్', 'పొన్నియన్ సెల్వన్' సినిమాల దాకా పుస్తకాల నుంచి అడాప్ట్ చేసుకున్నవే. ఒకప్పుడు తెలుగులోనూ పాపులర్ నవలలు కొన్ని తెరకెక్కాయి. ఇప్పుడు ఏవీ లేవు. పక్క రాష్ట్రాలతో పోలిస్తే తెలుగులో సినిమా - సాహిత్య రంగాల మధ్య సంబంధం ఇంత బలహీనంగా ఎందుకు ఉంది?

తమిళ మలయాళ చిత్ర పరిశ్రమల్లో లిటరేచర్ - సినిమాల మధ్య అనుబంధం చాలా బలంగా, ఆరోగ్యంగా ఉంది. జల్లికట్టు, పొన్నియన్ సెల్వన్, అసురన్ వంటి వైవిధ్యమైన అనుసరణలను మనం ఈమధ్యనే చూశాం. ఇలాంటి నెరేటివ్స్‌ని ఇష్టపడే ప్రేక్షకులు మన తెలుగువాళ్లతో కంటే ఆ రెండు రాష్ట్రాల్లో ఎక్కువగా ఉన్నారు. పూర్వం నుండే వారికి ఒక రిచ్ లిటరరీ కల్చర్, సపోర్టివ్ ఎకో సిస్టమ్ ఉంది. వీటికి తోడు సాహిత్య నేపథ్యం నుంచి వచ్చిన దర్శక నిర్మాతలు అక్కడ ఎక్కువ ఉన్నారు. ఈ కల్చరల్ ఇంటిగ్రేషన్ వల్లే వారి సినిమాటిక్ నెరేటివ్స్ ఈస్తటికల్ వాల్యూస్‌తో పరిణతి చెందాయి. అందుకు విరుద్ధంగా, తెలుగు సినిమాలో సాహిత్య అనుసరణలు చాలా తక్కువ. ఐదుదశ తెలుగు సినిమా వ్యాపార దృష్టి కారణం. తరాలుగా ప్రేక్షకుల టేస్ట్ కూడా అలాగే ఫేస్ అవుతూ వచ్చింది. ఈ తరం ప్రేక్షకుల్లో ఈ 'స్ట్రీమింగ్ ఎరా' వల్ల ఫిల్మ్ లిటరసీ పెరిగి 'చాయిస్ ఆఫ్ సినిమా' కొంతవరకు మారింది. ఐనా కూడా ఇక్కడ 'కథ'ని పెట్టుబడి నిర్ణయిస్తోంది. అందుకే ఇక్కడ మార్కెటబుల్ కంటెంట్‌కే ఎక్కువ ప్రాధాన్యత ఉంటోంది. అదనంగా, సినిమాటిక్ అడాప్షన్‌కి తగిన కాంటెంపరరీ నవల కొరత కూడా ఉంది. మరీ ముఖ్యంగా మన తెలుగు ఫిల్మ్ మేకర్స్‌లో చాలావరకు సాహిత్యంతో తక్కువ రిలేట్ అవటం వల్ల కూడా లిటరరీ వర్క్స్‌ని ఎడాప్టెడ్ చేసి అడాప్ట్ చెయ్యటం కష్టం అవుతోంది.

'స్ట్రీమింగ్ ఎరా వల్ల పెరుగుతున్న ఫిల్మ్ లిటరసీ...' ఫలితాలు ఎలా ఉండబోతున్నాయి? కథని పెట్టుబడి, పెట్టుబడిని రాబడి, రాబడిని ప్రజల అభిరుచి నిర్ణయిస్తున్నాయి అనుకుంటే, అల్టిమేట్‌గా ప్రజల అభిరుచి దగ్గరికే ప్రశ్న వెళ్ళి ఆగుతుంది. ప్రజల అభిరుచి మారాలంటే ఎలా?

ప్రపంచంలో జరిగిన అనేక సాహిత్య పరిణామాలకు అనుగుణంగా ఫ్రెంచ్ ఇంప్రెషనిజం, జర్మన్ ఎక్స్‌ప్రెషనిజం, సోవియట్ మాంటేజ్, డగ్మా 95 వంటి ఫిల్మ్ మూమెంట్స్ 21వ శతాబ్దం వరకు సాగాయి. వీటి వల్ల ఫిల్మ్ మేకింగ్ ఎప్పటికప్పుడు మార్పుచెందుతూ వచ్చింది. ముఖ్యంగా ఇప్పుడు ఉన్న 'స్ట్రీమింగ్ యుగం' వల్ల ఫిల్మ్ మేకింగ్, ఫిల్మ్ వ్యూయింగ్ రెండు రంగాలలో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. వైడ్ రేంజ్ గ్లోబల్ కంటెంట్‌ని చూడ్డానికి ప్రేక్షకులకు గొప్ప ఆక్సెస్ దొరికింది. ఈ షిఫ్ట్ ప్రేక్షకులను మరింత వివేకవంతంగా ఇన్‌ఫ్లుయెన్స్ చేసే స్థాయికి వెళ్లింది. మన తెలుగు రాష్ట్రాల్లో మాత్రం ఇప్పుడిప్పుడే ఈ మార్పు కనిపిస్తోంది. కథ - పెట్టుబడి - రాబడిల సైకిల్ పూర్తిగా ఈ మార్పు మీదే ఆధారపడి ఉంది. అందుకే ప్రేక్షకుల అభిరుచిని మెరుగుపరచేందుకు వారికి విభిన్న సినిమాటిక్ స్టైల్స్, టెక్నిక్స్ గురించి అవగాహన కల్పించడంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి. అదనంగా ఫిల్మ్ ఫెస్టివల్స్, వివిధ ఆర్ట్ ఫామ్స్‌ని 'హైలైట్ చేసే వర్క్‌ల ద్వారా సినిమాటిక్ కల్చర్ డెవలప్ అవుతుంది. భవిష్యత్తులో తెలుగు సినిమా 'కథ' నబుల్లర్స్ లైఫ్‌లో లోకేట్ అవుతుంది. రకరకాల ప్రాంతాల, మనుషుల బతుకులను అద్దం చేసే వేదికవుతుంది. తమిళ మలయాళ సినిమాల్లా తెలుగు సినిమా కూడా డైవర్సిటీతో వికసిస్తుంది.

సాహిత్యాన్ని సినిమాకి అడాప్ట్ చేసుకునే దిశగా ఒక సినిమా దర్శకుడిగా మీ ఆలోచనలు ఎలా ఉన్నాయి. మీరు చదివిన తెలుగు సాహిత్యంలో సినిమాకు అడాప్ట్ కాగలిగే పుస్తకాలేమిటి?

సినిమా దర్శకుడిగా, నేను సాహిత్యాన్ని సినిమాకి అడాప్ట్ చేసుకోవడం చాలా సున్నితమైన,

3? మూడు ప్రశ్నలు

వేణు ఊడుగుల





సృజనాత్మకమైన ప్రక్రియగా భావిస్తాను. మంచి సాహిత్యంలో కథ విస్తృతి, లోతైన తాత్వికత, భావోద్వేగాలు గాఢంగా ఉంటాయి. అలా అని ప్రతీది సినిమాకి అనువైనది కాకపోవచ్చు. మనం ఎంచుకునే సాహిత్యంలో ఉండే పాత్రలు రక్త మాంసాలతో సజీవంగా, శక్తివంతంగా ఉండాలి. కథ వాస్తవికంగా, భావోద్వేగాలతో ఉంటూనే ఆసక్తికరంగా ఉండాలి. సెన్స్ ఆఫ్ ఎమర్జెన్సీ ఉండాలి, లేకపోతే క్రియేట్ చేసుకోవాలి. సోషల్ రియాలిటీస్‌ని అద్దం పట్టేలా ఉంటే మరీ మంచిది. నేను చదివిన తెలుగు సాహిత్యంలో, కల్యాణ్ రావు గారు రాసిన 'అంటరాని వసంతం', కేశవరెడ్డి నవలలు సినిమాటిక్ అడాప్టేషన్‌కి ఉత్తమంగా సరిపోతాయి. ఈ కథలు మన సంస్కృతిలో ప్రవేశిస్తూనే, ఒక ప్రవాహంలా వేగంగా సాగిపోతూ ఉంటాయి. గ్లోబల్ ఆడియన్స్‌ని ఆకట్టుకునే సామర్థ్యం కలిగి ఉంటాయి. ఈ కథలు మనుషుల అనుభవాలను, సోషల్ డైనమిక్స్‌పై డిఫరెంట్ పెర్స్‌పెక్టివ్‌ని అందిస్తాయి. భవిష్యత్తులో నేను కూడా ఒక నవల ఆధారంగా సినిమా చేయబోతున్నాను. అది ప్రేక్షకులకు ఒక విశేష అనుభవాన్ని అందించే అరుదైన సినిమా అవుతుంది.

(వేణు ఊడుగుల కవి, సినిమా దర్శకుడు)

నా మొదటి పుస్తకం

నన్ను లెఫ్టిస్ట్‌ని చేసింది





కె. శివారెడ్డి

నా తొలి కవితా సంపుటి 'రక్తం సూర్యుడు' గురించి ఆంధ్రజ్యోతి మిత్రులు నాలుగు మాటలు రాయమంటే నా మనసు గతంలోకి వెళ్ళిపోయింది. ఒక సంక్షోభ దశలో, నక్సల్బరీలో మొదలైన సాయుధ పోరాట ఉద్యమం ఉత్తరాంధ్ర దాకా పాకి గోదావరి లోయలోకి ప్రవేశించిన తొలి రోజుల్లో, 1966లో నేను హైదరాబాద్ వచ్చాను. అప్పటికి దాకా పద్యాలు రాసుకునేవాడ్ని. రాజకీయాలతో అంతంతమాత్రం పరిచయం ఉన్న నేను హైదరాబాద్‌కి వచ్చీ రాగానే సరాసరి విద్యార్థి ఉద్యమంలోకి ప్రవేశించాను. పాత వాసనలు వదిలించుకున్న తర్వాత కొత్త రాజకీయాల సాయుధ పోరాట ఉద్యమం నా దృక్పథ, కవిత్వ రూప రేఖల్ని మార్చివేసింది. 70లలో విరసం ప్రారంభమైంది. అది కూడా నాకు పూర్తి స్ఫూర్తి. విరసంతో పుట్టిపెరిగిన వాడ్ని అని చెబుతుండేవాడ్ని. అప్పటిదాకా రాసి పత్రికల్లో అచ్చయిన పద్యాల్నించి ఏరి వాటిని అన్ని రకాల మార్పుల తర్వాత 'రక్తం సూర్యుడు'గా అచ్చేశాను. ఈ పుస్తకం ముఖచిత్రం డిజైన్‌కు శీలా వీర్రాజుగారు పడ్డ శ్రమ మామూలైంది కాదు. ఖైరతాబాద్‌లోని మా ఇంటికి వచ్చి నన్ను దగ్గర్లో ఉన్న ఫొటో స్టూడియోకి తీసుకుపోయి రకరకాల భంగిమల్లో ఫొటోలు తీయించి దాంట్లో ఒకటి సెలెక్ట్ చేసి మెరుగులు దిద్ది ఆ కవర్ ఫొటో తయారు చేశారు. బ్రౌన్ పేపరు మీద 500 కాపీలు, ప్యూర్ వైట్ 90 జిఎస్ఎమ్ మీద మరో 500 కాపీలు అచ్చు వేశాం. ఆ కాయితం కోసం సికింద్రాబాద్ అంతా నన్ను తిప్పి విసిగించారు. అక్కడ్నించి పది రీముల పేపర్‌ని ఆటోలో వేసుకొచ్చి, ఖైరతాబాద్‌లో ఉన్న వరలక్ష్మి ప్రెస్‌లో వేశాం. వీర్రాజు గారు లేకపోతే ఆ పుస్తకం అలా వచ్చేది కాదు. 1973లో అచ్చయిన ఆ పుస్తకం 74లోనో 75లోనో ఫ్రీవర్స్ ఫ్రంట్ అవార్డు పొందింది. కుందుర్తి గారు పేపరుకి ఆ సమాచారాన్ని ఇస్తూ నాకు 'రాడికల్ పొయెట్' అని కితాబు ఇచ్చారు. నూట పదహారు రూపాయలు బహుమతి ఇచ్చారు. ఆంధ్రజ్యోతిలో 'నిజం', వి శాలాంధ్రలో అంపశయ్య నవీన్ మంచి రివ్యూలు రాశారు. ఈ స్పందనలన్నీ ఆనాటి పరిస్థితుల్లో నాకు గొప్ప ఊతమిచ్చాయి. అనుకున్నదానికంటే ఎక్కువ రెస్పాన్స్ వచ్చింది. వెనక్కి తిరిగి చూసుకుంటే, ఆ కవిత్వం నా ఐడియలాజికల్ స్టాన్స్‌ని మార్చింది. నన్ను లెఫ్టిస్ట్‌ని చేసింది. అది నా బీజప్రాయపు దశ. నా పునాది. అక్కడి నుంచి ఈనాటి శివారెడ్డి లేచాడు. నలుదిక్కులకీ విస్తరించాడు. అప్పటి చాలామంది మిత్రులు ఇప్పటికీ దాన్ని చాలామంది పుస్తకంగా గుర్తు పెట్టుకున్నారు. ఆ సమయం, ఆ సందర్భం, ఆ కాలం గొప్పతనమది. అప్పుడు అక్కడ ఉండటమే నేను చేసుకున్న అదృష్టం. నేను ఆ కాలపు స్ఫూర్తిని పూర్తిగా అందుకున్నాను అనుకుంటాను. అక్కడి నుంచి ఈనాటి శివారెడ్డి చాలా దూరం ప్రయాణం చేశాడు.

"కవులు మర్యాదస్తులైపోయారు"

\- జూకంటి జగన్నాథం

జీవితాన్నీ, సాహిత్యాన్నీ వేరు వేరుగా దర్శించని కవి జూకంటి. నడి చౌరస్తాలో నిటారుగా సామాన్యుడి వైపు నిలబడి నిరంతరం ప్రశ్నిస్తారు, కవిత్వం ద్వారా నిఖార్సైన ధిక్కార స్వరం వినిపిస్తారు. ప్రపంచీకరణ, పెట్టుబడి మనిషిని నలువైపుల నుండి దాడిచేస్తూ తల్లడం మల్లడం చేస్తున్న సందర్భాన్ని తన సాహిత్యం ద్వారా బట్టబయలు చేస్తున్నారు. ఈ ఏడాదికి దాశరథి కృష్ణమాచార్య పురస్కారం అందుకున్న సందర్భంగా ఆయనతో ఇంటర్వ్యూ...


మీ జీవిత నేపథ్యం సాహిత్య ప్రస్థానం?

నేను హైస్కూల్ మాత్రమే చదివాను. మా ఊరు తంగళ్ళపల్లికి సమీపంలో ఉన్న సిరిసిల్ల పట్టణ గ్రంథాలయం లోని పుస్తకాలను జిజ్ఞాసతో దాదాపుగా చదివాను. అలాగే సినారె అంతేవాసి కనపర్తిగారి సొంత గ్రంథాలయంలో అభ్యుదయ సాహిత్యాన్ని చదివాను. నేను మిక్కిలి గౌరవించే నాటి సీనియర్ కవి జక్కని వెంకటరాజం, నిజాం వెంకటేశం గారల మార్గదర్శనం చేయూతతో సామాజిక రాజకీయ ఆర్థిక దృక్పథంతో నా చుట్టూ ఉన్న సమాజాన్ని వ్యక్తులను అధ్యయనం చేశాను. ముఖ్యంగా దేన్ని రాయాలి అనే దాని కన్నా ఏది రాయకూడదనే దాన్ని నేర్చుకున్నాను. దేశంలో అత్యవసర పరిస్థితి 1975-1977ల పిదప ఒక స్పష్టమైన ప్రజా సంస్కృతి దృక్పథంతో నిబద్ధతతో నా సాహిత్య జీవన గమనాన్ని కొనసాగిస్తూ వస్తున్నాను.

దేశంలో 90వ దశకంలో మొదలైన ప్రపంచీకరణ పరిణామాలను చూసిన మొట్టమొదటి కవి మీరు. ఆ పరిణామాలు మిమ్మల్ని ఎలా ప్రేరేపించాయి?

1991లో నాటి కేంద్ర ప్రభుత్వం దేశీయ మార్కెట్‌ను ప్రపంచ మార్కెట్‌తో అనుసంధానించింది. తద్వారా అప్పుడు ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్ (ఐఎంఎఫ్) గాట్, ప్రపంచ బ్యాంకు, ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్, ఎంఒయు లు, కన్సల్టెన్సీలు, క్విడ్ ప్రో కోలు... ఇలాంటి కొత్త పదాలు దేశ సామాజిక నిఘంటువులోకి వచ్చిచేరాయి. కవులు మర్యాదస్తులైపోయారు. మేధావులు మెతక వైఖరి అనుసరించారు. మీడియా కార్పొరేటీకరణ జరిగి సమాజానికి పూడ్చలేని నష్టం జరిగింది. ఇటువంటి దశలో గ్రామీణ మూలాల నుంచి ఎదిగి వచ్చిన సృజన కారునిగా 1986 నుండి 1993 వరకు మనిషి ఆలోచనలకు కోల్పోతున్న పరాయీకరించబడిన విలువలను వెతికి పట్టుకునేందుకు రాసిన కవిత్వాన్ని 'పాతాళగరిగె', 'ఇండియా ప్రైవేట్ లిమిటెడ్', 'వాస్కోడిగామా డాట్ కామ్'లతో పాటు ఇప్పటివరకు 16 సంపుటాలను తీసుకువచ్చాను. నాటి నుండి నేటి వరకు ప్రభుత్వాలు అనుసరిస్తున్న లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్ (ఎల్.పి.జి.) వలన గ్రామీణ జీవన విధానం, సంస్కృతిలో ఊహించని అంతరాలు పెరిగాయి. గ్రామీణ ప్రాంత మూలాల నుంచి వచ్చిన కవిగా కరిగిపోయి కదిలిపోయి కన్నీళ్ల పర్యంతమై నన్ను నేను మట్టిని మర్దిసుకుని కాళ్లతో తొక్కి, కుమ్మరి సారెపై సున్నితమైన భావన కళాకృతులను వినిర్మించాను. అది నేటికీ రెలవెంట్‌గా అనేక వాదాల పాయల రూపంలో ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతూనే ఉంది. చేవ ఉన్న కవికి ఇది సకాలం. యావ ఉన్న కవికి ఫ్రాంచీస్ అసందర్భ సమయం.

సామాజిక ఆర్థిక రాజకీయ సాంకేతిక రంగాలలో వేగంగా మారుతున్న వాతావరణం, సాహిత్యంలో దాని ప్రతిఫలనాలను మీరు ఏ విధంగా చూస్తారు?



> వర్తమానం విసిరిన సవాళ్లను స్వీకరించలేని, నిలబడలేని, కలెబడలేని సృజనకారుడికి ఒక కన్సొలేషన్ స్థలం నోస్టాల్జియా. సాహిత్యంలో దృక్కోణాన్ని ఆర్థిక సామాజిక రాజకీయ అధ్యయనంతో ప్రాంతీయ జాతీయ అంతర్జాతీయ పరిస్థితులను కవి రచయిత అవగాహన ఆవాహన చేసుకుంటేనే నేటి సాహిత్యంలో మూలాలు దొరుకుతాయి.

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞాన శాస్త్రీయ సౌకర్యాలను వాడుకుంటూనే, అందిపుచ్చుకుంటూనే మనిషి మొద్దుబారి పోయి అశాస్త్రీయంగా గతంలో చింతిస్తూ బతుకుతున్నాడు. పక్షు వినియోగదారుడిగా అందమైన ప్యాక్ బార్‌కోడ్‌లో తన విలువను నిక్షిప్తం చేసుకుని సూపర్ బజార్లో లేబర్ అడ్డాలలో గోస గోసోలే కూలీగా నిలబడుతున్నాడు. ఇది అత్యంత విషాదకరం. సాహిత్యంలో వీటి బింబ ప్రతిబింబాలు భళ్ళున విస్ఫోటనం చెందిన దర్పణంలో విరిగిన దృశ్యాలుగా విభజించబడుతున్నాయి. అందుకే కవి రచయిత వెనుకబాటు కులాల వెన్నుదన్నుగా పారిపోతున్నాడు. ఒక ప్రాపోజకత్వం ఊడిగం చేస్తున్నాడు. అందుకే ఇటీవల అన్ని వాదాలు మేనిఫెస్టోల రణగొణలో ఐడెంటిటీ సంక్షోభంలో సంక్లిష్టంగా తెంపులు తెంపులుగా పెనుగులాడుతున్నాయి. కమ్యూనిస్టు మేనిఫెస్టోలో ఉటంకించిన విధంగా మేధావులు కవులు రచయితలు డాక్టర్లు ఇంజనీర్లు ప్రభుత్వ ఆర్డర్లో కొలువు తీరడం వైపు మొగ్గు చూపుతున్నారు. దేశాల మధ్యనే కాదు మనిషికి మనిషికి మధ్య ఒక ఉద్రిక్త ఆందోళనకర యుద్ధంగా విపరిణామం చెందుతుంది.

ఇటీవల కవిత్వం, ఇతర సాహిత్య ప్రక్రియలు నోస్టాల్జియా వైపు మొగ్గు చూపడంపై మీ దృక్కోణం?

వర్తమానం విసిరిన సవాళ్లను స్వీకరించలేని, నిలబడలేని, కలెబడలేని సృజనకారుడికి ఒక కన్సొలేషన్ స్థలం నోస్టాల్జియా. అన్ని సాహిత్య ప్రక్రియలు నిమాయిలో మనిషి కళ్ళల్లో దుమ్ము కొట్టి పురావస్తువుగా రూపెత్తుతున్నాయి. మళ్లీ దీనికి కారణాలు ఆకారణాలు కూడా ప్రపంచీకరణ చేసిన లోతైన మెలికలూ ఏపుగా పెరిగి మోస పుచ్చుతున్నాయి. సాహిత్యంలో దృక్కోణాన్ని ఆర్థిక సామాజిక రాజకీయ అధ్యయనంతో ప్రాంతీయ జాతీయ అంతర్జాతీయ పరిస్థితులను కవి రచయిత అవగాహన ఆవాహన చేసుకుంటేనే నేటి సాహిత్యంలో మూలాలు దొరుకుతాయి. అందుకోసం నేడు తనను తను పోగొట్టుకొని వెతుక్కుంటున్నాడు. అందుకోసం సమాజానికి రాజకీయాలకు అతీతం కాని కవిత్వం జనసాహిత్యాలను కన్నీటి చెమ్మను కాకుండా ఒకే ఒక్క చెమక్కును కవిత్వంగా 'ఫేస్‌బుక్'లో బ్లాగులలో వాట్సాప్ గ్రూపుల్లో జూమ్ మీటింగ్‌లలో ముఖపు మడిగా ఆత్మహననంలోకి యాంత్రికంగా యాత్రిస్తున్నాడు. చూస్తూ చూస్తుండగానే దీపం చేతిలో పట్టుకొని బావిలో పడుతున్నాడు.

2024 డాక్టర్ దాశరథి కృష్ణమాచార్య పురస్కారం అందుకున్న సందర్భంగా మీ ప్రతిస్పందన?

దాశరథి అవార్డు నా బాధ్యతను సమాజం పట్ల నిబద్ధతను మరింత పెంచింపచేసుకున్నాను. కొంచెం ప్రజాస్వామ్య స్వేచ్ఛ ప్రాణవాయువు ఊపిరి ఆడుతున్న సందర్భంలో ఈ అవార్డు గ్రహించడం నాకు అత్యంత సంబరాన్ని కలిగించింది.

ఇంటర్వ్యూ: మద్దికుంట లక్ష్మణ్
94416 77373

ప్రియ పద్యం



1.
ఈ శవాగారపు గోడల మీదే పొరాడుతున్నరా తండ్రీ
జీనా కహా మర్నా కహా?
మహా దిగ్మండలమంతా మరణపు వాసన
వయోలిన్ తీగల కల ఆమె జ్ఞాపకమై
వెంటాడుతూనే ఉంటే
భయభయంగా అమ్మ కొంగులోకి ముడుచుకుంటున్న...

2.
కబూతర్ ఖానాల రెక్కతెగిన పావురమై
పెనుగులాడిన నా రక్తపు నమూనా
వెతుక్కుంటూ, వెతుక్కుంటూ వస్తాడా ఒక
అలెక్స్ హేలీ ఏనాటికైనా?
నిద్దరలో తెరుచుకునే కండ్లు
డొక్కలోకి ముడుచుకుపోవు మోకాళ్ళు
రగిలే రగిలే
దుఃఖ వలపోతల గుండెకాయ ఒక్కటే టెంగటిల్లి
కురిసిన వానల్నీ కాగితం పడవలై
ఏ గలివర్ గాన్ని ఏ తీరానికి చేర్చినవో
లిల్లీపుట్ దీవులల్ల మహాకాయున్నయి
వెతికి వెతికి ఇట్లా...

3.
మెట్రోరైలు వంతెన కింద ఈ ఉక్కపోత రాత్రి
చెరువు నీల్లల్ల అల్లి పువ్వ వాసనై ఆమె కల
బీడీ వాసన పద్యమై ఆమె నవ్వు
సినిమాహాల్ లోంచి తెరలు తెరలుగా ఆమె స్వరం
సమస్తాదార భూమండలమంతా ఒక్కసారిగా
నా ఒడిలోకి చేరినట్టు
ఫ్రాయిడ్‌ఫోలీద్దరూ ఫుట్‌పాత్ మీద నిదురిస్తున్న పిల్లలై...
ఎవరినీ ప్రేమించలేక నన్ను నేను ద్వేషించుకూ లేక
రెండింపచిపోడనా దేయవాదేవాడనూ నా కనరాక
త్రోవ నుంచీ తావో (Tao) దాకా తాగి తాగి
నన్ను నేను విశ్లేషించుకొని,
నన్ను నేను విభాగించుకొని
నాతో నేనే విడిపోయి...

4.
ఇక ఇప్పుడంతా ఒకే పదం
ఇక ఇప్పుడు జీవితమంటే ఒకే వాక్యం
ఇక మొత్తంగా బతుకంటే...
చీకటి వెలుగు కలిసిపోయిన light pollution
దైత్యాబైన యుద్ధరంగమై నెత్తిన ఎత్తిన బోనమకుండ
జహన్నుమ్, జన్నత్ లదాకా
పక్కటెముకలు మీదుగా దర్వాన్ని చీల్చిన మోహరమ్ వేదిక
ఈ నగరమంతా పండే పండని మగరుడుకు
సీమదింతకాయ...

analysis

నరేష్కుమార్ సూఫీ
95736 09460

నరేష్కుమార్ సూఫీ ఈ కవిత కవి, వాక్యంలో జీవిస్తూ వాక్యానికి ఎక్కడా సొగసు అంటనీయకుండా నిశ్చలమైన, నిక్కమైన వాక్యాన్ని రాయడం ఆతని శైలి. మనిషి జీవన ప్రయాణంలో ఎన్నోసార్లు దుఃఖాన్ని భరిస్తూ జీవితాన్ని వెళ్లదీస్తూ ఉంటాడు, సూఫీ వాక్యంలో తరువున తానొక్కడై నిలబడి ఈ 'analysis' కవితను బహిరంగంగా చదివి వినిపిస్తున్నాడా అనిపిస్తుంది. అమ్మకొంగులోకి ముడుచుకోవడం, రక్తపు నమూనాలను వెతుక్కుంటూ వెళ్లడం, సమస్త భూమండలం ఒక్కసారిగా ఒడిలోకి చేరినట్టు కలగనడం, ఇదంతా జ్ఞాపకాల నుంచి నడుస్తూ వర్తమానం మీదుగా భవిష్యత్ తలపోతల బాట సంఘర్షణ.

సరిగ్గా చూస్తే తప్ప ఈ కవిత వైశాల్యాన్ని మనం ఊహించలేం. కాల్పనిక క్యారెక్టర్‌ని కాగితం పడవ మీద తీరానికి చేర్చడంలో కవి ఊహ మెచ్చుకోతగ్గది. ఇందులో ఉన్న ఆమె మనకే చెరువులో పూసిన అల్లిపూవు వాసన వేస్తుంది. ఇటువంటి అరుదైన వ్యక్తీకరణ గుండెల్లో భారంతో కూడిన దిగులు అనుభవం ఉంటే తప్పా ఆ కాగితం మీద కవితలా మారదు.

కవి తనని తానే ద్వేషించుకుంటూ తన ప్రేమకి తనకి ఎదురైన ప్రేమరాహిత్యానికి మధ్యలో నలిగిపోయిన గుండెని ప్రపంచానికి చూపిస్తాడు. జీవితంలో దుఃఖమొక్కటే ఉందా ఆశ లేదా అని అడిగే ప్రశ్నకి ఆఖరి లైనులో సమాధానంగా ఇస్తాడు. హైదరాబాద్ జీవితం, పక్కా తెలంగాణ భాషతో కూడిన భావ సాంద్రత ఈ కవిత సొంతం. ఐదింది సలుపు నివ్వడు. జీవితం అంటే చీకటి వెలుగు కలిసిన లైట్ పొల్యూషన్ అనే మాట వెనక ఉన్న జీవన తాత్వికత ఇందు వల్లే ఈ కవిత పండినట్టే. ఈ కవి మనకి అందినట్టే.



అనిల్ డ్యాని
97033 36688

(ఈ 'ప్రియపద్యం' శీర్షికలో సాహిత్యకారులు తమకు నచ్చిన ఇటీవలి కవిత ఒకటి ఎన్నుకుని ఎందుకు నచ్చిందో వివరిస్తారు.)

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY హనుమకొండ HANUMAKONDA
సోమవారం 29 జూలై 2024




పారిశుధ్య సిబ్బంది లేక మురికి కూపాల్లా..

ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య సిబ్బంది లేకపోవడంతో పాఠశాలల్లో తరగతి గదులతో పాటు ప్రాంగణాలన్ని మురికి కూపాల్లాగా మారుతు న్నాయి. వరుసగా కురుస్తున్న వర్షాలతో పాఠశాలల ప్రాంగణాలు బురదమయంగా మారడం, పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో మిగిలిన వేస్టేజీలు కుప్పలు తెప్పలుగా ఉంటుండటంతో అపరిశుభ్రంగా మారుతున్నాయి. తరగతి గదులు, వరండాలు, ఇతరత్ర ప్రాంగణాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. ఇక మూత్రశాలలు, మరుగుదొడ్ల పరిస్థితి చెప్పనలవి కాకుండా ఉంటున్నాయి. దుర్గంధాన్ని వెదజలుతూ రోగాలకు కేంద్రాలుగా మారుతున్నాయి.


చెరువులా మారిన సుబేదారి ప్రభుత్వ పాఠశాల ప్రాంగణం


పరకాలలోని ప్రభుత్వ పాఠశాలలో వరద నీరు


కృష్ణకాలనీ ప్రభుత్వ పాఠశాలలో తరగతి గదిలో చేరిన వర్షపు నీరు


బురదమయంగా కరీమాబాద్ ప్రభుత్వ పాఠశాల


చెరువులా తలపిస్తున్న వరంగల్ కృష్ణకాలనీ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణం

బడులా.. కుంటలా..

ఆంధ్రజ్యోతి ఫోకస్

- జలమయమవుతున్న ప్రభుత్వ పాఠశాలలు
- బురదతో నిండిన ఆవరణలు
- వరంగల్, హనుమకొండ జిల్లాలో విద్యార్థుల అవస్థలు
- స్కూళ్లలో కుంటుపడుతున్న పరిశుభ్రత
- పారిశుధ్య సిబ్బంది లేక ఆగమాగం
- పట్టించుకోని విద్యాశాఖాధికారులు
- అవస్థల్లో విద్యార్థులు

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 28: చినుకులు పడితే చాలు.. ప్రభుత్వ పాఠశాలల ఆవరణలన్నీ చిత్తడిగా మారుతున్నాయి. వారం రోజులుగా కురిసిన ఎడతెరపిలేని వానలతో జిల్లాలోని కొన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణాలు చిన్నపాటి కుంటలను తలపిస్తున్నాయి. సిబ్బంది లేకపోవడంతో పాఠశాలల్లో పారిశుద్య పడకేసింది. పాఠశాలల్లో ప్రారంభించిన అభివృద్ధి పనుల వ్యర్థాలు పాఠశాల ఆవరణల్లోనే కుప్పలు పోసి ఉంటుండటంతో ప్రాంగణాలు చెత్తగా మారుతున్నాయి. వరంగల్ మహానగర సంస్థ పరిధిలోని పాఠశాలల్లోనే పరిస్థితి అస్తవ్యస్తంగా ఉంది. వరంగల్‌లోని కృష్ణకాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నిలిచిన నీరు కుంటను తలపిస్తుండగా, హనుమకొండలోని సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిలిచిన నీరు చెరువును తలపిస్తోంది. పట్టణ ప్రాంతాల్లోని పాఠశాలల్లోనే పరిస్థితులు ఇలా ఉంటే.. ఇక గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల దుస్థితి అధ్వానంగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలల ప్రాంగణాలతో పాటు వచ్చేదార్లు సైతం బురదమయంగా మారి దర్శనమిస్తున్నాయి. పరిస్థితులు ఇలాగే కొనసాగితే పాఠశాలల్లో ఏర్పడుతున్న అపరిశుభ్ర వాతావరణంతో విద్యార్థులకు విషజ్వరాలు ప్రజ్వరిల్లే ప్రమాదముందని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు.

చెరువులను తలపిస్తున్న ప్రాంగణాలు

గ్రేటర్ వరంగల్ పరిధిలోని పాఠశాలలతో పాటు పరకాల, నర్సంపేట, వర్ధన్నపేట తదితర పట్టణ ప్రాంతాల్లోని పాఠశాలల ఆవరణలో వర్షం నీరు చేరి పరిసరాలను అపశుభ్రంగా మారుస్తున్నాయి. డీఈవో కార్యాలయానికి ఆనుకొని ఉన్న సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో చేరిన వర్షం నీరు చెరువును తలపి స్తోంది. ఇక బురద నీరు పక్కనే ఉన్న స్టేజీపై విద్యా ర్థులు మధ్యాహ్న భోజనం చేయడం గమనార్హం.


చెన్నారావుపేట జడ్పీహెచ్ఎస్‌లో బురదమయమైన పాఠశాల ప్రాంగణం

అలాగే ప్రభుత్వ ప్రాక్టీసింగ్ హైస్కూల్‌లోనూ ప్రాంగణ మంతా బురదమయంగా మారింది. ఇక వరంగల్ ప్రాంతం రైల్వే స్టేషన్ రోడ్‌లోని కృష్ణకాలనీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేరిన నీరు కుంటను తలపిస్తోంది. గ్రౌండ్ ఫ్లోర్ మొత్తం నీటితో నిండి ఉంది. తరగతి గదుల్లో నీరు చేసి అందులోని బెంచీలు తడిసి పాడవ తున్నాయి. కరీమాబాద్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణమంతా బురదమ యంగా మారి విద్యార్థులు తరగతి గదుల్లోకి వెళ్లేందుకు ఇబ్బందిగా మారింది. గిర్మాజీపేట, మట్టెవాడ ప్రభుత్వ పాఠశాలలతోపాటు లూయిస్ అంధుల పాఠశాల ప్రాంగణాలు వర్షపునీరు నిలిచి బురదమయంగా మారాయి. పరకాల పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో వరద నీరు చేరి బురదమయంగా మారి

మిగతా 8వ పేజీలో..

అపరిశుభ్ర వాతావరణంతో రోగాలు

- డాక్టర్ గౌతమ్, జనరల్ ఫిజీషియన్, ఎంజీఎం ఆస్పత్రి



పాఠశాల ప్రాంగణాలు అపరిశుభ్ర వాతావరణంతో ఉంటే పిల్లలు రోగాల బారిన పడే ప్రమాదం ఉంది. వర్షాకాలం కావడంతో పాఠశాల ప్రాంగణాల్లో నిలువ ఉన్న నీటిలో దోమలు నివాసాలు ఏర్పాటు చేసుకొని మలేరియా, డయేరియా తదితర వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. పాఠశాలల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉన్నా వైరల్ జ్వరాలు వచ్చే ప్రమాదం అధికంగా ఉంటుంది.

పాఠశాలల్లో పారిశుధ్య సిబ్బందిని నియమించాలి..

- డాక్టర్ యాట సదయ్య, ఎస్టీయూ రాష్ట్ర నాయకుడు



ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం పారిశుధ్య సిబ్బందిని నియమించాలి. గతంలో కాంటింజెన్సీ వర్కర్లు ఉండేవాళ్లు. ఇప్పుడు వారు లేకపోవడంతో పాఠశాలల్లో పారిశుధ్యం పూర్తిగా లోపించింది. గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ శానిటేషన్ సిబ్బందితో పాఠశాలలను శుభ్రం చేయిస్తామన్న ప్రభుత్వం హామీ అమలు కావడం లేదు. పాఠశాలల్లో శానిటేషన్ సిబ్బందిని వెంటనే నియమించాలి.


జలమయమైన హనుమకొండ ప్రభుత్వ ప్రాక్టీసింగ్ పాఠశాల

రుణమాఫీ కోసం రైతుల ఎదురుచూపు

- ఇంకా 336 మంది ఖాతాల్లో జమకాని నగదు

బాలసముద్రం, జూలై 28: హనుమకొండ జిల్లాలో లక్షలోపు రుణమాఫీ కాకపోవడంతో ఇంకా రైతులు ఎదురుచూస్తున్నారు. హనుమకొండ జిల్లాలో 14 మండలాల పరిధిలో మొత్తం రుణమాఫీ లబ్ధిదారులు 25వేల 391 మంది రైతులు లక్ష లోపు ఉన్నారు. ఇందులో ఇప్పటి వరకు 25వేల 55 మంది రైతుల అకౌంట్లలో రుణమాఫీ రూ.140కోట్ల 8లక్షల 23 వేల 81ల డబ్బులను రాష్ట్ర ప్రభుత్వం జమ చేసినట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. మిగిలిన 336 మంది రైతులు లక్షలోపు రుణమాఫీ కావాల్సి ఉండగా, అకౌంట్స్ మూతకావడంతో, కొందరు రైతుల కుటుంబ వివరాలు, అకౌంట్స్ సరిగా లేకపోవడంతో రైతులకు రుణమాఫీ కాలేదని అధికారులు చెబుతున్నారు.

రూ.లక్షలోపు రుణమాఫీ వివరాలు

హనుమకొండ జిల్లాలో వివిధ బ్యాంకులలో రైతులకు లక్ష లోపు రుణమాఫీ చేసినట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. ఎస్‌బీఐ శాఖలో 6,856 మంది రైతులు, ఏపీజీవీబీ 30130, బరోడాబ్యాంకు 990, బ్యాంకు ఆఫ్ ఇండియా 189, బ్యాంకు మహారాష్ట్ర 8, కెనరాబ్యాంకు 1950, సెంట్రల్‌బ్యాంకు 2, డీసీసీ బ్యాంకు 3916, హెచ్‌డీఎఫ్‌సీ 3, ఐసీఐసీబ్యాంకు 5, ఐడీబీఐబ్యాంకు 70, ఇండియన్ ఒవర్సీస్ బ్యాంకు 393, పంజాబ్ నేషనల్ బ్యాంకు 419 మంది రైతులకు లక్షలోపు రుణమాఫీ జరిగినట్లు అధికారులు తెలిపారు. వివిధ కారణాలతో రుణమాఫీ కాని రైతులు 336 మంది రైతులకు రూ. 1కోటి, 87లక్షల 86,431 రైతుల అకౌంట్లలో జమ కావాల్సి ఉందని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు.

హెల్ప్‌లైన్ డెస్కుల ఏర్పాటు


జిల్లాలో రైతురుణమాఫీ కోసం జిల్లా వ్యాప్తంగా రుణమాఫీ హెల్ప్‌లైన్ డెస్కు ఏర్పాటు చేశారు. రైతుల ఫిర్యాదులు స్వీకరించి ఎందుకు రుణమాఫీ కాలేదో సంబంధిత వ్యవసాయశాఖ అధికారులు రైతులకు చెబుతున్నారు. రుణమాఫీ కాని రైతుల వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేసి ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు పంపిస్తున్నట్లు తెలిపారు.

రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదు..

- జిల్లా వ్యవసాయశాఖ అధికారి రవీందర్‌సింగ్

జిల్లాలో లక్షలోపు రుణమాఫీ కాని రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదు అకౌంట్స్ సరిగాలేక, ఇతర కారణాల వల్ల రుణమాఫీ కాలేదు ఇప్పటికే రుణమాఫీ కోసం వివరాలు సేకరించి హెడ్ ఆఫీస్‌కు పంపించాం.

ఆమెకు బదులు ఆయన..!



- బల్దియాలో మహిళా కార్పొరేటర్ల భర్తలదే ఆధిపత్యం
- డివిజన్లలో మితిమీరుతున్న కుటుంబ సభ్యుల పెత్తనం

వరంగల్ కార్పొరేషన్, జూలై 28: గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్‌లో భార్యలది అధికారం.. భర్తలది పెత్తనం అన్నట్టుగా ఉంటోంది. అసలు ఎవరు కార్పొరేటర్? ఎవరిది అధికారం..? అన్న అయోమయంలో నగర ప్రజలు ఉన్నారు. మూడేళ్ల కిందట కార్పొరేటర్లుగా గెలిచిన కొందరు మహిళలు ఇప్పటికే ఇంటికి పరిమితమవుతున్నట్లు స్పష్టమవుతోంది. వీరి స్థానంలో వారి భర్తలు పెత్తనం చెలాయిస్తూ హల్‌చల్ చేస్తున్నారు.

గ్రీవెన్స్‌లో వారే..

బల్దియా కౌన్సిల్ హాల్‌లో గత సోమవారం జరిగిన గ్రీవెన్స్‌సెల్‌లో జనరల్ బాడీ సమావేశం నిర్వహించాలని కొందరు మహిళా కార్పొరేటర్ల భర్తలు ఏకంగా కమిషన్ అశ్విని తానాజీ వాకడేకు వినతి పత్రం సమర్పించడం చర్చనీ యాంశమైంది. కార్పొరేటర్ బోగి సువర్ణకు బదులు ఆమె భర్త సురేష్, కార్పొరేటర్ గుగులోతు దివ్యరాణికి బదులు ఆమె భర్త రాజునాయక్, కార్పొరేటర్ పల్లం పద్మతో పాటు ఆమె భర్త పల్లం రవి వచ్చి అందరినీ ఆశ్చర్యానికి గురి చేశారు. అయితే బల్దియా జనరల్ బాడీ విషయం మేయర్‌ను అగడాలని, గ్రీవెన్స్ పరిధిలోకి రాదని కమిషనర్ కొట్టిపారేశారు.


గత గ్రీవెన్స్‌సెల్‌లో జనరల్ బాడీ పెట్టాలని కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న కార్పొరేటర్ల భర్తలు

అన్నీ వారి కనుసన్నల్లోనే..

గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో 42 విలీన గ్రామాలను కలుపుకుని 66 డివిజన్‌లు ఏర్పడ్డాయి. 2021 మే మాసంలో కార్పొరేటర్ ఎన్నికలు నిర్వహించగా 37 మంది మహిళలు, 29 మంది పురుషులు పలు పార్టీల నుంచి కార్పొరేటర్లుగా గెలుపొందారు. కొన్ని డివిజన్లలో మహిళా కార్పొరేటర్ల భర్తలు, సోదరులు, కుమారులు, అల్లుళ్లు కూడా భూదందాలు, రియల్ ఎస్టేట్, కుటుంబ తగాదాలు, భూ పంచాయితీలు, హత్యలు, గొడవలు, కొట్లాటలు, ప్రహరీ గోడలు చివరికి దంపతుల పంచాయితీలు కూడా చేసి ఇరువర్గాల నుంచి డబ్బులు లాగేస్తున్నట్లు తెలిసింది. మహిళా కార్పొరేటర్ల కుటుంబ సభ్యులు తన ఇంటినే పార్టీ కార్యాలయాలుగా, సెటిల్మెంట్ అడ్డాలుగా చేసుకుని వ్యవహారాలు నడిపిస్తున్నారు.

విచ్చలవిడి దందాలు

మహిళా కార్పొరేటర్ల భర్తలతో పాటు సోదరులు, కుమారులు కొందరు యువకులను చేర దీసి గ్యాంగులుగా ఏర్పాటు చేసి కబ్జాలు, గొడవలు సృష్టిస్తున్నట్లు తెలిసింది. డివిజన్‌లో ఎవరైనా కొత్తగా ఇళ్లు, కాంప్లెక్స్, అపార్ట్‌మెంట్, కమర్షియల్ కాంపెక్స్‌లు నిర్మాణం చేస్తుంటే చాలు.. అక్కడ వాలి వసూలు చేస్తున్నట్లు బాధితులు వాపోతున్నారు. ఓ డివిజన్‌లో మహిళా కార్పొరేటర్ భర్త.. కొత్త ఇంటి పనులు చేసే సమయంలో తన అనుయాయులు, కొందరు బల్దియా సిబ్బందిని పురమాయించి పనిముట్లు లాక్కున్నట్లు సమాచారం. ప్రధానంగా విలీన గ్రామాలతోపాటు నగరంలోని కొన్ని డివిజన్‌లలో ఈ అక్రమ వసూళ్ల దందా సాగుతున్నా అటు పోలీసులు గానీ, బల్దియా అధికారులు గానీ పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా మహిళా కార్పొరేటర్లు స్వయంగా బయటకు వచ్చి పాలన చేపట్టాలని నగర ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

కౌలు రైతుకు భరోసా

- పెట్టుబడి సాయం అందిస్తామని ప్రభుత్వం హామీ
- ఈ సీజన్ నుంచే మొదలు పెట్టే ఆలోచన
- త్వరలో మార్గదర్శకాలు జారీ
- అప్రమత్తమవుతున్న వ్యవసాయాధికారులు
- కౌలు రైతుల లెక్కల సేకరణలో నిమగ్నం
- కాంగ్రెస్ సర్కారు హామీతో కర్షకుల్లో ఆశలు

7

'ఆశ'ల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తాం..

- ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలి
- ఆశా వర్కర్ల సమావేశంలో దాస్యం వినయ్‌భాస్కర్

రాంనగర్, జూలై 28: ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాన్ని నిలదీస్తామని, అవసరమైతే రోడ్డెక్కి ఆందోళన కార్యక్రమాలు చేస్తామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్ హెచ్చరించారు. ఆదివారం హనుమకొండలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఆశావర్కర్ల సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న వినయభాస్కర్ మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించడంతోపాటు రూ.2వేలు ఉన్న వేతనం రూ.9వేలు చేశామన్నారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఆశాలకు రూ.18వేల వేతనం ఇస్తామని హామీ ఇచ్చి విస్మరించిందని ఆరోపించారు. ఆశాలకు ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని ఆయన తెలిపారు. ఎనిమిది మాసాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివర్గాలను మోసం చేస్తూనే ఉందని ఆయన ధ్వజమెత్తారు. మేనిఫెస్టోలో పెట్టిన హామీలను ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. ఆశాల సమస్యల పరిష్కారం కోసం ఎంతవరకైనా పోతామని వినయభాస్కర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో తెలంగాణ గ్రామీణ ఆరోగ్య కార్యకర్తల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు రావుల సంతోష, రాష్ట్ర నాయకులు రాంబాబు యాదవ్, శివకుమార్, మంజుల, యువరాజు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వినయభాస్కర్

ఆగస్టు చివరికల్లా అందుబాటులోకి
నయీంనగర్ బ్రిడ్జి

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ టౌన్, జూలై 28: ఆగస్టు చివరికల్లా హనుమకొండలోని నయీంనగర్ బ్రిడ్జి అందుబాటులోకి రానుందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. నిర్మాణంలో ఉన్న నయీంనగర్ బ్రిడ్జి పనులను ఆదివారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి మాట్లాడారు. పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, నాణ్యతాపరమైన ప్రమాణాల్లో ఎటువంటి లోటుపాటు లేకుండా పనులు జరగాలని అధికారులను ఆదేశించారు. ఈ బ్రిడ్జి నిర్మాణం వలన దశాబ్దాలుగా ప్రజలు ఎదురుచూస్తున్న నయీంనగర్ (పెద్దమోరీ) అందుబాటులోకి రానుందని చెప్పారు. ఇప్పటికే రెండో దశ బ్రిడ్జి పనులు కూడా పూర్తికావొచ్చాయని, చివరి దశ బ్రిడ్జి పనులు పూర్తయిన క్రమంలో ప్రజలకు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ శ్రేణులు బత్తిని శ్రీనివాస్,మారంరెడ్డి కౌటిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

అంధుడి కుటుంబంలో 'ఖాకీ' వెలుగులు

● దీనస్థితిలో ఉన్న నిరుపేద కుటుంబానికి ఇల్లు నిర్మించి బాసట ● పెద్దనాగారంలో నూతన గృహాన్ని ప్రారంభించిన జిల్లా ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్



నూతన ఇంటి ముందు ఎస్పీ సుధీర్‌రాంనాథ్

నర్సింహులపేట, జులై 28 : దీనస్థితిలో ఉన్న ఓ అంధుని కుటుంబంలో పోలీసులు వెలుగును నింపారు. మహబూబాబాద్ జిల్లా పోలీస్ అధికారి సూచన మేరకు స్థానిక ఎస్సై గండ్రాతి సతీష్ తన సిబ్బందితో కలిసి కొందరు దాతల ఆర్థిక సాకారంతో నూతన ఇల్లు నిర్మించి, దాతృత్వాన్ని చాటుకున్నారు. నర్సింహుల పేట మండలంలోని పెద్దనాగారం గ్రామానికి చెందిన నిరుపేద అంధుడు మందుల నాగన్న పాటలు పాడుతూ వచ్చిన కొద్దోగొప్పో డబ్బుతో తన కుటుంబాన్ని సాకుతున్నాడు. పుట్టుకతోనే అంధుడు కావడంతో తనకు తోడుగా వచ్చే తల్లీ బక్కమ్మ ఇటీవల స్వల్ప అస్వస్థతకు గురికావడంతో పాటు తను ఉండే ఇల్లు శిథిలావస్థకు చేరిందన్న విషయం స్థానిక పోలీసుల ద్వారా జిల్లాపోలీస్ అధికారికి చేరింది. వెంటనే స్పందించిన ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ అంధుని కుటుంబానికి అండగా ఉంటానని, దాతలు ముందుకు వచ్చేలా చొర వ తీసుకోవాలని ఎస్సై సతీష్‌కు సూచించారు. ఎస్పీ సూచనల మేరకు ఎస్సై సతీష్ సిబ్బందితో అంధుడి ఇంటికి చేరుకున్న అతని దీనస్థితిని చూసి చలిం చి, తక్షణ సాయంగా నిత్యావసర సరుకులు ఇచ్చాడు. గూడు నిర్మించేలా సహకారం అందిస్తామని, అధైర్యపడవద్దని హామీ ఇచ్చాడు. మండలానికి చెందిన కొందరు దాతలు జినుకల రమేశ్, ఉల్లి శ్రీను, శ్రీరాం శేషయ్య, నలమాస రాజు, దాసరోజు రాజశేఖర్‌తో పాటు మరికొందరి సహకారంతో సుమారు రూ.2.50 లక్షలతో రెండుగదుల ఇంటి నిర్మాణాన్ని 20 రోజుల వ్యవధిలోనే చేపట్టారు. ఆ నూతన గృహాన్ని జిల్లా ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ ఆదివారం ప్రారంభించి, అంధుడు నాగన్నకు తల్లి బక్కమ్మకు నూతన వస్త్రాలను అందజేశారు. ఇంటి ఆవరణలో మామిడి మొక్కను నాటారు.

అక్రమ వ్యాపారాలు చేస్తే ఉపేక్షించం..

జిల్లాలో గుడుబా, నల్లబెల్లం, గాంజా లాంటి అక్రమవ్యాపారాలు చేస్తే ఉపేక్షించేదిలేదని ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ హెచ్చరించారు. పెద్దనాగారంలో నూతన గృహాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. పోలీసులు శాంతి భద్రతల నిర్వహణతో పాటు సమాజంలో సేవా భావాన్ని అలవర్చుకోవాలన్నారు. పనితీరును బట్టే పోస్టింగ్‌లు, రివార్డులు ఉంటాయన్నారు. జిల్లాలో నల్లబెల్లం, నాటుసారా పూర్తిస్థాయి నివారణకు ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సైబర్‌నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నామన్నారు. పోలీసుల పనితీరును బట్టే సమాజంలో గౌరవమర్యాదలు పెరుగుతాయన్నారు. జిల్లా పరిధిలో ఉన్న రహదారులపై రోడ్డుప్రమాదాలు జరగకుండా ప్రత్యేక ప్రణాళికను రూపొందిస్తున్నట్లు తెలిపారు. ప్రతీ గ్రామం పరిధిలో యూనిట్‌గా ఏర్పడి ప్రధాన కూడలిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిఘాను పెంచుకోవాలన్నారు. మత్తు, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్‌కు పునాదులు వేసుకోవాలన్నారు. నిరుపేద అంధుడు నాగన్న నూతన ఇంటి నిర్మాణానికి ప్రత్యేక చొరవతీసుకున్న ఎస్సై సతీష్‌ను, సిబ్బందిని సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో తొర్రూరు డీఎస్పీ సురేష్, సీఐ సంజీవ, పోలీస్ సిబ్బంది, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జినుకల రమేష్, దాసరోజు రాజశేఖర్, రవీందర్‌రెడ్డి, లింగారెడ్డి, యాదగిరిరెడ్డి, శేరి రామకృష్ణ, శ్రీరాంశేషయ్య, ఉల్లి శ్రీను, నలమాస రాజు పాల్గొన్నారు.



మౌన దీక్ష పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పెన్షనర్ల సంఘం నాయకులు

చలో హైదరాబాద్‌కు భారీగా తరలిరావాలి

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి

కాళోజీ జంక్షన్, జూలై 28: పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 30న నిర్వహించనున్న చలో హైదరాబాద్ సభకు వందలాదిగా పెన్షనర్లు తరలిరావాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఇ.నర్సింహారెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆదివారం హనుమకొండ రాంనగర్‌లోని పెన్షనర్ల అసోసియేషన్ కార్యాలయంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల పెన్షనర్ల సమావేశం జరిగింది. దీనికి నర్సింహారెడ్డి అధ్యక్షత వహించగా, పెన్షనర్ల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. పెండింగ్‌లో ఉన్న పెన్షనర్ల కరువు భత్యం వాయిదాలను విడుదల చేయాలని, పీఆర్‌సీని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పలువురు మాట్లాడారు. హైదరాబాద్‌లోని ఇందిరా పార్కులో ధర్నాచౌక్ వద్ద నిర్వహించే మౌన దీక్ష కార్యక్రమంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల నుంచి 150 మంది పెన్షనర్లు పాల్గొనే విధంగా సంఘాల బాధ్యులు కృషి చేయాలని తీర్మానించారు. మార్కెట్ కమిటీ రిటైర్డ్ ఉద్యోగుల పక్షాన 25మంది, స్పెషల్ టీచర్ల పక్షాన 20మంది మౌనదీక్షకు హాజరవుతామని నాగపురి సారయ్య, పెద్దూరి పెద్దన్న, సుధాకర్‌లు ప్రకటించడాన్ని సమావేశం స్వాగతించింది. చివరగా మౌన దీక్షకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరిపై కేసు



నిందితుల అరెస్టు చూపిస్తున్న సీఐ సత్యనారాయణరెడ్డి

బాలసముద్రం, జూలై 28: సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధి ఏషియన్ మాల్ ఎదురుగా ఉన్న సెయింట్ పాల్ స్కూల్ సమీపంలో ఎండు గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఆదివారం పోలీసులు అరెస్టు చేశారు. సుబేదారి సీఐ సత్యనారాయణరెడ్డి తెలిపిన ప్రకారం.. సుబేదారి ఎస్ఐ శ్రీకాంత్ సిబ్బందితో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకున్నారు. వారి ద్విచక్ర వాహనాన్ని తనిఖీ చేయగా ఎండు గంజాయి లభించినట్లు సీఐ తెలిపారు. ఇద్దరిని విచారించగా ఒకరు ములుగు జిల్లా మంగపేట మండలం రమణక్కపేట గ్రామానికి చెందిన విద్యార్థి చౌలం దొరబాబు, మరొకరు కమలాపురం గ్రామానికి చెందిన విద్యార్థి మంత్రి సంజయ్‌కుమార్ అని తెలిసినట్లు చెప్పారు. వీరిద్దరూ గంజాయికి బానిసై ఒడిషా రాష్ట్రం నుంచి తక్కువ ధరకు తీసుకువచ్చి హనుమకొండలో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసినట్లు సీఐ సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు.

రెండు జేసీబీలు, టిప్పర్ సీజ్



పట్టుబడిన జేసీబీలు, టిప్పర్‌ను చూపిస్తున్న ఎస్సై శ్రీనివాస్

ఐనవోలు, జూలై 28: మండలంలో రెండు జేసీబీలు, ఒక టిప్పర్‌ను పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపిన ప్రకారం... లింగమోరిగూడెంలో నిల్వచేసిన మట్టితో కూడిన ఇసుకను అనుమతి లేకుండా జేసీబీ ద్వారా లోడింగ్ చేస్తుండగా పట్టుపడింది. అదేవిధంగా పున్నేలు శివారు వడ్డెరిగూడెంలో అనుమతి తీసుకోకుండా మొరంను టిప్పర్ ద్వారా తరలిస్తుండగా జేసీబీ, టిప్పర్ పట్టుపడ్డాయి. వీటిని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. రెండుగ్రామాల్లో 100 కాల్ ఆధారంగా వెంటనే స్పందించి ఇసుక, మొరం అక్రమ రవాణాను నిలుపుదల చేసినట్లు పేర్కొన్నారు.

రూ. 2లక్షల 30వేలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

కొత్తగూడ(మహబూబాబాద్ జిల్లా), జూలై 28 : గంగారం మండలం పెద్దఎల్లాపూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఖాతా నుంచి తనకు తెలియకుండా రూ. 2లక్షల 30 వేలు మాయం కావడంతో బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశాడు. ఎస్సై రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం. పెద్దఎల్లాపూర్‌కు చెందిన గుండగాని శ్రీధర్ ఖాతా నుంచి రూ. 2 లక్షల 30 వేలు డ్రా కావడంతో సైబర్ నేరగాళ్లు తన ఖాతా నుంచి డబ్బులు తీసుకున్నారని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. అనుమానాస్పద లింకులపై టచ్ చేయొద్దని, ఓటీపీలు ఎవరికి చెప్పవద్దని ఎస్సై సూచించారు.

కౌలు రైతుకు భరోసా

● పెట్టుబడి సాయం అందిస్తామని ప్రభుత్వం హామీ ● అప్రమత్తమవుతున్న వ్యసాయాధికారులు
● కౌలు రైతుల లెక్కల సేకరణలో నిమగ్నం ● కాంగ్రెస్ సర్కారు హామీతో కర్షకుల్లో ఆశలు



హనుమకొండ, జులై 28 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతులకు మంచి రోజులు రానున్నాయి. ఈ వానా కాలం పంటల నుంచే కౌలు రైతులకూ పెట్టుబడి సాయం అందిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. రైతు భరోసా పథకం ద్వారా రైతులతో పాటు కౌలు రైతులకు సైతం ఏడాదికి రూ.15వేలు పెట్టుబడి సాయం అందిస్తామని అసెంబ్లీ ఎన్నికల ముందు వాగ్దానం చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కౌలుదారులకు రైతు భరోసా అమలు దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీనిపై మార్గదర్శకాలను త్వరలోనే రూపొందిస్తామని తెలిపింది. ఈమేరకు వ్యవసాయ శాఖ అధికారులకు మౌఖికంగా ఆదేశాలు అందాయి. అధికారులు కూడా ఆ దిశగా కసరత్తు ప్రారంభించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కౌలు రైతులు ఎంత మంది ఉన్నారో లెక్క తేల్చే పనిలో నమగ్నమయ్యారు.

ఎకరాకు రూ.20వేలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో చిన్న, సన్నకారు రైతులు 4,78,562 మంది ఉన్నారు. వీరికి ఎకరా నుంచి ఐదు ఎకరాలలోపు వ్యవసాయ భూములు ఉన్నాయి. రైతులు తమకున్న కొద్దిపాటి భూమితో పాటు పక్కనున్న ఇతరుల పొలాలు కౌలుకు తీసుకొని సాగు చేస్తుంటారు. ఫలితంగా వీళ్లు కూడా సాగుకు అప్పులు చేయాల్సి వస్తోంది. దేవాదుల ఎత్తిపోతల, ఎస్ఆర్ఎస్పీ కాలువ అయకట్టు, ఇతర ప్రధాన రిజర్వాయర్లు, పెద్ద చెరువుల కింద సాగు చేసుకుంటున్న కౌలు రైతులు ఎకరాకు రూ.20వేలను భూమి సొంతదారులకు చెల్లిస్తున్నారు. కాలువలు, కుంటలు, బోరు బావులు కింద సాగు చేసుకుంటున్న కౌలు రైతులు ఎకరాకు రూ.15వేల వరకు చెల్లిస్తున్నారు. మారుమూల ప్రాంతాల్లోనూ ఎకరానికి రూ.10 వేల వరకు చెల్లిస్తున్నారు.

అప్పుల ఊబిలో..

వర్షాధార పంటల్లో ఇతర పంటలతో పోల్చితే ఎక్కువ లాభాలు వచ్చే అవకాశం ఉండటంతో ఉమ్మడి జిల్లాలో ఎక్కువమంది కౌలు రైతులు పత్తిసాగుకే మొగ్గు చూపుతున్నారు. పంట చేతికి వచ్చినా, రాకపోయినా కౌలును మాత్రం చెల్లించాల్సిందే. కౌలుతోపాటు పెట్టుబడులు పెట్టి పంటలు పండించడం వల్ల పెద్దగా గిట్టుబాటు కావడం లేదని కౌలు రైతులు వాపోతున్నారు. కౌలు రైతులకు ప్రభుత్వ పథకాలేమి వర్తించవు. బ్యాంకుల నుంచి కనీసం రుణాలు కూడా అందవు. అప్పులు చేసి పెట్టుబడులు తీసుకువస్తున్నారు. ప్రకృతి వైపరిత్యాలవల్ల పంట నష్టపోతే పరిహారం కూడా అందదు, అధిక వడ్డీ భారంతో కౌలు రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి చివరకు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇలా పలువురు కౌలు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. సాగుకు కావలసిన విత్తనాలు, ఎరువులు, కూలీల ఖర్చులు పెరిగిపోతున్నాయనీ చిన్న, సన్నకారు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ రైతు భరోసాలో భాగంగా కౌలు డబ్బులు చెల్లిస్తే తమకు ఎంతో ఆసరాగా ఉంటుందని అభిప్రాయపడుతున్నారు.

గతంలో ప్రకటించి..

2014కు ముందు అప్పటి ప్రభుత్వాలు కౌలు రైతులకు అధీకృత కార్డులు పంపిణీ చేశాయి. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత ఈ కార్డులు పని చేయడం లేదు. పట్టాదారు పాసు పుస్తకాలు కలిగిన కర్షకులకు రైతు బంధు పథకాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. కౌలు రైతులకు మాత్రం ఎలాంటి ఆర్థిక సాయం అందించలేదు. అధిక వడ్డీకి అప్పులు చేసి పంట ఉత్పత్తులను తిరిగి అదే వ్యాపారులు అమ్ముకోవాల్సి రావడంతో కౌలు రైతులు నష్టాలను మూటగట్టుకున్నారు. ఆర్థిక ఇబ్బందులతో అనేక మంది బలవన్మరణాలకు పాల్పడ్డారు.

మార్గదర్శకాలు ఎప్పుడో..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో వ్యవసాయ పనులు ఇప్పటికే మొదలయ్యాయి. ప్రస్తుతం ప్రభుత్వం వద్ద పట్టాదారులకు సంబంధించిన వివరాలే ఉన్నాయి. కౌలు రైతుల వివరాలు లేవు. అసలు వీరిని ఎలా గుర్తించాలనేదానిపై స్పష్టత లేదు. ఉమ్మడి జిల్లాలోని మూడు లక్షలుపైగా కౌలు రైతులు రైతు భరోసా కింద పెట్టుబడి సాయం వస్తుందని ఆశిస్తున్నారు. ఏటా హనుమకొండ జిల్లాలో 1.40 లక్షలు, వరంగల్ జిల్లాలో 2.50 లక్షలు, జనగామ జిల్లాలో 1.68 లక్షలు, మహబూబాబాద్ జిల్లాలో 2.21 లక్షలు, ములుగు జిల్లాలో 1.10 లక్షలు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 1.12 లక్షల మంది రైతులకు పెట్టుబడి సాయం అందుతోంది. కౌలు రైతులకు కూడా ఈ సాయం అందితే సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. కాగా, ఇప్పటివరకు కౌలు రైతులకు పెట్టుబడి సాయంపై ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గదర్శకాలు రాలేదని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

మొదలైన కసరత్తు

కౌలు రైతులకు రైతు భరోసా అమలు దృష్ట్యా తాజాగా జిల్లాల వారీగా ఎంత విస్తీర్ణంలో వారు పంటలు పండిస్తున్నారో ఆరా తీస్తున్నట్టు సమాచారం. వాస్తవానికి సీజన్ ఆరంభంలోనే ఎన్ని ఎకరాల విస్తీర్ణంలో ఏయే పంటలు సాగవుతున్నాయనే వివరాలను వ్యవసాయ విస్తరణాధికారులు (ఏఈవో) ప్రభుత్వానికి నివేదిస్తారు. ఇప్పటికే పట్టాదారు పాసు పుస్తకాలు కలిగిన రైతుల వివరాలు ప్రభుత్వం వద్ద ఉన్నాయి. ప్రభుత్వం నుంచి రాత పూర్వక ఆదేశాలు అందగానే కౌలురైతుల వివరాలు సమర్పిస్తామని ఉమ్మడి ఇల్లాలోని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

నిరాకరణ

కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుండడంతో భూము యజమానులు కలవరపడుతున్నారు. కౌలు రైతులకు పత్రాలు రాసిచ్చేందుకు నిరాకరిస్తున్నారు. కౌలు పత్రాలు రాసిస్తే రైతు భరోసా పథకానికి ఎక్కడ దూరమౌతామోనని భూయజమానులు భయపడుతున్నారు. ఒక వేళ కౌలు రైతులకు పెట్టుబడి సాయం ప్రభుత్వం ఇచ్చినట్లయితే కౌలు మొత్తాన్ని పెంచే యోచనలో ఉన్నారు. కాగా, గుర్తింపునకు ప్రామాణికమైన కౌలు పత్రాలు లేకపోతే రైతు భరోసా పథకానికి ఎక్కడ దూరమవుతాయని కౌలు రైతులు ఆవేదన చెందుతున్నారు.

కౌలు రైతులు 3 లక్షలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 9 లక్షల ఎకరాల్లో వివిధ పంటల సాగు జరుగుతోంది. 10.50 లక్షల మంది రైతులు ఉన్నారు. వీరిలో పట్టాదారు 9.50 లక్షల మందికి పట్టాదారు పాస్ పుస్తకాలు ఉన్నాయి. వివిధ సాంకేతిక కారణాల వల్ల సుమారు లక్ష మందికి ఇప్పటికీ పట్టాదారు పాసు పుస్తకాలు రాలేదు. కాగా, ఉమ్మడి జిల్లాలో సుమారు 3 లక్షల మంది కౌలు రైతులు ఉన్నట్టు అంచనా. వీరిలో చాలామంది 3 నుంచి 5 ఎకరాల వరకు భూములను కౌలుకు తీసుకొని పంటలు పండించుకుంటున్నారు. వీరిలో 2 నుంచి 3 ఎకరాలు కౌలు తీసుకొన్నవారే ఎక్కువగా ఉన్నట్టు సమాచారం.

నేటి నుంచి దేవాదాయ శాఖ ఉద్యోగుల బదిలీలు

వరంగల్ కల్చరల్, జూలై 28: రాష్ట్ర వ్యాప్తంగా దేవాదాయ శాఖ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ శనివారం నుంచి ప్రారంభమైంది. సోమవారం బదిలీల ఉత్తర్వులు వెలువడనున్నాయి. ఈనెల 31 వరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని స్థాయిల అధికారులు, సిబ్బంది, వివిధ హోదాలు గ్రేడ్‌లలో ఉన్న ఉద్యోగుల బదిలీల ప్రక్రియ పూర్తికానుంది. బదిలీల ప్రక్రియల నేపథ్యంలో రాష్ట్ర దేవాదాయ శాఖ కార్యాలయం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఈవోలు, ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఈవోలు శనివారం రాత్రి హైదరాబాద్‌లోని దేవాదాయశాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణను కలిశారు. దాదాపు 125మంది ఈవోలు ఆర్‌జేసీని కలిశారు. బదిలీల ప్రక్రియ విషయంపై చర్చించినట్లు తెలిసింది. అన్ని స్థాయిల్లో ఉద్యోగుల బదిలీ ప్రక్రియ జూలై 31తో పూర్తిచేయనున్నట్లు తెలిపారు. కొన్నేళ్లుగా ఆలయాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి స్థానచలనం కలగనుంది. వరంగల్ ఉమ్మడి జిల్లాలో 200కుపైగా ఆలయాలు ఉండగా వరంగల్ జిల్లాలో 60కిపైగా దేవాదాయ శాఖకు సంబంధించిన ఆలయాలు ఉన్నాయి. నగరంలో 25కు పైగా ఆలయాలు ఉన్నాయి. ఒక్కో ఆలయానికి ఇప్పటి వరకు మూడు నుంచి నలుగురు సిబ్బంది అవసరం ఉండగా ఒక్కరితోనే విధులు నిర్వహిస్తున్నారు.

ఈవోలు, సిబ్బంది కొరత

ఒక్కో ఆలయానికి నలుగురు సిబ్బంది నాలుగో గ్రేడ్ ఉద్యోగులతోపాటు స్వీపర్, వాచ్‌మెన్‌లు ఉండాలి. వీరితోపాటు ఈవో ఉండాలి. ప్రస్తుతం సిబ్బంది కొరతతోపాటు ఈవోల కొరత కూడా ఉంది. ఒక్కొక్క ఈవోకు నాలుగు నుంచి ఐదు దేవాలయాల ఇన్‌చార్జి బాధ్యతలు అప్పజెప్పారు. దీనికి తోడు ఆలయాల నిర్వహణ కష్టతరంగా మారింది. కొన్నేళ్ల నుంచి పాతుకుపోయిన ఉద్యోగులు అసలు విధులే సరిగా నిర్వహించడం లేదని విమర్శలు వస్తున్నాయి.

గంజాయి సేవిస్తున్న ముగ్గురి అరెస్టు

వరంగల్ క్రైం, జూలై 28: గంజాయి సేవిస్తున్న ముగ్గురు యువకులను కాకతీయ యూనివర్సిటీ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఓఆర్ఆర్‌పై ఆదివారం పెట్రోలింగ్ చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు చెట్ల పొదల మధ్య గంజాయి సేవిస్తూ కనిపించారు. అదుపులోకి తీసుకుని విచారించగా ఖానాపురానికి చెందిన పి.రాజేష్, పి.అనిల్, ఎల్లాయిగూడెంకు చెందిన విపిన్ కుమార్‌గా గుర్తించారు. వారి నుంచి 50 గ్రాముల గంజాయి, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు.



అరెస్టు అయిన ముగ్గురు యువకులు



మాట్లాడుతున్న జెట్టి కుసుమ కుమార్

కమ్మ కులస్థులకు దాన గుణం ఎక్కువ

న్యూశాయంపేట, జూలై28: కమ్మ కులస్థులకు దాన గుణం కలవారని కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ ఫౌండర్, చైర్మన్ జెట్టి కుసుమకుమార్ అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా కమ్మ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండ హంటర్‌రోడ్‌లోని కాకతీయ గార్డెన్‌లో ఆషాఢమాస వనభోజనాలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా జెట్టి కుసుమకుమార్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కమ్మ కులస్థులు ఐక్యంగా ఉండాలన్నారు. కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ ద్వారా ప్రపంచంలో కమ్మ కులస్థులు ఎక్కడ ఉన్నా ఒక్క దగ్గర చేర్చి కులాన్ని బలోపేతం చేసే దిశగా ముందుకెళదామన్నారు. కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ ద్వారా పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వడం, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా పలువురు కూచిపూడి నృత్యం, భరతనాట్యం చేసి అలరించారు. ఈ కార్యక్రమంలో కమ్మ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు రావిపాటి వెంకటేశ్వర్‌రావు, గౌరవ అధ్యక్షుడు మాదాల కాశయ్య, పూర్వ అధ్యక్షుడు మాందాటి కోటేశ్వర్‌రావు, కమ్మం సంఘం నాయకులు బత్తిని శ్రీనివాస్, ఈడుపుగంటి సుబ్బారెడ్డి, పట్టాభిరామయ్య, నరేష్, రామచందర్‌రావు, కూనాటి హరిబాబు, వెంకటేశ్వర్లు, త్రిపురనేని సుబ్రహ్మణ్యం, రాంబాబు, అనిల్‌కుమార్‌తోపాటు పెద్ద సంఖ్యలో కమ్మ కులస్థులు పాల్గొన్నారు.

రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గం ఎంపిక



ఎంపికైన కమిటీ సభ్యులు

హనుమకొండ చౌరస్తా, జూలై 28: రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (బొజ్జాతారకం) ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా శ్రీరాముల పైడి, గునిగంటి రమేష్‌లను ఏకగ్రీంగా ఎంపిక చేసినట్లు రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (బొజ్జాతారకం) రాష్ట్ర అధ్యక్షుడు జన్ను సాంబయ్య తెలిపారు. ఆదివారం రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ అధ్యక్షతన 8వ డివిజన్ కుమార్‌పల్లిలోని న్యూలయోలా హైస్కూల్‌లో రాష్ట్ర కమిటీ సమీక్షా సమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికల పక్రియ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు సాంబయ్యతో పాటు సీనియర్ న్యాయవాదులు షైదం జయపాల్, చేవూరి విజయ ముఖ్య అతిథిలుగా హాజరు కాగా, జిల్లా కమిటీలో పోటీ లేకపోవడంతో ఉమ్మడి వరంగల్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ప్రకటించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా గౌరవ అధ్యక్షురాలిగా చేవూరి విజయ, అధ్యక్షుడిగా శ్రీరాముల పైడి, ప్రధాన కార్యదర్శిగా గునిగంటి రమేష్, ఉపాధ్యక్షులుగా ఎడ్ల రవి, పీసరి రజిత, రుద్రారపు హేమలత, జిల్లా కార్యదర్శులుగా ఎం.డి. హసీనా బేగం, తరాల సమ్మక్క, తరాల శంకర్, ప్రచార కార్యదర్శులుగా ఎం.డి. షహీదా బేగం, గుగులోతు సోనమ్మ, కార్యవర్గసభ్యులుగా భూక్యా అనసూర్య, బానాల మరియా, బోగి రాకేష్, సూడిద మహేందర్, బరిగెల రమేష్‌లను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు సాంబయ్య ప్రకటించారు. ఈ సమావేశంలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (బొజ్జాతారకం) రాష్ట్ర ఉపాధ్యక్షుడు నక్క బిక్షపతి, కార్యదర్శి పార్నంది రమేష్‌చంద్ర, రాష్ట్ర నాయకులు కొంగర సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులను వినియోగించుకోవాలి

బాలసముద్రం, జూలై 28: వివాహాది శుభకార్యాల కోసం ఆర్టీసీ బస్సులను అద్దెకు వినియోగించుకోవాలని వరంగల్-1 డిపో మేనేజర్ వంగల మోహన్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. సురక్షిత ప్రయాణం కోసం ప్రజలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు. వరంగల్-1 డిపో నుంచి అద్దె ప్రాతిపదికన పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్, సూపర్ లగ్జరీ, రాజధాని ఏసీ, గరుడప్లస్ విహారయాత్రల కోసం 9959226047, 7382855793 నంబర్లను సంప్రదించాలని డీఎం మోహన్‌రావు అన్నారు.

సాహిత్యం సమాజ మార్గనిర్దేశనం చేయాలి..

గ్రంథావిష్కరణలో ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ప్రెస్ అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి

హనుమకొండ కల్చరల్, జూలై 28: సాహిత్యం సార్వజనీనమైనదని, ఏ ప్రక్రియలో సాహిత్యం స్పృశించినా అది సమాజ మార్గనిర్దేశనం చేయాలని ప్రెస్ అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం వడ్డెపల్లిలోని ఎలక్ట్రిసిటీ భవన్‌లో ఆచార్య బన్నా ఐలయ్య అధ్యక్షతన జరిగిన సాహిత్య సదస్సులో వెటర్నరీ వైద్యుడు కాయిత వెంకటి కలం నుంచి జాలువారిన 7వ గ్రంథం నేను నా జీవిత ప్రస్థానాన్ని శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అపారమైన అనుభవాన్ని రంగరించి తన జీవితానుభవంలో ఎదురైన అనేక సంఘటనలు పాఠకులకు అనుకూలంగా ఆసక్తిగా మలచి రేపటి తరాలు ఆదర్శంగా తీసుకునేలా రాసిన రచయితను అభినందించారు. ప్రముఖ రచయిత్రి అరుణకీర్తి పతాక కరాజుల గ్రంథాన్ని సమీక్షిస్తూ దళితుల సమీక్షపై అనేక ఆసక్తికర సంఘటనలను అద్భుతంగా మలచి పాఠకులకు చేరువైనారని అన్నారు. కొన్ని సంఘటనల ఆధారంగా మలిచిన గేయాన్ని వినిపించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. డాక్టర్ గిరిజా మనోహర్ బాబు, నెల్లుట్ల రమాదేవి, డాక్టర్ హరినాథ్‌రావు, నిధి, వల్లంపట్ల నాగేశ్వర్‌రావు, తదితరప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పల్లేరు వీరస్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈసదస్సుకు అరసం వరంగల్ కార్యదర్శి డాక్టర్ మార్క శంకర్‌నారాయణ స్వాగతం పలికారు. పెద్దసంఖ్యలో సాహిత్య అభిమానులు, పాత్రికేయులు పాల్గొన్నారు.

విద్యార్థి సంఘాలపై అసత్య ఆరోపణలు సిగ్గుచేటు

● ఐక్య విద్యార్థి సంఘాల నేతల వెల్లడి ● కేయూ వద్ద ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాల దిష్టిబొమ్మ దహనం



ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న విద్యార్థి సంఘాల నేతలు

కేయూక్యాంపస్, జూలై 28: ప్రైవేట్ జూనియర్ కళాశాలలు చేసే విద్యా వ్యాపారాన్ని జిల్లా విద్యాశాఖాధికారుల దృష్టికి తీసుకువెళ్లి ప్రశ్నిస్తే విద్యార్థి సంఘాల నాయకులపై యజమానులు అసత్య ఆరోపణలకు దిగుతున్నారని ఐక్య విద్యార్థిసంఘాల నేతలు హకీమ్ నవీద్, మంద నరేశ్, బొట్ల మనోహర్‌లు ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం కేయూ మొదటి గేటు వద్ద ప్రైవేట్ జూనియర్ కళాశాల యాజమాన్యాల దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హకీమ్ నవీద్, మంద నరేశ్, బొట్ల మనోహర్‌లు మాట్లాడుతూ.. ప్రైవేట్ జూనియర్ కళాశాలలు చేస్తున్న విద్య వ్యాపారీకరణ, ప్రభుత్వ నిబంధనల ఉల్లంఘనలు, ఒకే బ్రాంచ్‌కి అనుమతి పొంది అనేక బ్రాంచ్‌లు నిర్వహించడం, ఫీజుల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి నిలువు దోపిడీని జిల్లా విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించాలని డిమాండ్ చేశామని చెప్పారు. తమ అగడాలు బహిర్గతమవుతున్నాయనే అక్కసుతో ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు హనుమకొండ కలెక్టర్‌కు తమపై వినతి పత్రాన్ని ఇవ్వడం సరికాదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న కళాశాలలపై పోరాటం చేస్తున్న తమపై అసత్య ఆరోపణలు చేయడాన్ని ఖండించారు. నిజాయితీగా ప్రభుత్వ నిబంధనల మేరకు నడుస్తున్న కళాశాలల యాజమాన్యాలు తమతో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. విద్యార్థి సంఘాలపై అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. తమ భవిష్యత్ కార్యాచరణ సోమవారం ప్రకటిస్తామని వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌బీ నాయకులు రోహిత్, ఏబీఎస్ఎఫ్ నాయకులు హర్షం చరణ్, ఇప్ప భరత్, ప్రణయ్, బీఎస్ఎఫ్ నాయకులు దాసరి అఖిల్, అరిస్టాటిల్, సృజన్, మల్లేశ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ హాస్టళ్లలో ఇష్టారాజ్యం



- నగరంలో గల్లీకొకటి చొప్పున వందలాది హాస్టళ్ల ఏర్పాటు
- అనుమతులు, నిబంధనలు లేకుండా నిర్వహణ
- కలుషిత వాతావరణం, నాసిరకం భోజనంతో విద్యార్థుల అవస్థలు
- కొన్ని చోట్ల వ్యభిచారం, నేరాలకు అడ్డాగా మారిన వైనం
- అధికారులు, పోలీసులు దృష్టి పెట్టాలని వినతులు

హనుమకొండ టౌన్, జూలై 28: హనుమకొండ, వరంగల్, కాజీపేట ప్రాంతాల్లో ప్రైవేటు హాస్టళ్ల హవా నడుస్తోంది. కొంతమంది అనుమతులు లేకుండా, నిబంధనలు పాటించకుండా హాస్టళ్లను ఏర్పాటు చేసి వ్యాపారంగా మలుచుకుంటున్నారు. హనుమకొండ నయీంనగర్, హంటర్‌రోడ్డు, చౌరస్తా, ములుగురోడ్డు, భీమారం, వరంగల్ రంగంపేట, పోచమ్మమైదాన్, పోస్టాఫీసు, రంగశాయిపేట, బొల్లికుంట, కాజీపేట, నిట్ ప్రాంతాల్లో కళాశాలలను అడ్డాగా చేసుకొని వందలాది హాస్టళ్లను ఏర్పాటు చేశారు. వీటిలో ఎలాంటి అనుమతులు, నిబంధనలు పాటించకుండా నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

ప్రమాణాలు కరువు

ఉత్తర తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి వరంగల్ నగరానికి చదువులు, ఉద్యోగాలు, వివిధ పనుల కోసం చాలామంది వస్తుంటారు. సొంతంగా రూమ్‌లు తీసుకుని ఉండడం భారమైన వారు.. ప్రైవేటు హాస్టళ్లను ఆశ్రయిస్తుంటారు. అక్కడ నిర్వాహకులు చెప్పిన ఫీజును చెల్లించి ఉంటున్నారు. అయితే అదే అదునుగా భావించిన కొంత మంది నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. డబ్బులే పరమావధిగా భావిస్తూ ఎవరు వచ్చినా హాస్టల్‌లో చేర్చుకోవడమే పనిగా పెట్టుకున్నారు. అడ్మిషన్ తీసుకున్న వారు ఇచ్చిన చిరునామా నిజమైనదేనా? అనేది చూడరు. ప్రైవేటు హాస్టల్‌లో మెయింటెనెన్స్ రిజిస్టర్ కనిపించదు. హాస్టల్‌లో దేని కోసం ఉంటున్నారు? హాస్టల్‌లో ఎలా ఉంటున్నారు? పక్కవారితో ఎలా ప్రవర్తిస్తున్నారు? రోజూ రాత్రి హాస్టల్‌లో ఉంటున్నారా? లేదా? అనేదానిపై ఏ మాత్రం దృష్టి పెట్టడం లేదు. ప్రధానంగా లేడీస్ హాస్టల్స్ వద్ద రక్షణ లేకుండా పోయింది. వాచ్‌మెన్‌లను నియమించడం లేదు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోరు. ఫైర్ సెఫ్టీ ఉండదు. కేవలం నాలుగు గదుల ఇల్లు దొరికితే చాలు.. తెల్లారేకల్లా హాస్టల్ అంటూ బోర్డు పెట్టి ఇష్టానుసారంగా నిర్వహిస్తున్నారు. చాలాచోట్ల హాస్టళ్లలోనే నిర్వాహకులు నివాసం ఉంటుండడంతో శుభకార్యాలు, మందుపార్టీలు చేసుకుంటున్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న సందర్భాలున్నాయి. కొన్ని హాస్టళ్లను అనుకొని లాడ్జీలు నెలకొల్పబడ్డాయి. దీంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అధికారుల తనిఖీలేవి?

నగరంలోని ప్రైవేటు హాస్టళ్లలో కనీస ప్రమాణాలు పాటించడం లేదనే విమర్శలున్నాయి. ఇక్కడ ఆహారం ఎలా తయారు చేస్తున్నారు? శుభ్రత పాటిస్తున్నారా? అనే దానిపై అధికారులు ఏనాడూ పరిశీలించిన పాపాన పోలేదు. ఇటీవల హైదరాబాద్‌లో ప్రైవేట్ వసతి గృహాలపై ఫుడ్‌సేఫ్టీ అధికారులు దాడులు చేయగా విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. కుళ్లిపోయిన కూరగాయలు, శుభ్రతలేని కిచెన్, కలుషితమైన నీరు.. ఇలా రకరకాల సమస్యలు బయటపడ్డాయి. అదే తరహాలో వరంగల్ నగరంలో ఫుడ్‌సేఫ్టీ అధికారులతో పాటు మునిసిపల్ అధికారులు, పోలీసులు సంయుక్తంగా దాడులు జరిపి హాస్టళ్లలో చోటుచేసుకుంటున్న ఆక్రమాలు, నేరాలను అరికట్టాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. కొంతమంది రెండు, అంత కన్నా ఎక్కువ హాస్టళ్ల నిర్వహిస్తున్నారని, అలాంటి వారు రేషన్‌బియ్యాన్ని సన్నబియ్యంగా మార్చి విద్యార్థులకు వడ్డిస్తున్నారనే ఆరోపణలున్నాయి. అలాంటి వారిపై దృష్టిసారించి నియంత్రించాల్సిన అవసరం ఉంది.

కొన్ని సంఘటనలు

- ఒక మహిళ వివాహం చేసుకొని భర్తను వదిలిపెట్టి హాస్టల్‌లో ఉంటోంది. హాస్టల్‌లో ఉంటూనే బయట వేరే గది కిరాయి తీసుకుని వ్యభిచారం నిర్వహిస్తోంది. విటుడు దొరికినప్పుడు రూమ్‌లో గడిపి వస్తుంటుంది. ఈ క్రమంలో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందజేయగా మహిళను ఆదుపులోకి తీసుకొని వదిలేశారు. మహిళ ఒక్కరే ఈ వ్యభిచారంలో పాల్గొనేదా..? హాస్టల్లో ఉన్న అమ్మాయిలకు డబ్బు ఎరవేసి ఈ రొంపిలోకి దింపిందా? అనేదానిపై పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం.
- నయీంనగర్ పెద్దమోరీ సమీపంలో హాస్టల్‌లో ఉంటూ ఓ మహిళ ప్రైవేట్ ఉద్యోగం చేస్తోంది. ఈ మహిళ స్నానం చేస్తున్నప్పుడు హాస్టల్ నిర్వాహకుడు బాత్‌రూమ్‌లోకి చొరబడి లొంగదీసుకున్నాడు. దాన్ని ఆసరాగా చేసుకొని లైంగికంగా వేధిస్తుండటంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.
- కోరుట్లకు చెందిన ఇద్దరు అమ్మాయిలు స్వలింగ సంపర్కులుగా మారి హాస్టల్‌లోనే కాపురం పెట్టారు. నిత్యం రూమ్‌లోకి పోయి తలుపులు పెట్టుకోవడం.. ఇద్దరు కలిసి స్నానం చేయడంతో పాటు అందరిముందే అసభ్యకంగా ప్రవర్తిస్తుండటంతో పోలీసుల కౌన్సెలింగ్ నిర్వహించి హాస్టల్‌ను ఖాళీ చేయించారు.
- ఓ హాస్టల్‌లో అసౌకర్యాలతోపాటు ఘోరాలపై ప్రశ్నించిన యువతిని హాస్టల్ అసోసియేషన్స్ అధ్యక్షుడిగా కొనసాగుతున్న నిర్వాహకుడు ఇష్టానుసారంగా దూషించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు హాస్టల్ నిర్వాహకుడిపై కేసు నమోదు చేశారు.
- కిషన్‌పురలోని ఓ హాస్టల్‌లో ఉంటున్న డిగ్రీ విద్యార్థిని ప్రతీ రోజు రాత్రి బయటికి వెళ్లి తిరిగి ఉదయం హాస్టల్‌కు చేరుకుంటోంది. రోజూ అదే పనిగా వెళ్లి వస్తుండటంతో హాస్టల్ నిర్వాహకులు పోలీసుల దృష్టికి తీసుకుపోగా బాయ్‌ఫ్రెండ్ రూమ్‌కు వెళ్తున్నట్లుగా పోలీసుల విచారణలో ఒప్పుకున్నట్లు తెలిసింది.
- నయీంనగర్ రంగ్‌బార్ సమీపంలో గర్ల్స్, బాయ్స్ హాస్టల్స్ పక్కపక్కనే ఉండటంతో వెకిలిచేష్టలు, అసభ్య ప్రవర్తన చేయడంతో గర్ల్స్ హాస్టల్ నిర్వాహకులు రోడ్డుపైకి వచ్చి అందోళనకు దిగారు. పోలీసులు రంగప్రవేశం చేసి బాయ్స్ హాస్టల్ నిర్వాహకుడితోపాటు, యువకులకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

మెటీరియల్ రిలీజ్‌కు ఈ-స్టోర్ విధానం

హనుమకొండ టౌన్, జూలై 28: వినియోగదారులకు సత్వరమే సేవలందించడంలో భాగంగా టీజీ ఎన్పీడీసీఎల్‌లో కొత్తగా ఈ-స్టోర్ విధానాన్ని ప్రవేశపెట్టిందని వరంగల్ ఎస్ఈ పి.మధుసూదన్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సెక్షన్ ఏఈ మొదటగా ఒక పనికి కావల్సిన మెటీరియల్ స్టాక్ ఉందో లేదో సాప్(ఎస్ఏపీ)సాఫ్ట్‌వేర్‌లో, ఆన్‌లైన్‌లో చూసుకొని ఆ మెటీరియల్‌ను రిజర్వు చేసుకుంటారని పేర్కొన్నారు. రిజర్వు చేసుకున్న మెటీరియల్‌కు సంబంధించిన సమాచారం ఎస్ఏపీ వర్క్‌ఫ్లో ద్వారా సంబంధిత ఏడీఈకి, తర్వాత స్టోర్స్‌కి వర్క్‌ఫ్లో ద్వారా ఆన్‌లైన్‌లో వెళుతుందని తెలిపారు. మెటీరియల్ తీసుకోవడానికి ఏ రోజు రావాలో తేదీని, సమయాన్ని ఎస్ఎంఎస్ రూపంలో, ఎస్ఏపీ మెయిల్ రూపంలో తెలియజేయబడుతుందని వివరించారు. తెలియజేసిన తేదీ సమయానికి స్టోర్‌కు వెళ్లి మెటీరియల్‌ను తీసుకొని పనులు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. దీనిలో పేపర్ ప్రస్థావన ఉండదని, మొత్తం ఆన్‌లైన్‌లో జరుగుతుందని తెలిపారు. అందువల్ల చాలా సమయం ఆదా అవుతుందని, త్వరితగతిన పనులు పూర్తవుతాయని పేర్కొన్నారు. వినియోగదారుల పనులు ఆలస్యం కాకుండా సకాలంలో పూర్తవుతాయని పేర్కొన్నారు. ఆన్‌లైన్ ప్రవేశపెట్టక ముందు కావాల్సిన మెటీరియల్ లిస్టును ప్రింట్ తీసుకొని సంతకాలు తీసుకొని ఆ పేపర్ సంబంధిత అధికారికి అందజేసి సామగ్రిని తీసుకోవల్సి ఉండేదని తెలిపారు. ఈ సమస్యను అధిగమించడానికే ఈ-స్టోర్ విధానాన్ని సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎస్ఏపీ టీం చేశారని తెలిపారు. పేపర్ పనిలేకుండా ఆన్‌లైన్ ద్వారా మెటీరియల్ తీసుకునే సౌలభ్యం విద్యుత్ శాఖకు, వినియోగదారులకు ఎంతో మేలు చేకూరుతుందని పేర్కొన్నారు. సాంకేతిక విధానాన్ని అందిపుచ్చుకుంటూ వినియోగదారులకు 24గంటల పాటు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందిస్తున్నామని ఎస్ఈ మధుసూదన్‌రావు తెలిపారు.

టీయూటీఎఫ్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక



బాబు



భిక్షపతి

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 28: తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం హనుమకొండలోని సుబేదారి ప్రభుత్వ పాఠశాలలో జరిగిన సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా నూతనకంటి బాబు, ప్రధానకార్యదర్శిగా దామెర భిక్షపతితో పాటు గౌరవాధ్యక్షుడిగా కె.విజయపాల్‌రెడ్డి, సహాధ్యక్షులుగా బల్లా సతీష్‌కుమార్, కొండ్రు మంజుల, కోశాధికారిగా పల్లకొండ వీరస్వామి, సంయుక్త కార్యదర్శులుగా మర్రిపెల్లి నాగభూషణం, గుగులోతు కిషన్, బి.సుమాదేవి, కార్యదర్శులుగా టి.వెంకటయ్య, కె.ఉదయ్‌కుమార్, బి.దేవానందం, ఆడిట్ కమిటీ సభ్యులుగా ఎస్.జితేందర్‌రెడ్డి, జవహర్, అకడమిక్ కన్వీనర్‌గా హెచ్. లింగారావు తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వైభవంగా అనఘాష్టమి వ్రతాలు

హనుమకొండ కల్చరల్, జూలై 28: నగరంలోని గణపతి సచ్చిదానంద వరద దత్తక్షేత్రంలో ఆదివారం బహుళ అష్టమిని పురస్కరించుకొని పెద్దఎత్తున అనఘాష్టమి వ్రతాలు నిర్వహించారు. ఆశ్రమ అర్చకులు గోపీకృష్ణశర్మ, దత్త ప్రచారక్ కొక్కుల రాజేంద్రప్రసాద్, ఆలయ ట్రస్టీ వైవీ వామన్‌రావు, వడిచర్ల శ్రీనివాస్, తదితరుల ఆధ్వర్యంలో వ్రతాలు నిర్వహించారు. స్వామివారికి సుగంధ తైలాభిషేకం, పంచామృతాభిషేకం, హారతి నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనఘాష్టమి వ్రతాలలో పెద్ద సంఖ్యలో మహిళలు భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులకు అసౌకర్యం కలిగిస్తే చర్యలు

హనుమకొండ ట్రాఫిక్ సీఐ షుకూర్



బస్ షెల్టర్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీఐ షుకూర్

వరంగల్ క్రైం, జూలై 28: ఆర్టీసీ బస్సులకు అసౌకర్యం కలిగిస్తే చర్యలు తప్పవని హనుమకొండ ట్రాఫిక్ సీఐ షుకూర్ హెచ్చరించారు. ఆదివారం హనుమకొండలోని ఏనుగులగడ్డ బస్‌షెల్టర్ ప్రాంతాన్ని సీఐ షుకూర్ సందర్శించారు. షెల్టర్ ప్రాంతంలో ప్రైవేటు వాహనాలు, ఆటోలు పార్కింగ్ చేయడం వలన కలుగుతున్న ఇబ్బందని వాహనదారులకు వివరించారు. ప్రైవేటు వాహనాలు నిలిపి ఉండటం వల్ల ఆర్టీసీ బస్సులు ఆపలేని పరిస్థితి ఏర్పడుతుందని సీఐ వాహనదారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రైవేటు వాహనాలు నిలుపడం వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సులు ఆపకపోకవడం వలన ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు. ఇక ముందు ప్రైవేటు వాహనాలు ఈ ప్రాంతంలో నిలిపితే చర్యలు తీసుకుంటామని సీఐ షుకూర్ సూచించారు. సీఐ వెంట ఆర్టీసీ ఉద్యోగి రాజేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

వరంగల్ డిపోలో ప్రమాదరహిత వారోత్సవాలు



సిబ్బందిని సన్మానిస్తున్న వరంగల్-1 డీఎం

బాలసముద్రం, జూలై 28: వరంగల్-1 డిపోలో ప్రమాద రహిత వారోత్సవాల్లో భాగంగా ఆదివారం మెయింటెనెన్స్‌డే నిర్వహించినట్లు డిపో మేనేజర్ వంగల మోహన్‌రావు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ గ్యారేజీలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మెకానిక్ ఎం.డి.మోహినుద్దీన్, సీహెచ్.శివప్రసాద్, సిబ్బందిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఏఈ మెకానిక్ శ్రీనివాసులు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవీందర్ పాల్గొన్నారు.

సర్వీస్ పర్సన్లను వెంటనే నియమించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 28: ప్రభుత్వ పాఠశాలల్లో సర్వీస్ పర్సన్లను సత్వరమే నియమించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్.తిరుపతి డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండలోని సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హనుమకొండ జిల్లా కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడు తూ.. పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా ప్రభుత్వం ఇప్పటివరకు పాఠశాలల్లో పారిశుధ్యంపై పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. మన ఊరు, మనబడి కింద ప్రారంభమైన పను లు అసంపూర్తిగానే ఉన్నాయన్నారు ఇప్పుడేమో అమ్మ ఆదర్శ పాఠశాలల పేరిట మరోమారు అరకొర అభివృద్ధి పనులు ప్రారంభించి నత్తనడకన నడుస్తున్నాయని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిర్దిష్టమైన ప్రణాళికతో పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి నాణ్యమైన విద్యను అందించాలన్నారు. ప్రభుత్వం సత్వరమే పాఠశాలల్లో సర్వీస్ పర్సన్లను నియమించేందు కు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎం. రఘుపతి, ప్రధానకార్యదర్శి జి. సత్యనారాయణ, సుబ్బారావు, లక్ష్మయ్య, కుమారస్వామి, రమేష్, అన్నారెడ్డి, భాస్కర్, భిక్షపతి పాల్గొన్నారు.

ఘనంగా మహంకాళి బోనాలు

● హాజరైన ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ● ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి



మొక్కులు చెల్లించుకుంటున్న ఎమ్మెల్యే నాయిని



మొక్కులు చెల్లించుకుంటున్న జంగా రాఘవరెడ్డి

కాజీపేట, జూలై 28: కాజీపేటలో ఆదివా రం మహంకాళి బోనాల సందడి నెలకొంది. విష్ణుపురితో పాటు పలు కాలనీల నుంచి మహిళలు బోనాలు ఎత్తుకుని మహంకాళి గుడికి చేరుకుని అమ్మవారికి మొక్కులు చెల్లించారు. డప్పుచప్పుళ్లు, పోతరాజులు, శివసత్తుల నృత్యాలతో మహిళలు బోనాలు ఎత్తుకుని ఆలయాలకు చేరుకుని భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించారు. బోనాల పండుగకు స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి హాజరై మొక్కులు చెల్లించారు. రాష్ట్ర ప్రజలు ఆయురారోగ్యాలతో మహంకాళి తల్లి దీవెనలతో సంతోషంగా ఉండాలని కోరుకున్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ విజయశ్రీ రజాలీ, మాజీ కార్పొరేటర్ గుంటి కుమారస్వామి, సుంచు అశోక్, నాయకులు ఎండీ. అంకూస్, భరత్, స్థానిక నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల మంజూరుకు కృషి

తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

వడ్డెపల్లి, జూలై 28: జర్నలిస్టుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న ఇళ్లస్థలాల సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇళ్ల స్థలాలు, జర్నలిస్టులకు అక్రిడేషన్‌తో పాటు హెల్త్ కార్డులు అందజేసేందుకు సత్వరమే చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. చాలాచోట్ల జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు రాక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వాటి పరిష్కారం కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాడిపెల్లి మధు, జిల్లా ప్రధాన కార్యదర్శి తోట సుధాకర్, వరంగల్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాంచందర్, దుర్గాప్రసాద్, రాష్ట్ర, జిల్లా నాయకులు కంకణాల సంతోష్, పి.వేణుమాధవరావుతో పాటు ప్రెస్‌క్లబ్ బాధ్యులు, యూనియన్ నేతలు, సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై చిత్తశుద్ధి లేని కేంద్రం

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి రాజేష్‌ఖన్నా



వడ్డెపల్లిలో చలో ఢిల్లీ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

వడ్డెపల్లి, జూలై 28: ఎస్సీ వర్గీకరణ పట్ల కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి, జిల్లా అధ్యక్షుడు ఇల్లందుల రాజేష్‌ఖన్నా అన్నారు. వర్గీకరణ అంశాన్ని కేంద్రం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఆగస్టు 6న న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ చేపట్టే దీక్షకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం హనుమకొండ వడ్డెపల్లిలోని జైభీం కార్యాలయం ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజేష్‌ఖన్నాతో పాటు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపెల్లి విజయ్‌కుమార్ మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కాకుండా ఉండడానికి 2004 నుంచి ఇప్పటి వరకు అధికారంలో ఉన్న కాంగ్రెస్, బీజేపీల చిత్తశుద్ధి లోపమే కారణమని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ వైఖరి వల్లనే మాదిగలు ప్రతీ సంవత్సరం విద్య, ఉద్యోగాలలో నష్టపోతున్నారని అన్నారు. ప్రస్తుత పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అఖిలపక్ష బృందాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నేతలు కట్టిపోగుల ప్రశాంత్, ఇల్లందుల భాస్కర్, జన్ను సంజీవ్, మధు, ఎడెల్లి జోసఫ్, రూపస్, గాజపాక శ్రీకాంత్ పాల్గొన్నారు.

గుట్టను తొలగించే పనులు ప్రారంభం

ఆలయానికి సమకూరనున్న అర ఎకరం స్థలం



విరిగి పడిన బండరాళ్లను తొలగిస్తున్న దృశ్యం

వరంగల్ కల్చరల్, జూలై 28: ఇటీవల కురిసిన వర్షాలకు భద్రకాళి దేవస్థానం ఆలయానికి వెళ్లే అన్నదాన సత్రం మార్గంలో గుట్ట రాయి విరిగి పడడంతో పరిసర ప్రాంతాలు దెబ్బతిన్నాయి. ఆలయానికి వెళ్లే రోడ్డు ధ్వంసం కాగా, విద్యుత్ స్తంభాలు, కరెంటు వైర్లు దెబ్బతిన్నాయి. ఆ ప్రాంతాన్ని దేవస్థానం అధికారులు కుడా అధికారులకు సమాచారం అందించగా కుడా అధికారులు ఆప్రాంతాన్ని పరిశీలించి గుట్ట ప్రాంతాన్ని తొలగించాలని నిర్ణయించారు. సోమవారం నుంచి గుట్ట తొలగించే పనులు ప్రారంభం కానున్నాయి. ఆదివారం విరిగి పడిన కొండ రాళ్లను తొలగించారు. పూర్తిగా గుట్టను తొలగిస్తే దేవస్థానానికి అర ఎకరం పైగా స్థలం సమకూరనున్నది. మాఢ వీధులకు అడ్డంకిగా ఉన్న ఈ గుట్ట తొలగిస్తే నిర్మాణం పనులు త్వరగా పూర్తవుతుంది. గుట్ట తలగించిన స్థలంలో పూర్తిస్థాయిలో నిత్య అన్నదాన సత్రం, ఆలయ ఈవో కార్యాలయం, భక్తుల కోసం అతిథి గృహాన్ని నిర్మించవచ్చు. కాగా, విరిగిపడిన గుట్ట ప్రాంతాన్ని తొలగించే క్రమంలో అన్నదాన సత్రం పరిసర ప్రాంతాలకు కొండ రాళ్లు తగిలే అవకాశం ఉంది. సత్రాన్ని తాత్కాలికంగా వేరే చోటికి తరలించాలని భక్తులు కోరుతున్నారు.



ఒకే వేదికపై కలుసుకున్న మడికొండ జడ్పీఎస్ఎస్ పూర్వ విద్యార్థులు



నారాయణగిరి హైస్కూల్‌లో పూర్వ ఉపాధ్యాయులతో విద్యార్థులు

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

మడికొండ, జూలై 28: మడికొండలోని జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ పాఠశాలలో విద్యనభ్యసించిన 1992-93 విద్యాసంవత్సరం 10వ తరగతి బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనాన్ని ఆదివారం స్థానిక శ్రీరాజరాజేశ్వరి(ఎస్ఆర్) గార్డెన్స్‌లో ఘనంగా జరుపుకున్నారు. 32 యేళ్ల తర్వాత కలుసుకున్న 110 మంది పూర్వ విద్యార్థులు తాము పాఠశాలలో చేసిన చిన్ననాటి చిలిపి పనులు, అల్లరి చేష్టలు, తీపి గుర్తులు నెమరువేసుకుని ఆనందంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. అనంతరం అందరూ కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు తొట్ల రాజు యాదవ్, కల్లెపు నర్సయ్య, బి. రాజు, పి. రవి, కుర్ల మోహన్, పి. కృష్ణ, బి. శ్రీను, కే. భాగ్య, జి. రమ సంతోష్, బి. రవి, సీహెచ్ నాగరాజు పాల్గొన్నారు.

నారాయణగిరిలో..

ధర్మసాగర్ : మండలంలోని నారాయణగిరి ప్రభుత్వ హైస్కూల్‌లో 1980-81 సంవత్సరం పదవ తరగతి చదివిన విద్యార్థులు అపూర్వ సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. ఈ సమ్మేళనం పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు వల్లపురెడ్డి రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పూర్వ ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. పాఠశాలలో చదివిన రోజుల్లోని జ్ఞాపకాలను గుర్తుచేసుకుని ఒకరితో ఒకరు సంతోషాన్ని పంచుకున్నారు. అనంతరం అధ్యక్షుడు రమణారెడ్డిని పూర్వ విద్యార్థులు సన్మానించి అభినందించారు.

కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు రాధాకిషన్, నర్సింహరెడ్డి, జ్యోతి, జనార్దన్‌రెడ్డి, పూర్వ విద్యార్థులు రాజకమలాకర్ రెడ్డి, వెంకటపతి, అన్నపూర్ణ, భాస్కర్‌రెడి, గై వెంకటేశ్వర్లు, రాజేంద్రం, విజయరెడ్డి, అశోక్‌రెడ్డి, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ వైద్యుడికి జాతీయ అవార్డు



డాక్టర్ రామక శ్రీనివాస్

వరంగల్ మెడికల్, జూలై 28: వరంగల్ నగరానికి చెందిన ప్రముఖ హృద్రోగ నిపుణుడు డాక్టర్ రామక శ్రీనివాస్‌కు జాతీయ అవార్డులు లభించింది. కేంద్ర మంత్రి రాజ్‌భూషణ్ చౌదరి చేతులమీదుగా ఆదివారం ఢిల్లీలో బ్లాక్‌బక్ స్టెల్లర్ మెడికల్ రీసెర్చ్ అవార్డును అందుకున్నారు. సీపీఆర్‌లో కొన్ని వేల మందికి శిక్షణ ఇచ్చిన వైద్యుడిగా, ప్రాణదాతగా పేరుగాంచిన డాక్టర్ రామక శ్రీనివాస్ జాతీయ అవార్డు అందుకోవడం పట్ల పలువురు వైద్యులు, జిల్లా ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు.

రెడ్డి సంఘం మండల కార్యదర్శిగా వాసుదేవరెడ్డి



వడ్డెపల్లి, జూలై 28: గ్రేటర్ వరంగల్ 60వ డివిజన్ దేవన్నపేట గ్రామానికి చెందిన సూరం వాసుదేవరెడ్డి హసన్‌పర్తి మండల రెడ్డి సంఘం కార్యదర్శిగా నియమితులయ్యారు. రెడ్డి సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు అర్షుల కిషన్‌రెడ్డి ఆదేశం మేరకు మండల అధ్యక్షుడు వీసం సురేందర్‌రెడ్డి నియామక ఉత్తరులను ఆదివారం జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డికి వాసుదేవరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లుకు సన్మానం



వెంకటేశ్వర్లను సన్మానిస్తున్న సొసైటీ సభ్యులు

హనుమకొండ చౌరస్తా, జూలై28: 10వ డివిజన్ కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్‌లీడర్‌గా నియమితులైన నేపథ్యంలో ఘనంగా సన్మానించారు. ఆదివారం 10వ డివిజన్‌లోని శ్రీరాంనగర్ వెల్ఫేర్ సొసైటీ కాలనీలోల ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఫ్లోర్‌లీడర్ తోట వెంటేశ్వర్లును కాలనీవాసులు గజమాలతో సన్మానించి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో కాలనీవాసులు కోల సురేందర్, దిడ్డి నాగభూషణం, సూరం సమ్మయ్య, ఎం.కుమార్, డి.వెంకట్, నాగ శంకర్, శివ, ప్రభాకర్, రామకృష్ణకాలనీ వాసులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేసిన బాలవికాస సంస్థ

కాజీపేట, జూలై 28: కాజీపేట ఫాతిమానగర్‌లోని బాలవికాస శిక్షణ కేంద్రంలో 220 మంది అనాథ విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు, స్టడీ మెటీరియల్ అందజేశారు. ప్రోగ్రామ్ మేనేజర్ శ్రీలత మాట్లాడుతూ.. ప్రతీ మనిషికి విద్య అనేది అత్యంత విలువైనదన్నారు. బాలవికాస అందిస్తున్న సహకారంతో విద్యార్థులు విద్యలో ముందుండి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీ ప్రోగ్రామ్ మేనేజర్ శివరామ్, స్వాతి, సుజాత, అమూల్య తదితరులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్‌ను సందర్శించిన కేవీపీఎస్



మాట్లాడుతున్న సంఘ నాయకులు

కాజీపేట, జూలై 28 : కాజీపేట బీసీ హాస్టల్‌ను ఆదివారం కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం నాయకులు సందర్శించారు. హాస్టల్‌లో ఉన్న సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి మంద సంపత్ మాట్లాడారు. హాస్టల్‌లో బిల్డింగ్ గోడలు పెచ్చులూడిపోయి ఉన్నాయన్నారు. కిటికీలకు జాలీలు లేవని, గ్రౌండ్‌లో పిచ్చిమొక్కలు, గడ్డి పెరిగి ఉందన్నారు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించకుంటే పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. హాస్టల్‌లో ఒక డాక్టర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఓరుగంటి సాంబయ్య, నాయకులు సారంగపాణి, గణేశ్, రమేష్, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

కేజీ వీల్ ట్రాక్టర్ యజమానిపై కేసు



కేజీ వీల్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఆపిన ఎస్ఐ

వరంగల్ క్రైం, జూలై 28: మడిపల్లి గ్రామ శివారులో మాచర్ల సాయి అనే వ్యక్తి తన ట్రాక్టర్ కేజీ వీల్‌తో రోడ్డుపై వెళుతుండగా ఆపిన హసన్‌పర్తి పోలీసులు.. కేసు నమోదు చేశారు. ఆదివారం హసన్‌పర్తి పోలీసుస్టేషన్ ఎస్ఐ దేవేందర్ వాహనాలు తనిఖీ చేస్తుండగా సాయి కేజీవీల్ కలిగిన ట్రాక్టర్‌తో రోడ్డుపై వెళుతుండటం గమనించి ఆపి కేసు నమోదు చేశారు. ఎవరైనా కేజీ వీల్స్‌తో రోడ్డు ఎక్కిన ట్రాక్టర్సను సీజ్ చేసి కేసు నమోదు చేస్తామని ఎస్ఐ దేవేందర్ తెలిపారు.

బడులా.. కుంటలా..

(5వ పేజీ తరువాయి)

విద్యార్థులకు ఇబ్బందిగా మారింది.

బురద గుంటలుగా గ్రామీణ పాఠశాలలు

పట్టణ ప్రాంతాల్లో పాఠశాలల దుస్థితి ఇలా ఉంటే.. గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలల దుస్థితి మరోలా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో పరిసరాలన్నీ బురద గుంటలను తలపిస్తున్నాయి. హనుమకొండ జిల్లాలోని ఎల్కతుర్తి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌కు వెళ్లాలంటే విద్యార్థులు స్కేటింగ్ చేయాల్సిన పరిస్థితి ఉంది. మోడల్ స్కూల్‌కు వెళ్లే దారి మొత్తం బురదతో నిండి ఉంది. వరంగల్ జిల్లాలోని చెన్నారావుపేట మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ ప్రాంగణమంతా బురదమయమైంది. రెండు జిల్లాలోని వివిధ మండలాల్లోని గ్రామాల్లోని పాఠశాలల్లో ఇలాంటి దుస్థితి నెలకొని ఉంది.

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి



ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించాలి. పాఠశాల ప్రాంగణాల్లో పరిశుభ్ర వాతావరణాన్ని కల్పించేలా చర్యలు చేపట్టాలి. పాఠశాలల్లో ప్రభుత్వం చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి పనులను త్వరితగిన పూర్తిచేసి వేస్టేజ్‌ను పాఠశాల ప్రాంగణాల నుంచి బయటకు పంపించాలి. ముఖ్యంగా వానాకాలంలో ప్రభుత్వ బడుల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేసి విద్యార్థులు రోగాల బారిన పడకుండా తగు చర్యలు చేపట్టాలి.

\- మేడ రంజిత్‌కుమార్, టీజీవీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి

నవ్య

కుటుంబ కదంబం

సోమవారం 29 జూలై 2024

యంగ్ టాలెంట్



అదరగొట్టిన ఆయేషా

రష్యాలోని ఉలియనోవ్స్క్ నగరం. 'బ్రిక్స్' దేశాల 'యూత్ మినిస్టర్స్' సదస్సు జరుగుతున్న ప్రాంగణం. ఓ యువతి... వేదికను అలంకరించింది. సామాజిక అంశాలు... అందులో యువత పాత్రపై అనర్గళంగా మాట్లాడింది. ఆ ప్రసంగానికి సభాస్థలి చప్పట్లతో మార్మోగింది. ఆమె ఎవరో కాదు... మన తెలుగు అమ్మాయే. పేరు... ఆయేషా. తెలుగు రాష్ట్రాల నుంచి 'బ్రిక్స్'కు వెళ్లిన ఏకైక వ్యక్తి ఆమె. ఆ విశేషాలను 'నవ్య'తో పంచుకుంది.

'నేను జీవించే సమాజం... పుట్టి పెరిగిన ప్రాంతం... వాటి అభివృద్ధికి చేతనైన సాయం చేయాలనేది చిన్నప్పటి నుంచీ నా ఆకాంక్ష. వయసుతో పాటు నాలో సామాజిక చింతన కూడా పెరుగుతూ వచ్చింది. విశాఖ జిల్లా పెందుర్తి మండలం సరిపల్లి గ్రామంలోని ఓ నిరుపేద కుటుంబం మాది. మా నాన్న షేక్ రెహమాన్ లారీ డ్రైవర్. అమ్మ మదీనా బీబీ గృహిణి. నాకు ఇద్దరు అక్కలు. విశాఖలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తయింది. అనంతరం విజయనగరం సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీలో మెడిసినల్ కెమిస్ట్రీలో పీజీ చదివాను. ప్రస్తుతం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో సింథటిక్ కెమిస్ట్రీలో పీహెచ్‌డీ చేస్తున్నా. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులున్నా మా నాన్న మమ్మల్ని చదివిస్తున్నారు. ఆయన ప్రోత్సాహంతోనే ఇక్కడివరకు రాగలిగాను.

సామాజిక స్పృహ...

ఎప్పుడూ మన గురించి మనమే కాదు... తోటివారి గురించి కూడా ఆలోచించాలి. సమాజానికి ఎంతోకొంత తిరిగి ఇవ్వాలి. ఆ లక్ష్యంతోనే చదువుతోపాటు సామాజిక సేవలో కూడా భాగం అయ్యాను. వివిధ స్వచ్ఛంద సంస్థలు, స్నేహితులతో కలిసి హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లోని మురికివాడల్లో పర్యటిస్తున్నాను. అక్కడి ప్రజలకు పరిశుభ్రత, ఆరోగ్యం పట్ల అవగాహన కల్పిస్తున్నాను. శానిటరీ నేప్కిన్స్ పంపిణీ, నిరుపేదలు, వీధుల్లో జీవించేవారికి వస్త్రాలు అందిస్తున్నాను. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడంపై అవగాహన కల్పిస్తున్నాను. మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహిస్తున్నాను. తద్వారా పర్యావరణ పరిరక్షణలో నా వంతు కర్తవ్యాన్ని నిర్వర్తించే ప్రయత్నం.



> సభ ముగింపు రోజు నాకు మాట్లాడే అవకాశం లభించింది. విభిన్న అంశాల్లో సహకరించుకొంటున్న 'బ్రిక్స్' దేశాలు, యువతకు సంబంధించిన పలు కీలక అంశాలపై ప్రసంగించాను. ముఖ్యంగా సంస్కృతి, యువ నాయకత్వం పెంపుదల, సామాజిక సేవా కార్యక్రమాలు, వీటిల్లో యువత భాగస్వామ్యంపై పరస్పరం సహకరించుకోవాలని సూచించాను. అందుకు ఒక వేదిక కల్పించాలని 'బ్రిక్స్'ను కోరాను.

విద్యార్థి ఉద్యమాల్లో...

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి వచ్చాక సామాజిక కార్యక్రమాలు మరింతగా ఊపందుకున్నాయి. దాంతోపాటు విద్యార్థి పోరాటాల్లోనూ భాగమయ్యాను. ఇటీవల మా యూనివర్సిటీ అధ్యక్ష ఎన్నికల్లో ఏబీవీపీ తరుపున పోటీ చేశాను. ప్రెసిడెంట్ పదవికి పోటీపడిన తొలి ముస్లిం యువతిని నేనే. అయితే ఆ ఎన్నికల్లో ఓడిపోయాను. అలాగని చేతులు ముడుచుకుని కూర్చోలేదు. విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాడుతూనే ఉన్నాను.

'బ్రిక్స్'కు అలా...

నాలోని ఈ సేవా భావం, పోరాడే తత్వమే నాకు 'బ్రిక్స్' (బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా) దేశాల 'యూత్ మినిస్టర్స్' సదస్సులో పాల్గొనే అవకాశం తెచ్చి పెట్టింది. ఈ నెల 22 నుంచి 25 వరకు రష్యాలోని ఉలియనోవ్స్క్ నగరంలో ఈ సదస్సు జరిగింది. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆహ్వానం మేరకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వేలల్లో దరఖాస్తులు వచ్చాయి. అందులో నుంచి వడపోసి, పద్నాలుగు మందిని ఎంపిక చేశారు. వారిలో నేనూ ఉన్నాను. సామాజిక సేవా విభాగంలో నన్ను ఎంపిక చేశారు. తెలుగు రాష్ట్రాల నుంచి ఈ సదస్సులో పాల్గొన్నది నేనొక్కదాన్నే. ఇది నాకు ఎంతో గర్వంగా అనిపించింది.

అనూహ్య స్పందన...

సభ ముగింపు రోజు నాకు మాట్లాడే అవకాశం లభించింది. విభిన్న అంశాల్లో సహకరించుకొంటున్న 'బ్రిక్స్' దేశాలు, యువతకు సంబంధించిన పలు కీలక అంశాలపై ప్రసంగించాను. ముఖ్యంగా సంస్కృతి, యువ నాయకత్వం పెంపుదల, సామాజిక సేవా కార్యక్రమాలు, వీటిల్లో యువత భాగస్వామ్యంపై పరస్పరం సహకరించుకోవాలని సూచించాను. అందుకు ఒక వేదిక కల్పించాలని 'బ్రిక్స్'ను కోరాను. ఇది ఆయా దేశాల్లో సామాజిక సేవా కార్యక్రమాలు విస్తృతం కావడానికి, మరింతమంది యువత సేవ వైపు మళ్లేందుకు దోహదం చేస్తుందని వివరించాను. నా సూచనలకు ప్రతినిధుల నుంచి అనూహ్య స్పందన లభించింది. ప్రసంగం అనంతరం సభా ప్రాంగణం చప్పట్లతో మార్మోగింది. పలువురు ప్రశంసలు కూడా అందుకున్నాను. నా ప్రతిపాదనలకు ఈ స్థాయిలో మద్దతు లభిస్తుందని అస్సలు అనుకోలేదు. కేంద్ర మంత్రి రక్ష నిఖిల్ ఖడ్సే కూడా నన్ను ప్రత్యేకంగా అభినందించారు. ఇది నాలో ఎనలేని స్ఫూర్తి నింపింది. భవిష్యత్తులోనూ సేవా కార్యక్రమాలు కొనసాగించడానికి, యువత గొంతుకై నిలబడడానికి ఈ సదస్సు నాకు ప్రేరణ ఇచ్చింది."

● బి. శ్రీనివాసరావు / ఎం. శివప్రసాద్

మీరు మంచి తల్లితండ్రులేనా?



తల్లి తండ్రులందరూ తమ పిల్లలు బాగా అభివృద్ధి చెందాలనే కోరుకుంటారు. అయితే వారి వ్యక్తిత్వాల ప్రభావం కూడా పిల్లలపై పడుతుందనే విషయాన్ని మర్చిపోతారు. స్టాన్‌ఫర్డ్‌కు చెందిన ఎలీనేర్ మోకాబే, జాన్ మార్టిన్‌లు తాజాగా రాసిన ఒక వ్యాసంలో తల్లితండ్రులు ఎన్ని రకాలుగా ఉంటారో.. వారి ప్రభావం పిల్లలపై ఎలా పడుతుందో వివరించారు.

పర్మిసివ్ పేరెంట్స్

సాధారణంగా వీరు పిల్లలకు స్నేహితులుగా ఉండాలనుకుంటారు. వీరు పిల్లలతో ఎటువంటి సంఘర్షణ రాకుండా చూసుకుంటూ ఉంటారు. చిన్న తేడా వచ్చినా కలత చెందుతారు. పిల్లలకు ఏం కావాలంటే అవి ఇస్తూ ఉంటారు. వీరిలో కనిపించే లక్షణాలు ఇవే..

- పిల్లల పట్ల ఎక్కువ బాధ్యతగా వ్యవహరిస్తూ ఉంటారు. పిల్లలను ఏ విధంగాను డిమాండ్ చేయరు.
- వీరు పిల్లలతో స్వేచ్ఛగా మాట్లాడతారు. పిల్లలకు ఏం కావాలో వారే నిర్ణయించుకోవాలని భావిస్తారు.
- వీరి పెంపకంలో ఎటువంటి రూల్స్ ఉండవు.
- పిల్లలను ఆనందంగా ఉంచటం కోసం ఏ పని చేయటానికైనా వెనకాడరు.

అథారిటేటివ్ పేరెంట్స్

వీరు పిల్లల అవసరాలను గుర్తించి వారికి అండగా నిలబడతారు. నిజాయితీతో.. విలువల ఆధారంగా వీరు పిల్లలతో చర్చలు జరుపుతూ ఉంటారు. ఈ తరహా తల్లితండ్రులు ఉన్న పిల్లలు స్వయం నిర్ణయాలు తీసుకోగలుగుతారు. ఇతరులపై ఆధారపడరు.

లక్షణాలు ఇవే..

- పిల్లలు బాధ్యతాయుతంగా ఉండాలనుకుంటారు. ఆ లక్షణాలను డిమాండ్ చేస్తారు.
- కచ్చితమైన నియమ నిబంధనలను ఆచరణలో పెడతారు.
- పిల్లలతో ప్రతి రోజు మాట్లాడుతూ ఉంటారు. వారి మనసులో మాటలను తెలుసుకోవటానికి ప్రయత్నిస్తారు
- పిల్లలు వైఫల్యం చెందితే నిందించరు. అది ఎదిగే ప్రక్రియలో ఒక భాగంగా భావిస్తారు. పిల్లలకు అండగా నిలబడతారు.

నెగ్లెట్‌ఫుల్ పేరెంట్స్

వీరు పిల్లలను అస్సలు పట్టించుకోరు. వారితో ఎక్కువ సమయం గడపరు. వీరు తమ వ్యవహారాలకు ఎక్కువ సమయం కేటాయిస్తూ ఉంటారు. అందువల్ల పిల్లల ఆలోచనలను తెలుసుకోలేకపోతారు.

లక్షణాలు ఇవే..

- పిల్లలను పట్టించుకోరు. వారిని ఎక్కువగా డిమాండ్ కూడా చేయరు.
- వీరు పట్టించుకోకపోవటం వల్ల పిల్లలు వారంతట వాళ్లే పెరుగుతూ ఉంటారు.
- పిల్లలకు ఎటువంటి గైడెన్స్ ఇవ్వరు.
- వారే ఆత్మనూన్యతతో బాధపడుతూ ఉంటారు.

అథారిటేరియన్ పేరెంట్స్

వీరు తమ పిల్లలు విపరీతమైన క్రమశిక్షణతో పెరగాలని భావిస్తారు. పిల్లల మాటలను ఏ మాత్రం వినరు. వారి అవసరాలను గుర్తించరు.

లక్షణాలు ఇవే

- వీరు పిల్లల నుంచి ఎక్కువ ఆశిస్తారు. ఎక్కువ బాధ్యత తీసుకోరు
- పిల్లల మనోభావాలు పట్టించుకోకుండా తమ మాట నెగ్గాలని భావిస్తారు
- 'నా మాటే శాసనం.. నేను చెప్పింది వినాల్సిందే' అని పదే పదే అంటూ ఉంటారు
- వీరిలో ఎటువంటి చర్చలు ఉండవు. వారు చెప్పింది చేయాల్సిందే!

ఏ స్టైల్ మంచిది?

ప్రతి స్టైల్‌లోను కొన్ని సమస్యలు ఉన్నాయి. కానీ పిల్లల పట్ల బాధ్యతగా ఉంటూ.. వారికి స్వేచ్ఛను ఇవ్వటమే మంచిదని మానసిక నిపుణులు పేర్కొంటున్నారు. పిల్లల అవసరాలను గమనించి దానికి తగ్గట్టుగా మసలుకుంటే- పిల్లలకు కూడా పరిస్థితుల ఆధారంగా ప్రవర్తించటం వస్తుందని వారు చెబుతున్నారు. ఉదాహరణకు పిల్లలకు జ్వరం వచ్చినప్పుడు- వారి పట్ల ప్రేమ చూపించి.. అవసరమైతే కొన్ని రూల్స్‌ను బ్రేక్ చేయటం మంచిదంటున్నారు. ఇదే విధంగా పిల్లల భద్రత విషయానికి వచ్చినప్పుడు కచ్చితంగా ఉండాల్సిన అవసరం కూడా ఉందంటున్నారు.



హాట్ హిట్స్

ఈ వారం అమెజాన్ మ్యూజిక్‌లో దేశవ్యాప్తంగా ట్రెండ్ అవుతున్న టాప్-10 బాలీవుడ్ పాటలు...

1. తౌబా తౌబా (బ్యాడ్ న్యూజ్)
2. సాజ్‌నీ రే (లాపతా లేడీస్)
3. అఖియా గులాబ్ (తేరీ బాతోమ్‌మే ఐసా ఉల్జా జియా)
4. ఓ మాహీ (డంకీ)
5. తుమ్ సే (తేరీ బాతోమ్‌మే ఐసా ఉల్జా జియా)
6. నైనా (క్రూ)
7. చలేయా (జవాన్)
8. తేరీ బాతోమ్‌మే ఐసా ఉల్జా జియా (తేరీ బాతోమ్‌మే ఐసా ఉల్జా జియా)
9. హీర్ ఆస్మానీ (ఫైటర్)
10. తైనూ ఖబర్ నహీ (మునియా)

ట్రెండింగ్ టాప్ తెలుగు సాంగ్: కుర్చీ మడతపెట్టి (గుంటూరు కారం)

బిజినెస్

- బజాజ్ ఫిన్‌సర్వ్ ఏఎంసీ.. లార్జ్ క్యాప్ ఫండ్‌ను ప్రారంభించింది. మదుపరులకు దీర్ఘకాలంలో మెరుగైన రిటర్నులు అందించే విధంగా ఎంపిక చేసిన 25-30 స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేయటం ఈ ఫండ్ ప్రత్యేకత. కనీస పెట్టుబడి రూ.500. ఈ ఫండ్ ఆగస్టు 12న ముగియనుంది.
- మారుతి సుజుకీ ఇండియా.. సరికొత్త ఇగ్నిస్‌ను విడుదల చేసింది. ఇగ్నిస్ రేడియన్స్ ఎడిషన్ పేరుతో దీన్ని తీసుకువచ్చింది. ఈ కారు ప్రారంభ ధర రూ.5.49 లక్షలు (ఎక్స్ షోరూమ్). ఎక్స్‌టీరియర్ డిజైన్, ప్రీమియం ఇంటీరియర్స్, అత్యాధునిక టెక్నాలజీతో దీన్ని రూపొందించింది.
- ప్రవాస భారతీయులకు మరింత చేరువయ్యేందుకు గాను హెచ్ఎస్‌బీసీ ఇండియా.. సరికొత్త క్యాంపెయిన్‌ను ప్రారంభించింది. ఇందుకోసం ప్రియాంక చోప్రా జొనాస్‌తో కలిసి ప్రత్యేకంగా ఒక ప్రచారాన్ని చేపట్టింది.
- వెల్‌స్పన్ లివింగ్.. రాయిటర్స్ విజన్ 2045 కార్యక్రమంలో భాగస్వామిగా చేరింది. ఇందులో భాగంగా సస్టెయినబిలిటీ, సామాజిక బాధ్యతలో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా కార్యక్రమాలను చేపట్టనుంది.



ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)			
29వ తేదీ		విజయవాడ	480
హైదరాబాద్	460	గోదావరి	476
వరంగల్	462	విశాఖపట్నం	485
చిత్తూరు	533	డజను గుడ్లు రూ. 72	



ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్			
హైదరాబాద్	94	విజయవాడ	97
వరంగల్	94	గుంటూరు	100
కరీంనగర్	94	ఒంగోలు	100
మహబూబ్‌నగర్	94	చిత్తూరు	104
కర్నూలు	94	నెల్లూరు	104
విశాఖపట్నం	86	అనంతపురం	97
గోదావరి	97		

అల్ట్రాటెక్ చేతికి ఇండియా సిమెంట్స్

- రూ.3,954 కోట్లతో 32.72 శాతం వాటా కొనుగోలు
- మరో 26 శాతానికి త్వరలో ఓపెన్ ఆఫర్
- ఒక్కో షేరుకు రూ.390 చొప్పున ఆఫర్



న్యూఢిల్లీ: సిమెంట్ రంగంలో పోటీ ఊపందుకుంది. దక్షిణాది సిమెంట్ మార్కెట్‌పై పట్టుకోసం అదానీ గ్రూప్, ఆదిత్య బిర్లా గ్రూప్ పోటీ పడుతున్నాయి. ఈ పోటీలో భాగంగా ఆదిత్య బిర్లా గ్రూప్‌నకు చెందిన అల్ట్రాటెక్ సిమెంట్.. దక్షిణ భారత మార్కెట్లో ముఖ్యంగా తమిళనాడు సిమెంట్ మార్కెట్లో గట్టి పట్టున్న ఇండియా సిమెంట్స్ లిమిటెడ్ (ఐసీఎల్) కంపెనీని టేకోవర్ చేస్తోంది. ఈ ప్రయత్నంలో భాగంగా ముందుగా ఇండియా సిమెంట్స్ కంపెనీ ప్రధాన ప్రమోటర్ ఎన్.శ్రీనివాసన్ ఆయన కుటుంబసభ్యుల నుంచి రూ.3,954 కోట్లతో 32.72 శాతం వాటాను కొనుగోలు చేస్తోంది. ఇందుకోసం ఒక్కో ఐసీఎల్ షేరుకు రూ.390 చొప్పున చెల్లించనుంది. ఈ ఏడాది జూన్‌లోనూ అల్ట్రాటెక్ సిమెంట్.. ఐసీఎల్ ఈక్విటీలో 23 శాతం వాటాను డీమార్ట్ అధినేత, ఇన్వెస్టర్ ఆర్‌కే దమానీ నుంచి బ్లాక్ డీల్ ద్వారా కొనుగోలు చేసింది. తాజా డీల్‌తో ఐసీఎల్ ఈక్విటీలో అల్ట్రాటెక్ సిమెంట్స్ వాటా 55 శాతానికి పెరగనుంది.

త్వరలో ఓపెన్ ఆఫర్: ఐసీఎల్ ఈక్విటీలో మరో 26 శాతం వాటా కోసం త్వరలో ఓపెన్ ఆఫర్ ప్రకటించనున్నట్టు అల్ట్రాటెక్ సిమెంట్ ప్రకటించింది. ఇందుకోసం ప్రమోటర్లకు ఆఫర్ చేసిన విధంగానే ఒక్కో షేరుకు రూ.390 చొప్పున చెల్లిస్తామని తెలిపింది. గత శుక్రవారం బీఎస్ఈలో ఐసీఎల్ షేరు ముగింపు ధర కంటే ఇది 4.1 శాతం ఎక్కువ. ఐసీఎల్ ప్రధాన ప్రమోటర్ల నుంచి ఐసీఎల్ ఈక్విటీలో 32.72 శాతం వాటా కొనుగోలుకు కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) నుంచి అనుమతి లభించిన వెంటనే అల్ట్రాటెక్ ఈ ఓపెన్ ఆఫర్ ప్రకటించనుంది. రెగ్యులేటరీ సంస్థల నుంచి అన్ని అనుమతులు లభించి ఐసీఎల్ తమ చేతికి వచ్చేందుకు ఎంత లేదన్నా ఆరు నెలల సమయం పడుతుందని అల్ట్రాటెక్ తెలిపింది.

దక్షిణాదిపై పట్టు: పెన్నా సిమెంట్స్ టేకోవర్‌తో అదానీ సిమెంట్స్‌కు దక్షిణ భారత సిమెంట్ మార్కెట్‌పై గట్టి పట్టు ఏర్పడింది. దీంతో అల్ట్రాటెక్ సిమెంట్ కూడా ఈ మార్కెట్‌పై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇందులో భాగంగానే దక్షిణ భారత్‌లో అతి సిమెంట్ కంపెనీ అయిన ఇండియా సిమెంట్స్‌ను కొనుగోలు చేస్తోందని భావిస్తున్నారు. అల్ట్రాటెక్ సిమెంట్‌కు దక్షిణ భారత్‌లోని ప్రధాన నగరాలకు చేరువలో పెద్ద సంఖ్యలోనే రెడీ టు మిక్స్ సిమెంట్ ప్లాంట్లు ఉన్నాయి. అయితే సిమెంట్ ఉత్పత్తి యూనిట్లు మాత్రం పెద్దగా లేవు. ఐసీఎల్ కొనుగోలుతో ఈ లోటు తీరనుంది. అల్ట్రాటెక్ కంపెనీకి ప్రస్తుతం దేశవ్యాప్తంగా 15.4 కోట్ల టన్నుల వార్షిక సిమెంట్ ఉత్పత్తి సామర్థ్యం ఉంది. ఇందులో 2.5 కోట్ల టన్నుల సామర్థ్యం మాత్రమే దక్షిణ భారత్‌లో ఉంది. తమిళనాడులోని రెడ్డిపాళ్యం, ఆంధ్రప్రదేశ్‌లోని తాడిపత్రి వద్ద మినహా కంపెనీకి ఎక్కడా సమగ్ర సిమెంట్ ప్లాంట్లు లేవు. అక్కడ కూడా సున్నపురాయి కొరతతో ఉత్పత్తి సామర్థ్యాన్ని పెద్దగా విస్తరించలేకపోతోంది. ఇండియా సిమెంట్‌కు తెలుగు రాష్ట్రాల్లోని విష్ణుపురంతో పాటు తమిళనాడు, రాజస్థాన్, మహారాష్ట్రల్లో ఏటా 2.5 కోట్ల టన్నుల ఉత్పత్తి సామర్థ్యం ఉన్న సిమెంట్ ప్లాంట్లు ఉన్నాయి. ఈ కొనుగోలుతో ఈ ప్లాంట్లన్నీ అల్ట్రాటెక్ చేతికి వస్తాయి. దీంతో దక్షిణాది మార్కెట్లో అల్ట్రాటెక్, అదానీ సిమెంట్‌తోనే కాకుండా స్థానిక మార్కెట్‌పై మంచి పట్టున్న ప్రాంతీయ బ్రాండ్లతోనూ గట్టిగా పోటీపడగలుగుతుందని భావిస్తున్నారు.

మరిన్ని టేకోవర్లు : దక్షిణ భారత మార్కెట్లో అల్ట్రాటెక్ సిమెంట్‌కు ఇప్పటికే ప్రీమియం బ్రాండ్‌గా పేరుంది. ఇప్పుడు ఇందుకు ఇండియా సిమెంట్ కూడా తోడైంది. కేశోరామ్ సిమెంట్ కూడా త్వరలో అల్ట్రాటెక్ సిమెంట్‌లో విలీనం కానుంది. ఇక సీకే బిర్లా గ్రూప్‌నకు చెందిన ఓరియంట్ సిమెంట్‌పైనా అల్ట్రాటెక్ సిమెంట్ కన్నేసినట్టు తెలుస్తోంది. దీనికి సంబంధించి రెండు కంపెనీల మధ్య చర్చలు తుది దశకు చేరినట్టు సమాచారం. ఇదే నిజమైతే ఓరియంట్ సిమెంట్ కూడా కుమార మంగళం బిర్లా నాయకత్వంలోని ఆదిత్య బిర్లా గ్రూప్‌నకు చెందిన అల్ట్రాటెక్ గూటికి చేరినట్టే.

ఎందుకీ కొనుగోళ్లు ?

ఉత్తర భారత్‌తో పోలిస్తే దక్షిణ భారత్‌లో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, రియల్ ఎస్టేట్ రంగం మంచి ఊపు మీద ఉన్నాయి. అమరావతి, పోలవరంతో ఆంధ్రప్రదేశ్‌లో సిమెంట్‌కు మరింత గిరాకీ ఏర్పడింది. హైదరాబాద్ చుట్టూ ఏర్పాటు చేసే ప్రాంతీయ వలయ రహదారి (ఆర్ఆర్ఆర్)తో తెలంగాణలో రియల్ ఎస్టేట్ రంగం మరింత ఊపందుకోనుంది. వీటిని సొమ్ము చేసుకునేందుకు సిమెంట్ కంపెనీలు పోటీపడుతున్నాయి. అందులో భాగంగానే అదానీ, ఆదిత్య బిర్లా గ్రూప్‌లు టేకోవర్లతో సిమెంట్ రంగంలో తమ పట్టు పెంచుకుంటున్నాయని భావిస్తున్నారు.

ఎనర్జీ ఫోకస్డ్ ఫండ్స్‌తో మెరుగైన రిటర్నులు



ప్రభుత్వ ప్రోత్సాహంతో శరవేగంగా పారిశ్రామికీకరణ, అర్బనైజేషన్ జరుగుతోంది. ఇదే సమయంలో భారత ఎనర్జీ రంగంలోకి పెద్ద ఎత్తున పెట్టుబడులు తరలివస్తున్నాయి. ఈ విషయాలను దృష్టిలో పెట్టుకుని మ్యూచువల్ ఫండ్ సంస్థలు.. ఎనర్జీ ఫోకస్డ్ ఫండ్స్‌ను తీసుకు వస్తున్నాయి. ఇన్వెస్టర్లు దీర్ఘకాలంలో మంచి లాభాలు అందుకునే విధంగా వీటిని ఈ ఫండ్స్‌ను రూపొందిస్తున్నాయి. ఈ ఏడాది జూన్ ముగిసే నాటికి ఎనర్జీ థీమ్‌తో వచ్చిన ఫండ్స్ కేటాయింపులు రూ.4.07 లక్షల కోట్లకు చేరటమే ఇందుకు నిదర్శనం. రానున్న రోజుల్లో ఎనర్జీ షేర్లలో పెట్టుబడులకు మంచి అవకాశాలుండటంతో.. ఈ విభాగంలో మరింత పట్టును చేజిక్కించుకునే ఉద్దేశంతో ఐసీఐసీఐ ప్రుడెన్షియల్.. ఈ మధ్యనే ఎనర్జీ థీమ్‌తో ఎనర్జీ ఆపర్చునిటీస్ ఫండ్‌ను తీసుకువచ్చింది. ప్రస్తుతం ఇంధన రంగంలో ప్రస్తుత వాల్యుయేషన్స్ రీజనబుల్‌గా ఉన్నాయని, నిఫ్టీ 50 ఇండెక్స్‌తో పోలిస్తే నిఫ్టీ ఎనర్జీ ఇండెక్స్. పీఈ (ప్రైస్ టు ఎర్నింగ్) 38 శాతం డిస్కౌంట్‌తో ట్రేడవుతోందని ఐసీఐసీఐ ప్రు ఏఎంసీ ఫండ్ మేనేజర్ నిత్యా మిశ్రా అంటున్నారు. దీర్ఘకాలిక దృక్పథంతో చూస్తే ఈ రంగంలోని కంపెనీల్లో పెట్టుబడులు పెట్టడం ద్వారా ఇన్వెస్టర్లు మంచి రిటర్నులు అందుకోవచ్చన్నారు.

టెక్ వ్యూ

కీలక స్థాయి 25,000 చేరువలో...



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం 24,500 వద్ద బలమైన కరెక్షన్ సాధించి 24,000 వరకు దిగజారింది. కనిష్ఠ స్థాయిల నుంచి బలమైన రికవరీ సాధించి, గురువారంనాడు బలంగా ముగిసింది. ఇది ట్రెండ్‌లో సానుకూలత సంకేతం. గత నాలుగు ట్రేడింగ్ రోజుల్లో ఎన్నో బలమైన కరెక్షన్లు ఎదుర్కొన్నప్పటికీ కీలకస్థాయి 24,400 కన్నా పైన బలంగా ముగియడం మార్కెట్లో బలాన్ని సూచిస్తోంది. చివరికి శుక్రవారం అంతకు ముందు వారం ముగింపుతో పోల్చితే 300 పాయింట్ల లాభంతో 24,830 వద్ద ముగిసింది. మిడ్‌క్యాప్ సూచీ కూడా వారంలో 1,400 పాయింట్ల మేరకు బలమైన కరెక్షన్ సాధించినా చివరికి 1,850 పాయింట్ల లాభంతో ముగిసింది. స్మాల్‌క్యాప్ సూచీ 800 పాయింట్ల మేరకు కరెక్షన్ సాధించి చివరికి 450 పాయింట్ల లాభంతో క్లోజైంది. నిఫ్టీ గత 12 వారాలుగా నిరంతర ర్యాలీలో ఉంది. టెక్నికల్‌గా మార్కెట్ అప్‌ట్రెండ్‌లోనే ఉన్నప్పటికీ మానసిక అవధి 25,000కి చేరువ అవుతున్నందు వల్ల కన్సాలిడేషన్ లేదా కరెక్షన్ రావచ్చు. స్వల్పకాలిక ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలి.

బుల్లిష్ స్థాయిలు: మరింత అప్‌ట్రెండ్ కోసం నిఫ్టీ మైనర్ నిరోధం 24,920 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం, మానసిక అవధి 25,000. ఇక్కడ కన్సాలిడేషన్ లేదా కరెక్షన్ ఉండవచ్చు.

బేరిష్ స్థాయిలు: మైనర్ మద్దతు స్థాయి 24,700 వద్ద విఫలమైతే బలహీనతను సూచిస్తుంది. ప్రధాన మద్దతు స్థాయి 24,500. మార్కెట్ ఇక్కడ నిలదొక్కుకోవాలి. విఫలమైతే అప్రమత్త సంకేతం ఇస్తుంది.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత వారం 50,400 పాయింట్ల వరకు దిగజారినా మైనర్ రికవరీ సాధించింది. అయినా ముందు వారంతో పోల్చితే 970 పాయింట్ల నష్టంతో 51,300 వద్ద ముగిసింది. ఇతర ప్రధాన సూచీలతో పోల్చితే ఈ సూచీ పనితీరు సంతృప్తికరంగా లేదు. రికవరీ బాట పట్టినట్టయితే మరింత అప్‌ట్రెండ్ కోసం 51,800 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 52,300. మద్దతు స్థాయి 52,000. ఇక్కడ నిలదొక్కుకోవడంలో విఫలమైతే మరింత బలహీనపడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 51,400.

పాటర్న్: గత వారం ఈ సూచీ 25 డిఎంఏ వద్ద రికవరీ సాధించింది. మార్కెట్ ప్రస్తుతం 25,000 సమీపంలో "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" వద్ద నిరోధం ఎదుర్కొంటోంది. మరింత పురోగమించాలంటే ఈ నిరోధాన్ని బ్రేక్ చేయాలి.

టైమ్ : ఈ సూచీ ప్రకారం బుధవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	24,920, 25,000
మద్దతు	24,760, 24,700

ఫార్మా, హెల్త్‌కేర్ షేర్లపై కన్నేయండి!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మెరుగ్గా కదలాడే అవకాశాలున్నాయి. అంతర్జాతీయంగా సానుకూల సంకేతాలతో పాటు అమెరికా ఆర్థిక వ్యవస్థ కోలుకుందన్న వార్తలు పాజిటివ్ సెంటిమెంట్‌ను నింపుతున్నాయి. మరో వైపు దేశీయ సూచీలు బడ్జెట్ నష్టాల నుంచి కోలుకున్నాయి. మార్కెట్లలో ఊగిసలాటకు ఆస్కారం లేకున్నా మదుపరులు అప్రమత్తంగా ఉండటం మంచిది. శుక్రవారం నాటి జోరును కొనసాగిస్తే సూచీలు సరికొత్త జీవితకాల గరిష్ఠాలకు చేరొచ్చు. ఈ వారం ఫార్మా, హెల్త్‌కేర్ రంగాలు బుల్లిష్‌గా ఉండే అవకాశం ఉంది. ఐటీ, ఎఫ్ఎంసీజీ షేర్లు కూడా జోరును ప్రదర్శించే వీలుంది.

స్టాక్ రికమండేషన్స్

దివీస్ లేబొరేటరీస్: సుదీర్ఘకాలం పాటు డౌన్‌ట్రెండ్‌లో పయనించిన ఈ కౌంటర్‌లో ప్రస్తుతం అక్యుములేషన్ జరుగుతోంది. గత శుక్రవారం ఈ షేరు రూ.4,750 వద్ద కీలక రెసిస్టెన్స్‌ను బ్రేక్ చేసి చివరకు 6.02 శాతం లాభంతో రూ.4,792 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.4,700/4,750 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.4,950/5,050 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే 4,660 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

సిప్లా: అప్‌ట్రెండ్‌లో చక్కని కన్సాలిడేషన్ తర్వాత ఈ కౌంటర్ జీవితకాల గరిష్ఠాన్ని బ్రేక్ చేసింది. టెక్నికల్‌గా, ఫండమెంటల్‌గా చాలా బలంగా ఉంది. పదేళ్లలోనే అత్యధిక త్రైమాసిక నికర లాభాన్ని నమోదు చేసింది. డెలివరీ, ట్రేడింగ్ వాల్యూమ్ భారీగా పెరుగుతోంది. గత శుక్రవారం 5 శాతం లాభంతో రూ.1,575 వద్ద ముగిసింది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.1,550 శ్రేణిలో ఎంటరై రూ.1,770 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,515 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

భారతి ఎయిర్‌టెల్: ఈ టెలికాం కంపెనీ షేరు నిఫ్టీతో పోలిస్తే బలం ప్రదర్శిస్తున్నాయి. ప్రైస్ యాక్షన్ చాలా బాగుంది. తొలిసారి ఈ షేరు రూ.1,500 పై స్థాయిలో క్లోజైంది. క్రితంసారి ఆల్‌టైమ్ గరిష్ఠాన్ని చేరగానే షేరు పడిపోయింది. ఈసారి అలా జరగలేదు. డెలివరీ, ట్రేడింగ్ వాల్యూమ్ పెరగటమే ఇందుకు కారణం. గత శుక్రవారం 4.5 శాతం లాభంతో రూ.1,514 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.1,500 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.1,590/1,640 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,475 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

అదానీ పోర్ట్: ఈ షేరు మంచి మూమెంటమ్‌ను కనబరుస్తోంది. ప్రైస్ యాక్షన్ నిలకడగా ఉంది. ఒడుదొడుకులు తక్కువగా ఉన్నాయి. గత శుక్రవారం 3.75 శాతం లాభంతో రూ.1,542 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లోకి ఇన్వెస్టర్లు రూ.1,520 శ్రేణిలో ప్రవేశించి రూ.1,755 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,475 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

మహానగర్ గ్యాస్: మార్కెట్ అంచనాలను మించి ఆర్థిక ఫలితాలు ప్రకటించటంతో ఈ షేరు పుంజుకుంది. వాల్యూమ్ క్రమంగా పెరుగుతోంది. గత శుక్రవారం 5.3 శాతం లాభంతో రూ.1,846 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లోకి మదుపరులు రూ.1,800 వద్ద పొజిషన్ తీసుకుని రూ.1,990/2,040 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,760 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
niftymasterlive@gmail.com +91 98855 59709

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ 1872 స్థానంలో భారతీయ సాక్ష్య అధినియమ్‌ను ప్రవేశపెట్టారు. గతంలో ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్‌లో 167 సెక్షన్లు ఉండగా, ప్రస్తుతం బీఎస్‌ఏలో 170 సెక్షన్లు ఉన్నాయి. గత చట్టంలోని 23 సెక్షన్లలో మార్పులు చేశారు.

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

కొత్త క్రిమినల్ చట్టాలు- పార్ట్ 3

భారతీయ సాక్ష్య అధినియమ్



కీలకాంశాలు

● ఈ చట్టం 'డాక్యుమెంట్' నిర్వచనాన్ని విస్తరించింది. ఎలక్ట్రానిక్స్/ డిజిటల్ రికార్డులను కూడా ఈ చట్టం పేపర్ డాక్యుమెంట్స్‌తో సరిసమాన సాక్ష్యాలుగా పరిగణిస్తోంది. ఈ-మెయిల్స్, సర్వర్ లాగ్స్ కంప్యూటర్స్, స్మార్ట్‌ఫోన్స్, ల్యాప్‌టాప్స్ ఎస్సెమ్మెస్‌లు, వెబ్‌సైట్‌లు, లోకేషనల్ ఎవిడెన్స్ వంటి డిజిటల్/ ఎలక్ట్రానిక్స్ సాక్ష్యాలను దీనికి ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

● అంతేకాక ఎలక్ట్రానిక్ మాధ్యమాల ద్వారా సాక్ష్యులు, బాధితులు, ముద్దాయిలు తమ వాంగ్మూలం ఇవ్వడానికి ఈ కొత్త చట్టం అనుమతిస్తూ, దానికి వ్యక్తిగత ప్రత్యక్ష వాంగ్మూలంతో సరిసమాన స్థాయి కల్పించింది.

● ముద్దాయి నేరం అంగీకారాన్ని, ఇకపై క్రిమినల్ కేసుల్లో తప్పనిసరిగా పరిగణించక్కర్లేదు. బెదిరింపులు, ప్రలోభాలు తదితరాల కారణంగా నేరాంగీకారం జరిగినట్లు న్యాయమూర్తి భావిస్తే దానిని పరిగణనలోకి తీసుకోనవసరం లేదు.

● సోదాలు, నేర సంఘటన స్థల పరిశీలన సమయంలో తప్పనిసరిగా సంబంధిత అధికారి ఫోన్ ద్వారా చిత్రీకరణ జరపాల్సి ఉంటుంది. అలాంటి దృశ్య, శ్రవణ చిత్రీకరణలు జతచేయని చార్జిషీట్లు చెల్లవు. ఈవిధంగా చిత్రీకరించిన దృశ్య శ్రవణ చిత్రీకరణలు నేరుగా క్లౌడ్ బేస్డ్ ప్లాట్‌ఫాంలోకి అప్‌లోడ్ చేయవచ్చు. టాంపరింగ్, అవకతవకలు నివారించడానికి ఎటువంటి జాప్యం లేకుండా వీటిని కోర్టుకు సమర్పించాల్సి ఉంది.

● కోర్టుల్లో పరీక్షించలేని భారీ పరిణామం గల డాక్యుమెంట్స్ లేదా సాంకేతికపరమైన డాక్యుమెంట్ల పరిశీలనలో నిష్ణాతులైన వారు ఇచ్చే వాంగ్మూలాన్ని సెకండరీ ఎవిడెన్స్(ద్వితీయస్థాయి సాక్ష్యం)గా పరిగణిస్తారు.

● ఒక నేరంలో భాగమైన వ్యక్తులను సామూహికంగా విచారిస్తున్నప్పుడు (జాయింట్ ట్రయిల్) వారిలో ఎవరైనా అరెస్ట్ వారెంట్ అందుకోకపోయినా, పరారీలో ఉన్నా సరే వారిని కూడా కలిపే న్యాయవిచారణ చేస్తారు.

విమర్శలు

● సాక్ష్యాధారాలు చిత్రీకరించే సమయంలో, తదుపరి కూడా నేటి ఆధునిక సాంకేతికతల సహాయంతో, సాంకేతికపరమైన లోపాల సహకారంతో ఏమార్చే అవకాశం ఉంది.

● ఎలక్ట్రానిక్ రికార్డులు ధృవీకరణ పొంది ధృవపత్రాలను కలిగి ఉన్నప్పుడే వాటిని డాక్యుమెంట్స్‌గా పరిగణిస్తారు. కానీ బీఎస్‌ఏలో సాధారణ డిజిటల్, ఎలక్ట్రానిక్ సమాచారాన్ని కూడా సాక్ష్యంగా డాక్యుమెంట్ల స్థాయి కల్పించి పరిగణించడం వైరుధ్యాలకు కారణం అవవచ్చు.

● పోలీసు కస్టడీలోని వ్యక్తి శరీరంపై ఉన్న గాయాలకు పోలీసులు బాధ్యత వహించాలి అనే అత్యున్నత న్యాయస్థానం, లా కమిషన్ సిఫార్సులకు మన్నన దక్కలేదు. అట్టి కట్టుబాటు పోలీసులపై ఏర్పడలేదు.

● కేవలం ఏవో కొన్ని అంశాలు మినహా పాత చట్టమే కొత్తరూపుతో కొనసాగింపునకు వచ్చింది. సాంకేతిక అంశాల జోడింపు తప్ప ఇతరత్రా పెద్దగా విప్లవాత్మక మార్పులు ఏమీ లేవు.

● కొన్ని క్రిమినల్ కేసుల్లో ఫోరెన్సిక్ దర్యాప్తు తప్పనిసరి చేశారు. కానీ నేర స్థలానికి మొదట వెళ్లేది పోలీసులు. వారి సోదాలు, పరిశీలనల చిత్రీకరణల వల్ల ఫోరెన్సిక్ ఆధారాలు భంగపడవచ్చు.

అయితే సాంకేతిక అంశాల జోడింపుతో ఈ కొత్తచట్టం విచారణలో వేగాన్ని తీసుకురావడానికి తోడ్పడటంతోపాటు మారుతున్న నేరాల సరళి నేపథ్యంలో సాక్ష్యాల పరిధిని విస్తరించిందనడం అతిశయోక్తి కాదు. అదేవిధంగా నేరవిచారణలో, దర్యాప్తులో అక్రమాలను నిరోధించేందుకు సాంకేతికపరంగా చేసిన మార్పులు పారదర్శకతను పెంపొందించగలవు. అయితే గత చట్టంలోని అన్ని అంశాలను పూర్తిగా సంస్కరించలేదు. కేవలం కొద్దిపాటి అంశాల్లోనే మార్పులు చేసి కొత్త చట్టాన్ని రూపొందించారు. అయినప్పటికీ దశాబ్దాల తరబడి క్రిమినల్ చట్టాల్లో సంస్కరణలకు నోచుకోని పరిస్థితుల్లో దీనిని ఒక ముందడుగు గానే పరిగణించాలి.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

టీజీపీఎస్సీ/ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

ఘనము

రీజనింగ్

I) 8 సెం॥ మీ॥ల కొలత ఉన్న చతురస్రాకార చెక్క ఘనానికి అన్ని వైపుల ఎరుపు రంగును వేశారు. ఇప్పుడు ఈ ఘనాన్ని ప్రతి అంచు 2 సెం॥ మీ॥ల కొలత ఉండే చిన్న చిన్న ఘనాలుగా విభజించారు. ఈ సమాచారం ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు తెలపండి.

1. ఆ విభజన వల్ల మొత్తం ఎన్ని ఘనాలు ఏర్పడతాయి?
ఎ) 20 బి) 40 సి) 56 డి) 64
2. మూడు ముఖాలకు రంగును కలిగి ఉన్న ఘనాలు ఎన్ని?
ఎ) 8 బి) 6 సి) 12 డి) 16
3. రెండు ముఖాలకు మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు ఎన్ని?
ఎ) 16 బి) 24 సి) 32 డి) 48
4. ఒక ముఖానికి మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు ఎన్ని?
ఎ) 12 బి) 18 సి) 10 డి) 24
5. ఏ ముఖం ఏ రంగు లేకుండా ఎన్ని ఘనాలు ఏర్పడతాయి?
ఎ) 18 బి) 12 సి) 8 డి) 6

సమాధానాలు:
1. (డి) 2. (ఎ) 3. (బి) 4. (డి) 5. (సి)

వివరణ:

1. $n = \frac{\text{పెద్ద ఘనము యొక్క అంచు పొడవు}}{\text{చిన్న ఘనము యొక్క అంచు పొడవు}} = \frac{8}{2} = 4$

మొత్తం ఘనాలు $= (n^3) = 4^3 = 64$.

2. మూడు ముఖాలకు రంగును కలిగి ఉన్న ఘనాలు అంటే 8 (ఫిక్స్ ఎప్పటికి మారదు).
3. రెండు ముఖాలకు మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు
$(n-2) \times 12 = (4-2) \times 12 = 2 \times 12 = 24$
4. ఒక ముఖానికి మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు
$(n-2)^2 \times 6 = (4-2)^2 \times 6$
$= (2)^2 \times 6 = 4 \times 6 = 24$
5. ఏ ముఖం ఏ రంగు లేకుండా ఉండే ఘనాలు
$(n-2)^3 = (4-2)^3 = 2^3 = 8$

సులభపద్ధతి: 8 సెం.మీ. కొలత ఉన్న ఘనం 2 సెం॥ మీ॥ కొలతతో విభజిస్తే అంటే నాలుగు నాలుగుగా ఏర్పడుతుంది. ఇప్పుడు నాలుగు నాలుగుగా ఉండే రేఖాచిత్రం ఔట్‌సైడ్ మాత్రమే వేసుకోవాలి.

3	2	2	3
2	1	1	2
2	1	1	2
3	2	2	3

1. మొత్తం ఘనాలు అంటే $4^3 = 64$
2. మూడు ముఖాలకు మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు అంటే కార్నర్ 4ని 2తో గుణించాలి. (2 అంటే పై వైపు 4 కార్నర్స్ కింది వైపు 4 కార్నర్స్ అని అర్థం) $4 \times 2 = 8$
3. రెండు ముఖాలకు మాత్రమే రంగును కలిగి ఉన్న, ఘనాలు అంటే కార్నర్స్ కాకుండా చుట్టూ ఉన్న వాటిని లెక్కించి 3తో గుణించాలి. (3 అంటే పై వైపు, కింద వైపు, మధ్య వైపు) పై రేఖాచిత్రం గమనించిన కార్నర్స్‌ని తీసివేయగా చుట్టూ భాగంలో మిగిలినవి 8. దీనిని 3తో గుణించగా $8 \times 3 = 24$.
4. ఒక ముఖానికి మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు అంటే చుట్టూ భాగాన్ని తొలగించి మధ్యలోని భాగంలో గల వాటిని లెక్కించి 6తో గుణించాలి. (6 అంటే ఆరు ముఖాలు అని అర్థం) పై రేఖాచిత్రం గమనించిన చుట్టూ భాగాన్ని తీసివేయగా మధ్యలో 4 ఉన్నాయి. కావున $4 \times 6 = 24$.
5. ఏ ముఖం ఏ రంగు లేకుండా ఉండే ఘనాలు అంటే మొత్తం - (ఒక ముఖానికి, రెండు ముఖాలకు, మూడు ముఖాలకు రంగును కలిగి ఉండే ఘనాలు)
$64-(24+24+8) = 64 - 56 = 8$ సమాధానం అవుతుంది.

II) 15 సెం॥ మీ॥ల కొలత ఉన్న చతురస్రాకార చెక్క ఘనానికి అన్ని వైపుల పసుపు రంగును వేశారు. ఇప్పుడు ఈ ఘనాన్ని ప్రతి అంచు 3 సెం.మీ.ల కొలత ఉండే చిన్న చిన్న ఘనాలుగా విభజించారు. ఈ సమాచారం ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు తెలపండి.

1. ఆ విభజన వలన మొత్తం ఎన్ని ఘనాలు ఏర్పడతాయి?
ఎ) 100 బి) 150 సి) 125 డి) 175
2. మూడు ముఖాలకు రంగును కలిగి ఉన్న ఘనాలు ఎన్ని?
ఎ) 16 బి) 8 సి) 24 డి) 12
3. రెండు ముఖాలకు మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు ఎన్ని?
ఎ) 36 బి) 12 సి) 48 డి) 24
4. ఒక ముఖానికి మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు ఎన్ని?
ఎ) 48 బి) 54 సి) 63 డి) 52
5. ఏ ముఖం ఏ రంగు లేకుండా ఎన్ని ఘనాలు ఏర్పడతాయి?
ఎ) 12 బి) 18 సి) 27 డి) 36

సమాధానాలు: 1. (సి) 2. (బి) 3. (ఎ) 4. (బి) 5. (సి)

వివరణ:

1. $n = \frac{\text{పెద్ద ఘనము యొక్క అంచు పొడవు}}{\text{చిన్న ఘనము యొక్క అంచు పొడవు}} = \frac{15}{3} = 5.$

మొత్తం ఘనాలు $n^3 = 5^3 = 125$

2. మూడు ముఖాలకు రంగును కలిగి ఉన్న ఘనాలు అంటే 8 (ఫిక్స్ ఎప్పటికి మారదు)
3. రెండు ముఖాలకు మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు
$(n-2) \times 12 = (5-2) \times 12 = 3 \times 12 = 36$
4. ఒక ముఖానికి మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు
$(n-2)^2 \times 6 = (5-2)^2 \times 6$
$= 3^2 \times 6 = 9 \times 6 = 54$
5. ఏ ముఖం ఏ రంగు లేకుండా ఉండే ఘనాలు $= (n-2)^3$
$= (5-2)^3$
$= 3^3 = 27.$

సులభ పద్ధతి: 15 సెం.మీ. కొలత ఉన్న ఘనం 3 సెం.మీ.ల కొలతతో విభజించడం అంటే 15÷3=5 అయిదు అయిదుగా ఏర్పడుతుంది. ఇప్పుడు అయిదు అయిదుగా ఉండే రేఖాచిత్రం వన్ సైడ్ మాత్రమే వేసుకోవాలి.

3	2	2	2	3
2	1	1	1	2
2	1	1	1	2
2	1	1	1	2
3	2	2	2	3

1. మొత్తం ఘనాలు అంటే $5^3 = 125$.
2. మూడు ముఖాలకు రంగును కలిగి ఉన్న ఘనాలు అనగా కార్నర్స్ 4ని 2తో గుణించాలి. (2 అనగా పై వైపు 4 కార్నర్స్, కింది వైపు 4 కార్నర్స్ అని అర్థం) $4 \times 2 = 8$.
3. రెండు ముఖాలకు మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు అనగా కార్నర్స్ కాకుండా చుట్టూ ఉన్న వాటిని లెక్కించి 3తో గుణించాలి. (3 అనగా పై వైపు, కింది వైపు, మధ్యవైపు) పై రేఖాచిత్రం గమనిస్తే కార్నర్స్‌ని తీసివేయగా చుట్టూ భాగంలో మిగిలింది 12. దీనిని 3తో గుణిస్తే $12 \times 3 = 36$.
4. ఒక ముఖానికి మాత్రమే రంగును ఉన్న ఘనాలు అనగా చుట్టూ భాగాన్ని తొలగించి మధ్యలో ఉండే వాటిని లెక్కించి 6తో గుణించాలి. (6 అనగా ఆరు ముఖాలు అని అర్థం)పై రేఖాచిత్రం గమనిస్తే చుట్టూ భాగాన్ని తీసివేయగా మధ్యలో 9 ఉన్నాయి. కాబట్టి $9 \times 6 = 54$.
5. ఏ ముఖం ఏ రంగు లేకుండా ఉండే ఘనాలు అంటే మొత్తం - (ఒక ముఖానికి, రెండు ముఖాలకు, మూడు ముఖాలకు రంగును కలిగి ఉండే ఘనాలు)
$125 - (54+36+8)$
$125 - 98 = 27$ సమాధానం అవుతుంది.




డాక్టర్ పండిటి మీనాక్షి పవన్,
సీనియర్ ఫ్యాకల్టీ

నవ్య | చిత్రజ్యోతి



పారిస్ వీధుల్లో పలకరింపు

ప్రస్తుతం మెగా ఫ్యామిలీతో కలసి రామ్‌చరణ్ పారిస్‌లో ఒలింపిక్స్ క్రీడా సంబరాలను ఆస్వాదిసున్నారు. భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు మహిళల సింగిల్స్‌లో తొలి విజయాన్ని నమోదు చేశారు. వీరిద్దరూ పారిస్ వీధుల్లో అనుకోకుండా ఒకరికొకరు ఎదురు పడ్డారు. చిరునవ్వుతో ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. రామ్‌చరణ్ పెంపుడు కుక్క పిల్ల 'రైమ్' తలనిమిరారు సింధు. వారిద్దరూ సరదాగా మాట్లాడుకుంటున్న వీడియో ఆదివారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఇద్దరూ గేమ్ ఛేంజర్‌లే మీ కలయిక అద్భుతం అంటూ అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ 'గేమ్ ఛేంజర్' చిత్రంలో నటిస్తున్నారు.



కొత్త తరహా పాత్ర

తమిళ హీరో ధనుష్, నాగార్జున కాంబినేషన్‌లో దర్శకుడు శేఖర్ కమ్ముల దర్శకత్వంలో రూపొందుతున్న 'కుబేర' చిత్రం షూటింగ్ శరవేగంతో జరుగుతోంది. ధనుష్ పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం స్పెషల్ పోస్టర్ విడుదల చేశారు. ఇదివరకు ఎన్నడూ చేయని పాత్రను ధనుష్ ఇందులో పోషిస్తున్నారు. ఆయన పెర్ఫార్మెన్స్ నెక్ట్స్ లెవల్‌లో ఉంటుందని మేకర్స్ చెప్పారు. హై బడ్జెట్‌తో రూపుదిద్దుకుంటున్న ఈ సోషల్ డ్రామాలో రష్మిక కథానాయిక. సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్‌మోహనరావు తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

ఫిల్మ్ ఛాంబర్ కొత్త అధ్యక్షుడిగా భరత్ భూషణ్



తెలుగు చలనచిత్ర వాణిజ్యమండలి ప్రస్తుత అధ్యక్షుడు దిల్ రాజు పదవీకాలం ముగియడంతో ఆదివారం ఎన్నికలు జరిపి నూతన అధ్యక్షుడిని ఎన్నుకున్నారు.. ఈసారి డిస్ట్రిబ్యూటర్ సెక్టార్ నుంచి పి.భరత్ భూషణ్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షుడిగా కె.అశోక్‌కుమార్ గెలిచారు. ఈ సందర్భంగా నిర్మాత సి.కల్యాణ్ మీడియాతో మాట్లాడుతూ 'పరిశ్రమలో చాలా సమస్యలు ఉన్నాయి. అందరం కలసి మంచి నిర్ణయాలతో ముందుకు వెళతాం. ఈ రోజు గెలిచిన అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు మాటకు కట్టుబడి ఉండే వ్యక్తులు. గెలిచిన వారికి సభ్యులందరి మద్దతు ఉంటుంది' అన్నారు. ప్రసన్నకుమార్ మాట్లాడుతూ 'ఛాంబర్ అంతా ఒక కుటుంబం. పరిశ్రమలోని సమస్యలను ఎలా ఎదుర్కోవాలో అందరం కలసి చర్చిస్తాం. భారతదేశంలోని అన్ని పరిశ్రమలను ఒక తాటి మీదకు తీసుకు వచ్చి ముందుకు వెళతాం' అన్నారు. తన విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ భరత్ భూషణ్ కృతజ్ఞతలు తెలిపారు.



సరికొత్త కాన్సెప్ట్‌తో...

వైవిధ్యమైన చిత్రాలతో దూసుకుపోతున్న కథానాయకుడు అల్లరి నరేశ్. ఆయన హీరోగా 'ఫ్యామిలీ డ్రామా' ఫేమ్ మెహర్ తేజ్ ఓ నూతన చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. రుహాని శర్మ హీరోయిన్. సూర్య దేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. శనివారం ఈ సినిమాను ఆరంభించారు. సరికొత్త కాన్సెప్ట్‌తో తెరకెక్కుతోన్న ఈ చిత్రం ప్రేక్షకులకు మంచి అనుభూతిని అందిస్తుందని మేకర్స్ తెలిపారు. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్‌ను మొదలుపెట్టనున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: రామకృష్ణ అర్రం, కెమెరా: జిజు సన్నీ, సంగీతం: జిబ్రాన్.


'మిరపకాయ్' కంటే మెరుగ్గా



రవితేజ హీరోగా హరీశ్ శంకర్ దర్శకత్వంలో తయారవుతున్న 'మిస్టర్ బచ్చన్' రిలీజ్ డేట్ దగ్గర పడుతుండడంతో నిర్మాతలు ప్రమోషన్స్‌లో దూకుడు పెంచారు. ఇందులో భాగంగా ఆదివారం టీజర్ విడుదల చేశారు. పీరియాడికల్ బ్యాక్‌డ్రాప్‌లో తెర కెక్కిన ఈ చిత్రంలో ఓ పవర్‌ఫుల్ వ్యక్తిపై రైడ్ చేసే ఇన్‌కమ్ టాక్స్ అధికారిగా రవితేజ నటిస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. జగపతిబాబు కీలక పాత్ర పోషించారు. ఈ నేపథ్యంలో మీడియాతో హరీశ్ శంకర్ మాట్లాడుతూ '1980-90ల మధ్య జరిగే కథ ఇది. ల్యాండ్ ఫోన్లు, క్యాసెట్ రికార్డింగ్ సెంటర్లు, చేతక్ స్కూటర్లు, కుమార్ షాను పాటలు.. ఇవన్నీ 'మిస్టర్ బచ్చన్' ఫస్ట్ హాఫ్‌లో నోస్టాలజిక్ మూమెంట్స్‌గా ఉంటాయి. అలాగే అమితాబ్ గారిని బేస్ చేసుకుని కొన్ని ఐటమ్స్ ఉంటాయి. నా కెరీర్‌లో చాలా ఫాస్ట్‌గా.. కేవలం 78 రోజుల్లో ఈ సినిమా తీశానంటే కారణం నిర్మాత విశ్వప్రసాద్‌గారు. ఇంతకుముందు మా కాంబినేషన్‌లో వచ్చిన 'మిరపకాయ్' కంటే మెరుగ్గా ఈ సినిమా ఉంటుంది' అన్నారు. 'ఆగస్టు 15న సినిమాను విడుదల చేస్తున్నాం' అని విశ్వప్రసాద్ తెలిపారు.



సుకుమార్ సతీమణి సమర్పణలో..



రావు రమేశ్ హీరోగా నటించిన 'మారుతీ నగర్ సుబ్రహ్మణ్యం' ఈ చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధమైంది. దర్శకుడు సుకుమార్ సతీమణి తబిత సమర్పణలో వస్తున్న తొలి చిత్రం ఇది కావడం విశేషం. కంటెంట్ నచ్చడంతో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ సంస్థ ఆగస్టు 23న విడుదల చేస్తోంది. ఈ సినిమా ట్రైలర్‌ను హీరో రామ్‌చరణ్ ఆదివారం విడుదల చేశారు. 'మారుతీనగర్ సుబ్రహ్మణ్యం' చిత్రంలో ఎటకారం ఎక్కువున్న సుబ్రహ్మణ్యం భార్యగా ఇంద్రజ, అత్తగారిగా అన్నపూర్ణమ్మ నటించారు. 'మా నాన్న అల్లు అరవింద్' అంటూ గొప్పలు చెప్పి ఓ డబ్బున్న అమ్మాయిని ప్రేమలో పడేసే సుబ్రహ్మణ్యం కొడుకుగా అంకిత్ కొయ్య, అతని సరసన రమ్య పసుపులేటి నటించారు. లక్ష్మణ్ కార్య దర్శకత్వంలో బుజ్జి రాయుడు పెంట్యాల, మోహన్ కార్య నిర్మించారు.



ఆ లోటును భర్తీ చేసేలా...

'నువ్వేకావాలి', 'మన్మథుడు', 'మల్లీశ్వరి' వంటి చిత్రాలతో పాపులర్ దర్శకుడిగా మారారు కె. విజయ్‌భాస్కర్. ఆయన స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఉషా పరిణయం'. 'లవ్ ఈజ్ బ్యూటిఫుల్' అనేది ఉప శీర్షిక. ఈ లవ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్‌లో శ్రీకమల్, తాన్వీ ఆకాంక్ష, సూర్య ప్రధాన తారాగణంగా నటించారు. ఆగస్టు 2న ఈ చిత్రం విడుదలవుతోన్న సందర్భంగా కె. విజయ్‌భాస్కర్ మీడియాతో ముచ్చటించారు. 'ఈ సినిమా ప్రేమకు సరికొత్త నిర్వచనం ఇస్తుంది. ఈ మధ్య కాలంలో ప్రేమ కథలు చాలా తక్కువగా వస్తున్నాయి. ఇది ఆ లోటును భర్తీ చేస్తుంది. ఇంటిల్లిపాదీ చూడదగిన చిత్రమిది. ఉషా అనే అమ్మాయి పెళ్లి చుట్టూ సినిమా కథాంశం సాగుతుంది. మా అబ్బాయి కమల్ కోసం ప్రత్యేకంగా కథ రాసుకుని ఈ సినిమా చేయట్లేదు. ఈ కథకు తను యాప్ట్ కాబట్టే కమల్‌ను హీరోగా ఎంచుకున్నాను. కమల్, కథానాయిక తాన్వీ నటన చాలా సహజంగా.. అందరినీ ఆకట్టుకునేలా ఉంటుంది. ఈ సినిమాకు సంగీతం ప్రధానాకర్షణ. ఆర్.ఆర్.ధ్రువన్ అద్భుతమైన పాటలు అందించారు. సినిమా యూత్‌తో పాటు ఫ్యామిలీని కూడా ఆకట్టుకుంటుంది" అని చెప్పారు.

కాలరెత్తి తిరగరా...



దుల్కర్ సల్మాన్ కథానాయకుడిగా వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'లక్కీ భాస్కర్'. మీనాక్షి చౌదరి కథానాయిక. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మిస్తున్నారు. సెప్టెంబర్ 7న విడుదలవుతోంది. ఆదివారం దుల్కర్ సల్మాన్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా చిత్రబృందం 'లక్కీ భాస్కర్' టైటిల్ ట్రాక్‌ను విడుదల చేసింది. 'శభాష్ సోదరా...కాలరెత్తి తిరగరా...కరెన్సీ దేవి నిను వరించెరా' అంటూ సాగే ఈ గీతానికి రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించారు. జీవీ ప్రకాశ్ కుమార్ స్వరాలందించారు.

ఆకాశంలో ఒక తార

పవన్ సాదినేని దర్శకత్వంలో దుల్కర్ కథానాయకుడిగా నటించబోయే కొత్త చిత్రంపై అధికారిక ప్రకటన వచ్చింది. ఈ సినిమాకు 'ఆకాశంలో ఒక తార' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. గీతా ఆర్ట్స్, స్వప్న సినిమా, లైట్ బాక్స్ మీడియా సమర్పణలో సందీప్ గుణ్ణం, రమ్య గుణ్ణం ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్‌లుక్ పోస్టర్‌లో రైతు లుక్‌లో దుల్కర్ కనిపించారు. త్వరలో రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభించనున్నట్లు మేకర్స్ తెలిపారు.



పారిస్ ఒలింపిక్స్

(జూలై 26 - ఆగస్టు 11)



మను చరిత్ర

10మీ. ఎయిర్ పిస్టల్‌లో మూడో స్థానం

షూటర్ మను భాకర్‌కు కాంస్యం



మను భాకర్ సాధించింది. పుష్కర కాలం ఎదురుచూపులకు తెర దించుతూ షూటింగ్‌లో దేశానికి ఓ పతకం అందించింది. పోగొట్టుకున్న చోటే వెతుక్కోవాలన్నట్టుగా, మూడేళ్ల క్రితం టోక్యో గేమ్స్‌లో ఎదురైన ఓటమికి పారిస్‌లో బదులు తీర్చుకుంది. కుంగుబాటును అధిగమిస్తూ.. లక్ష్యాన్ని గుర్తు చేసుకుంటూ.. అంతులేని ఆత్మవిశ్వాసంతో.. ఫైనల్స్‌కు చేరిన ఈ 22 ఏళ్ల యువ షూటర్ ఈసారి అంచనాలను వమ్ము చేయలేదు. గురి తప్పని తూటాలతో ఇప్పుడు ఒలింపిక్ కాంస్య పతకాన్ని సగర్వంగా అందుకుంది. అంతేనా.. ఈ ఫీట్ సాధించిన తొలి భారత మహిళా షూటర్‌గానూ చరిత్ర సృష్టించింది.

ఒలింపిక్స్‌లో మన పతక షూటర్లు

రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్	డబుల్ ట్రాప్	రజతం	2004 ఏథెన్స్
అభినవ్ బింద్రా	10మీ. ఎయిర్ రైఫిల్	స్వర్ణం	2008 బీజింగ్
గగన్ నారంగ్	10మీ. ఎయిర్ రైఫిల్	కాంస్యం	2012 లండన్
విజయ్ కుమార్	25మీ. ర్యాపిడ్ ఫైర్ పిస్టల్	రజతం	2012 లండన్
మను భాకర్	10మీ. ఎయిర్ పిస్టల్	కాంస్యం	2024 పారిస్

భగవద్గీత చూపిన దారిలో..

హరియాణా పేరు చెప్పగానే ప్రఖ్యాత రెజ్లర్లు, స్టార్ బాక్సర్ల పేర్లు గుర్తుకొస్తాయి. అయితే ఆ రాష్ట్రం నుంచి షూటింగ్ పతకంతో ప్రపంచం దృష్టిని ఆకర్షించింది మనుభాకర్. కెరీర్ ప్రారంభంలో టెన్నిస్, స్కేటింగ్, బాక్సింగ్, వాలీబాల్ జాతీయ పోటీల్లో మను దాదాపు 60 పతకాలు సొంతం చేసుకుంది. కానీ షూటింగ్ నేర్చుకోవాలన్న ఆమె ఇష్టాన్ని కాదనలేక తల్లిదండ్రులు రూ.1.80 లక్షలు పెట్టి తొలి పిస్టల్‌ను కొన్నారు. అలా 12 ఏళ్ల వయసులో షూటర్‌గా ప్రస్థానం ప్రారంభించిన మను 19 ఏళ్లు వచ్చేసరికి టోక్యో ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. అయితే, ఆ ఒలింపిక్స్‌లో పిస్టల్ సరిగ్గా పని చేయక రిక్త హస్తాలతో భారత్‌కు తిరిగొచ్చిన మను నిరీక్షణ ఎట్టకేలకు పారిస్ విశ్వక్రీడల్లో కాంస్యం పతకంతో ఫలించింది.

ఆరంభం నుంచీ సంచలనమే..

14 ఏళ్ల వయసులోనే ఒలింపియన్, మాజీ వరల్డ్ నెంబర్ వన్ హీనా సిద్ధూకు మనుభాకర్ షాకిచ్చింది. సాధన ఆరంభించిన ఏడాదికే 2017 జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్స్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఫైనల్లో హీనాను ఓడించడంతో పాటు ఆమె రికార్డును చెరిపేసింది. అదే ఏడాది ఆసియా జూనియర్ చాంపియన్‌షిప్‌లో రజతంతో మెరిసి సత్తా చాటింది. ఆతర్వాత జరిగిన ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ షూటింగ్ వరల్డ్‌కప్ 10 మీ., ఎయిర్ పిస్టల్ అర్హత పోటీల్లో ప్రపంచ రికార్డును బద్దలు కొట్టింది. ఈ వరల్డ్‌కప్ ఫైనల్లో మూడుసార్లు ఐఎస్ఎస్ఎఫ్ విజేత, సిలైన్ గోబెర్‌విల్లెను ఓడించి పసిడి పతకం సాధించి చరిత్ర సృష్టించింది.

2018లో మోత మోగించింది

మను కెరీర్‌లో 2018 చాలా ప్రత్యేకమైంది. గోల్డ్‌కోస్ట్ కామన్వెల్త్ క్రీడల్లో 10 మీ., ఎయిర్ పిస్టల్ విభాగంలో స్వర్ణం కొల్లగొట్టి సంచలనం సృష్టించింది. అదే ఏడాది జూనియర్ వరల్డ్‌కప్‌లో 10 మీ., ఎయిర్ పిస్టల్ కేటగిరీలో పసిడి, మిక్స్‌డ్‌లో కాంస్యం సాధించి సత్తా చాటింది. అర్జెంటీనాలో జరిగిన యూత్ ఒలింపిక్స్ 10 మీ., ఎయిర్ పిస్టల్‌లో స్వర్ణం సాధించి ఈ క్రీడల్లో పతకం నెగ్గిన తొలి షూటర్‌గా చరిత్రకెక్కింది.

గీతాసారంతో ముందుకు..

పోటీ ఏదైనా పతకం ఖాయమనే రీతిలో దూసుకెళ్తున్న మనుకు టోక్యో ఒలింపిక్స్‌లో చుక్కెదురైంది. ఒలింపిక్స్ ముందు వరకు మంచి ఫామ్‌లో ఉన్న మను, విశ్వక్రీడల్లో పిస్టల్ సరిగ్గా పనిచేయక ఒత్తిడికిలోనై పతక రేసులో విఫలమైంది. ఈ క్రమంలో నైరాశ్యంతో ఇంటికొచ్చిన మనుకు ఆమె తల్లిదండ్రులు భగవద్గీతను ఇచ్చారు. స్వతహాగా షూటింగ్ రేంజ్‌లో చిన్నపాటి విరామం లభించినా పుస్తకాలు చదివే అలవాటున్న మను ఆ తర్వాత నుంచి గీత చదవడం ప్రారంభించింది. అందులో శ్రీకృష్ణుడు అర్జునునికి ఉపదేశించిన ఓ అంశం ఆమెను బాగా ఆకర్షించింది. 'భగవద్గీతను చాలా చదివాను. చేసే పనిమీదే దృష్టి పెట్టు. కర్మ ఫలితం మీద కాదు. ఫలితం ఎలావున్నా స్వీకరించు' అన్న మాటలు తనను ఎంతగానో ప్రభావితం చేశాయని తెలిపింది. ఫైనల్‌కు ముందు కూడా భగవద్గీత చదివానని చెప్పింది.

ఒలింపిక్స్‌లో భారత్ బోణీ

పారిస్: ప్రతిష్ఠాత్మక ఒలింపిక్స్‌లో రెండో రోజే భారత్ పతకంతో మురిసింది. అందరి అంచనాలను నిజం చేస్తూ.. 140 కోట్ల భారతావనిని ఆనంద డోలికల్లో ముంచెత్తుతూ.. 22 ఏళ్ల హరియాణా షూటర్ మను భాకర్ కాంస్యం సాధించింది. ఆదివారం జరిగిన మహిళల 10మీ. ఎయిర్ పిస్టల్ ఫైనల్స్‌లో 221.7 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. తద్వారా షూటింగ్‌లో దేశానికి పతకం అందించిన తొలి మహిళా షూటర్‌గా చరిత్ర సృష్టించింది. టోక్యో గేమ్స్‌లో మను మూడు విభాగాల్లో పోటీ పడి తీవ్రంగా నిరాశపరిచిన విషయం తెలిసిందే. కానీ ఈసారి మాత్రం బరిలోకి దిగిన తొలి ఈవెంట్‌లోనే పోడియం ఎక్కి శభాష్ అనిపించుకుంది. అలాగే ఫైనల్స్‌లో కొరియాకు చెందిన ఓహ్ యే జిన్ (243.2) ఒలింపిక్ రికార్డుతో స్వర్ణం సాధించగా.. ఆ దేశానికే చెందిన కిమ్ యెజి (241.3) రజతం అందుకుంది. ఇక 2012లో గగన్ నారంగ్, విజయ్ కుమార్‌ల తర్వాత షూటింగ్‌లో దేశానికి దక్కిన మరో పతకం ఇదే కావడం గమనార్హం. ఓవరాల్‌గా దేశానికి పతకం అందించిన ఐదో షూటర్‌గా మను నిలిచింది.

అంచనాలతో బరిలోకి..: వ్యక్తిగత విభాగంలో 20 ఏళ్ల తర్వాత ఫైనల్స్‌కు చేరిన తొలి భారత మహిళా షూటర్‌గా మను భాకర్.. పోటీల తొలి రోజే పతక ఆశలను కల్పించింది. దీనికి తగ్గట్టుగానే ఆదివారం చెదరని చిరునవ్వుతో.. పతకంపై విశ్వాసంతోనే పోటీలను ఆరంభించింది. ఇందులో ఆద్యంతం టాప్-3లోనే కొనసాగడం తనలోని నిలకడను చూపుతుంది. తొలి సిరీస్‌ను మను మూడు ఇన్నర్ 10లతో దీటుగా ఆరంభించింది. ఇక రెండో సిరీస్ ఐదు షాట్లతో 100.3 పాయింట్లతో చివరి వరకు కూడా టాప్-3 లోనే పోటీ ఇచ్చింది. ఎలిమినేషన్ రౌండ్‌లోనైతే కిమ్ ఎజితో మను రెండో స్థానం కోసం పోటీపడింది. ఆఖరి రెండు షాట్లను ప్రత్యర్థికంటే మెరుగ్గా 10.1, 10.3గా మలిచినప్పటికీ కిమ్ మొత్తం పాయింట్ల సంఖ్య మను కన్నా ఎక్కువగా ఉన్నాయి. దీంతో భాకర్ మూడో స్థానానికే పరిమితంకాగా తొలి రెండు స్థానాల కోసం కొరియా షూటర్లు తలపడ్డారు.

ఫైనల్స్‌కు అర్జున్, రమిత

తొలి రోజు మిక్స్‌డ్ ఈవెంట్‌లో నిరాశపర్చిన అర్జున్ బబుత పురుషుల 10మీ. ఎయిర్ పిస్టల్ అర్హత పోటీల్లో సత్తా చాటుకున్నాడు. 630.1 పాయింట్లతో ఏడో స్థానంలో నిలిచి ఫైనల్స్‌కు చేరాడు. అయితే ఇదే విభాగంలో మరో భారత షూటర్ సందీప్ సింగ్ (629.3) మాత్రం 12వ స్థానంలో నిలిచి పోటీల నుంచి తప్పుకొన్నాడు. అలాగే మహిళల 10మీ. ఎయిర్ రైఫిల్‌లో రమిత జిందాల్ 631.5 పాయింట్లతో ఐదో స్థానంలో నిలిచి ఫైనల్స్‌కు వెళ్లింది. చివరిసారిగా 2004లో సుమ శిరూర్ ఇదే విభాగంలో ఫైనల్‌కు చేరింది. కానీ రమిత సహచరి ఎలవేనిల్ 630.7 పాయింట్లతో పదో స్థానంలో నిలిచి నిరాశపరిచింది.

టోక్యో ఓటమి వెంటాడింది

'చివరి ఒలింపిక్స్‌లో నా ప్రదర్శన నిరుత్సాహపరిచింది. ఆ పరాభవం నుంచి బయటపడేందుకు చాలా సమయమే పట్టింది. అందుకే ప్రస్తుత ఫలితంతో సంతోషంగా ఉన్నా. అలాగే షూటింగ్‌లో మెడల్ కోసం దేశం ఎంతో కాలంగా ఎదురుచూస్తోంది. నా ద్వారా ఆ లోటు తీరినందుకు సంతృప్తిగా అనిపిస్తోంది. కఠోర శ్రమతోనే ఇది సాధ్యమైంది. అయితే చివరి షాట్ సమయంలో నాలో శక్తినంతా కూడదీసుకోవాల్సి వచ్చింది. వచ్చేసారి మరింత ఉత్తమ ప్రదర్శన కనబరుస్తాను. - మను భాకర్

'కాంస్యంతో పతక బోణీ చేసినందుకు మను భాకర్‌కు హృదయపూర్వక అభినందనలు. అలాగే ఈ ఫీట్ సాధించిన తొలి మహిళా షూటర్‌గా నిలవడం ఎందరికో ప్రేరణగా నిలుస్తుంది. భవిష్యత్‌లో మరింత ఎత్తుకు ఎదగాలని ఆశిస్తున్నా' - రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

మనుకు మోదీ ఫోన్



పతకం సాధించిన వెంటనే మను భాకర్‌కు ప్రధాని మోదీ ఫోన్ చేసి అభినందించారు. 'టోక్యో ఒలింపిక్స్‌లో రైఫిల్‌లో సమస్య ఏర్పడడంతో నీకు పతక అవకాశం చేజారింది. ఇప్పుడు ఆ సమస్యను అధిగమించావు. ఈ ఒలింపిక్స్‌లో మిగిలిన విభాగాల్లోనూ నువ్వు రాణిస్తావని నమ్మకముంది' అని మోదీ అన్నారు. పారిస్‌లో క్రీడా సౌకర్యాలు ఎలా ఉన్నాయని భాకర్‌ను ఆయన అడిగి తెలుసుకున్నారు. అథ్లెట్లకు సకల సౌకర్యాలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకున్నదని మోదీ చెప్పారు. పతకం గెలిచాక కుటుంబ సభ్యులతో మాట్లాడావా.. అని భాకర్‌ను ప్రధాని ప్రశ్నించారు. గేమ్స్ విలేజ్‌లోని రూమ్‌కు వెళ్లాక అమ్మతో మాట్లాడతానని భాకర్ బదులిచ్చింది.

బ్యాడ్మింటన్ - సింధు అలవోకగా..



హ్యాట్రిక్ పతక వేటలో ఉన్న ఏస్ షట్లర్ పీవీ సింధు.. ఒలింపిక్స్‌ను గ్రాండ్‌గా మొదలెట్టింది. మహిళల సింగిల్స్ గ్రూప్-ఎంలో జరిగిన తొలి మ్యాచ్‌లో 10వ సీడ్ సింధు 21-9, 21-6తో ఫాతిమా అబ్దుల్ రజాక్ (మాల్దీవులు)పై సునాయాసంగా గెలిచింది. ప్రత్యర్థి నుంచి కనీస పోరాటం కూడా లేకపోవడంతో.. డబుల్ ఒలింపిక్ పతక విజేత సింధు కేవలం 29 నిమిషాల్లో మ్యాచ్‌ను ముగించింది. మెంటార్ ప్రకాశ్ పడుకోన్ సూచనలతో తన ఆట మెరుగుపడిందని మ్యాచ్ అనంతరం సింధు సంతోషం వ్యక్తం చేసింది. మానసికంగా బలంగా ఉండడానికి సానుకూల దృక్పథంతోపాటు యోగాను ప్రాక్టీస్ చేస్తున్నట్టు తెలిపింది. పురుషుల సింగిల్స్ గ్రూప్-కెలో 13వ సీడ్ హెచ్ఎస్ ప్రణయ్ శుభారంభం చేశాడు. తొలి మ్యాచ్‌లో ప్రణయ్ 21-18, 21-12తో ఫాబియాన్ రోత్ (జర్మనీ)పై నెగ్గాడు.



దేశం	స్వ	ర	కా	మొ
ఆస్ట్రేలియా	4	2	0	6
కొరియా	3	2	1	6
చైనా	3	1	1	5
జపాన్	3	1	1	5
ఫ్రాన్స్	2	2	2	6
అమెరికా	1	3	2	6
కజకిస్థాన్	1	0	2	3
బెల్జియం	1	0	1	2
జర్మనీ	1	0	0	1
హాంకాంగ్	1	0	0	1
భారత్	0	0	1	1

గమనిక: స్వ=స్వర్ణం, ర=రజతం, కా=కాంస్యం, మొ=మొత్తం.

టేబుల్ టెన్నిస్ - శ్రీజ ముందంజ



టేబుల్ టెన్నిస్‌లో భారత్‌కు మిశ్రమ ఫలితాలు లభించాయి. తెలుగమ్మాయి ఆకుల శ్రీజ, మనికా బాత్రా ముందంజ వేయగా.. ఐదోసారి ఒలింపిక్స్ బరిలోకి నిలిచిన శరత్ కమల్‌కు తొలి రౌండ్‌లోనే చుక్కెదురైంది. మహిళల సింగిల్స్ రౌండ్-64లో శ్రీజ 4-0తో క్రిస్టినా కాల్‌బర్గ్ (స్వీడన్)ను చిత్తు చేయగా.. మనికా 4-1తో అన్నా హర్సే (బ్రిటన్)పై గెలిచింది. పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో శరత్ కమల్ 2-4తో డెనీ కోజుల్ (స్లొవేనియా) చేతిలో, హర్మీత్ దేశాయ్ 0-4తో వరల్డ్ నెం.5 ఫెలిక్స్ లెబ్రన్ (ఫ్రాన్స్) చేతిలో పరాజయం పాలయ్యారు.

రోయింగ్ - క్వార్టర్స్‌కు పన్వర్



రోయింగ్ సింగిల్ స్కల్స్‌లో బల్‌రాజ్ పన్వర్ క్వార్టర్స్‌కు చేరుకొన్నాడు. రెపిచేజ్-2లో పన్వర్ 7 నిమిషాల 12.41 సెకన్ల టైమింగ్‌తో రెండో స్థానం దక్కించుకొన్నాడు. క్యుయెంటిన్ యాంటాగ్‌నెల్లి (మొనాకో) 7 నిమిషాల 10 సెకన్ల టైమింగ్ టాప్‌లో నిలిచాడు. రెపిచేజ్ రౌండ్‌లో టాప్-2లో నిలిచిన ఇద్దరు రోయర్లు క్వార్టర్స్‌కు క్వాలిఫై అవుతారు.

నిఖత్ ఘనంగా.. - ప్రీక్వార్టర్స్‌కు తెలుగు బాక్సర్



రెండుసార్లు వరల్డ్ చాంపియన్ బాక్సర్ నిఖత్ జరీన్ ఒలింపిక్స్‌ను ఘనంగా ఆరంభించింది. 50 కిలోల విభాగంలో నిఖత్ అదిరే విజయంతో ప్రీక్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. ఆదివారం జరిగిన రౌండ్-32లో నిఖత్ 5-0తో మ్యాక్సీ కరీనా కొయిట్జర్ (జర్మనీ)ను మట్టికరిపించింది. ఆరంభంలో జర్మనీ బాక్సర్ దూకుడుతో వెనుకబడిన నిఖత్ 2-3తో తొలి రౌండ్‌ను చేజార్చుకొంది. కానీ, రెండో రౌండ్‌లో క్రమంగా లయను అందుకొన్న నిఖత్.. ప్రత్యర్థికి దీటుగా పంచ్‌లు విసిరింది. ఇరువురూ నువ్వానేనా అన్నట్టుగా తలపడినా వ్యూహాత్మకంగా వ్యవహరించిన నిఖత్ పైచేయి సాధించింది. ఇక, మూడో రౌండ్‌లో కచ్చితమైన పంచ్‌లతో విరుచుకుపడిన నిఖత్.. ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా బౌట్‌ను సొంతం చేసుకొంది. గురువారం జరిగే ప్రీక్వార్టర్స్‌లో టాప్ సీడ్ వు యు (చైనా) రూపంలో నిఖత్‌కు కఠిన పరీక్ష ఎదురుకానుంది.

నగాల్ అవుట్

టెన్నిస్ పురుషుల సింగిల్స్‌లో సుమిత్ నగాల్‌కు షాక్ తగిలింది. తొలి రౌండ్‌లో నగాల్ 2-6, 6-2, 5-7తో కోరెంటిస్ మౌటిట్ (ఫ్రాన్స్) చేతిలో పోరాడి ఓడాడు. మొదటి సెట్ ఓడినా.. రెండో సెట్‌లో నగాల్ పుంజుకొన్నాడు. నిర్ణాయక మూడో సెట్‌లో సుమిత్ 65 నిమిషాలపాటు హోరాహోరీగా తలపడినా అనవసరపు తప్పిదాలతో మ్యాచ్‌ను చేజార్చుకొన్నాడు.

ఆర్చరీ - అమ్మాయిలకు నిరాశ

పతకంపై ఆశలు రేపిన భారత మహిళల రికర్వ్ ఆర్చరీ జట్టు తీవ్రంగా నిరాశపర్చింది. క్వాలిఫయింగ్ రౌండ్‌లో ఆకట్టుకొనే ప్రదర్శనతో నేరుగా క్వార్టర్స్‌కు చేరిన అంకిత భకత్, భజన్ కౌర్, దీపిక కుమారి త్రయం ఘోరమైన ప్రదర్శన చేసింది. రౌండ్-8లో భారత్ 0-6తో నెదర్లాండ్స్ చేతిలో చిత్తయింది. అంకిత, దీపిక ఏమాత్రం అంచనాలను అందుకోలేక పోయారు. కౌర్ మొత్తంగా 60 పాయింట్లకు 56 సాధించినా.. దీపిక 48 పాయింట్లు, అంకిత 46 పాయింట్లతో ఓటమికి కారణమయ్యారు.

ధినిధి టాప్‌లో నిలిచినా..

స్విమ్మింగ్



ఒలింపిక్స్‌లో భారత స్విమ్మర్లు మరోసారి పతకం లేకుండానే వెనుదిరిగారు. బరిలో నిలిచిన శ్రీహరి నటరాజ్, ధినిధి దేసింగు సెమీస్ చేరడంలో విఫలమయ్యారు. పురుషుల 100 మీ. బ్యాక్‌స్ట్రోక్ హీట్స్‌లో శ్రీహరి 55.01 సెకన్ల టైమింగ్‌తో ఓవరాల్‌గా 33వ స్థానంలో నిలిచాడు. అత్యుత్తమ టైమింగ్ నమోదు చేసిన తొలి 16 మందికే సెమీస్‌కు చాన్స్ లభిస్తుంది. తొలిసారి ఒలింపిక్స్ బరిలో దిగిన 14 ఏళ్ల ధినిధి మహిళల 200 మీటర్ల ఫ్రీస్టైల్ హీట్స్-1లో 2 నిమిషాల 6.96 సెకన్ల టైమింగ్‌తో టాప్‌లో నిలిచింది. కానీ, ఓవరాల్‌గా పాల్గొన్న 30 మందిలో 23వ స్థానంలో నిలిచి సెమీస్ రేసు నుంచి అవుటైంది.

పారిస్‌లో నేటి భారతం



బ్యాడ్మింటన్: పురుషుల డబుల్స్ (గ్రూప్ దశ) సాత్విక్/చిరాగ్ X మార్క్ లామ్స్‌ఫస్/సీడెల్ (జర్మనీ) (మధ్యాహ్నం 12 గం); **మహిళల డబుల్స్** (గ్రూప్ దశ) - అశ్విని పొన్నప్ప/తనీషా X మట్సుయమా/షిదా (జపాన్) (మ. 12.50); **పురుషుల సింగిల్స్** (గ్రూప్ దశ)- లక్ష్య సేన్ X కరాగి (బెల్జియం) (సా. 5.30).

షూటింగ్: 10 మీ. ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ క్వాలిఫికేషన్ - మను భాకర్/సరబ్‌జోత్ సింగ్, రిథమ్-అర్జున్ చీమా (మ. 12.45); **పురుషుల ట్రాప్ క్వాలిఫికేషన్**- పృథ్వీరాజ్ తొండైమన్ (మ. 1 గం); **మహిళల 10 మీ. ఎయిర్ రైఫిల్ ఫైనల్**- రమితా జిందాల్ (మ. 1 గం); **పురుషుల 10 మీ. ఎయిర్ రైఫిల్ ఫైనల్** -అర్జున్ బబుతా (మ. 3.30).

హాకీ: పురుషుల పూల్-బి మ్యాచ్- భారత్ X అర్జెంటీనా (సా. 4.15).

ఆర్చరీ: పురుషుల టీమ్ క్వార్టర్స్-ధీరజ్ బొమ్మదేవర, ప్రవీణ్ జాదవ్, తరుణ్‌దీప్ రాయ్ (సా. 6.31). (సెమీస్ రా. 7.17).

టేబుల్ టెన్నిస్: మహిళల సింగిల్స్ (రౌండ్-32)- శ్రీజ X జియాన్ జెంగ్ (సింగపూర్) (రా. 11.30).

తుది మెట్టుపై బోల్తా

భారత్‌కు శ్రీలంక షాక్

ఆసియా కప్ కైవసం

మంధాన హాఫ్ సెంచరీ వృథా



దంబుల్లా: అప్రతిహత విజయాలతో ఫైనల్‌కు దూసుకొచ్చిన డిఫెండింగ్ చాంపియన్ భారత్‌కు శ్రీలంక షాకిచ్చింది. ఆదివారం జరిగిన ఆసియా కప్ తుదిపోరులో 8 వికెట్లతో హర్మన్‌సేనను చిత్తు చేసిన ఆతిథ్య జట్టు తొలిసారి టైటిల్ సొంతం చేసుకుంది. కవిషా దిల్హారి (30 నాటౌట్, 2/36) ఆల్‌రౌండ్ షోతో జట్టు విజయంలో కీలక భూమిక పోషించింది. తొలుత భారత్ 20 ఓవర్లలో 165/6 స్కోరు సాధించింది. ఓపెనర్ మంధాన (60), రిచా ఘోష్ (30) ధనాధన్ ఇన్నింగ్స్ ఆడారు. ఛేదనలో శ్రీలంక 18.4 ఓవర్లలో 167/2 స్కోరు చేసి నెగ్గింది. చమరి ఆటపట్టు, హర్షిత సమరవిక్రమ అర్ధ శతకాలతో మెరవగా, కవిష భారీ షాట్లతో అలరించింది. హర్షిత 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా, కెప్టెన్ చమరి 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచారు. వన్డే, టీ20 ఫార్మాట్‌లతో కలిపి ఆసియా కప్ ఇప్పటి వరకు 9 సార్లు జరగ్గా..భారత్ ఫైనల్లో ఓడడం ఇది రెండోసారి మాత్రమే. కాగా విజేతగా నిలిచిన శ్రీలంక జట్టుకు ఆ దేశ క్రికెట్ బోర్డు రూ. లక్ష డాలర్ల ప్రైజ్‌మనీ ప్రకటించింది.

సంక్షిప్తస్కోర్లు: భారత్: 20 ఓవర్లలో 165/6 (మంధాన 60, రిచా 30, జెమీమా 29, కవిషా దిల్హారి 2/36); **శ్రీలంక:** 18.4 ఓవర్లలో 167/2 (హర్షిత నాటౌట్ 69, చమరి 61, దిల్హారి నాటౌట్ 30, దీప్తిశర్మ 1/30).

ఇంగ్లండ్ క్లీన్ స్వీప్

మూడోరోజే ముగిసిన టెస్టు

10 వికెట్ల తేడాతో విండీస్‌పై గెలుపు

బర్మింగ్‌హామ్: స్వదేశంలో వెస్టిండీస్‌తో జరిగిన మూడు టెస్టుల సిరీస్‌ను ఇంగ్లండ్ క్లీన్ స్వీప్ చేసింది. మూడ్రోజుల్లోనే ముగిసిన ఈ మూడో టెస్టులో ఇంగ్లండ్ 10 వికెట్లతో విజయం సాధించింది. పేసర్ మార్క్ ఉడ్ ఐదు (5/41) వికెట్లతో చెలరేగాడు. ఆదివారం ఓవర్‌నైట్ స్కోరు 33/2తో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన విండీస్..ఉడ్ ధాటికి 175కు ఆలౌటైంది. 82 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లండ్ వికెట్ నష్టపోకుండా 7.2 ఓవర్లలో 87 పరుగులు చేసి గెలిచింది. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో వెస్టిండీస్ 282, ఇంగ్లండ్ 376కు ఆలౌటయ్యాయి.

సిరీస్ మనదే

రెండో టీ20లోనూ శ్రీలంక ఓటమి



పల్లెకెలె: శ్రీలంకతో మూడు టీ20ల సిరీస్‌ను టీమిండియా మరో మ్యాచ్ ఉండగానే కైవసం చేసుకుంది. వర్షం బారిన పడిన ఆదివారంనాటి రెండో మ్యాచ్‌లో భారత్ ఏడు వికెట్లతో శ్రీలంకను ఓడించింది. తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక 20 ఓవర్లలో 161/9 స్కోరు సాధించింది. కుశాల్ పెరీరా (53), నిస్సాంక (32), కమిందు మెండిస్ (26) రాణించారు. బిష్ణోయ్ 3, హార్దిక్, అర్ష్‌దీప్, అక్షర్ తలా రెండేసి వికెట్లు పడగొట్టారు. భారత్ ఇన్నింగ్స్ మూడు బంతుల తర్వాత వర్షం పడడంతో మ్యాచ్ గంటకుపైగా ఆగిపోయింది. దాంతో డక్‌వర్త్ లూయిస్ నిబంధన ప్రకారం టీమిండియా లక్ష్యాన్ని ఎనిమిది ఓవర్లలో 78 పరుగులుగా నిర్ధారించారు. అయితే 6.3 ఓవర్లలోనే 81/3 స్కోరుతో భారత్ లక్ష్యాన్ని చేరుకుంది. జైస్వాల్ (30), సూర్యకుమార్ (26), హార్దిక్ (22 నాటౌట్) ఫటాఫట్ ఇన్నింగ్స్ ఆడారు. బిష్ణోయ్ 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. చివరి మ్యాచ్ మంగళవారం ఇక్కడే జరగనుంది.

సంక్షిప్తస్కోర్లు

శ్రీలంక: 20 ఓవర్లలో 161/9 (కుశాల్ పెరీరా 53, నిస్సాంక 32, కమిందు మెండిస్ 26, బిష్ణోయ్ 3/26, హార్దిక్ 2/23, అర్ష్‌దీప్ 2/24, అక్షర్ 2/30)

భారత్: 6.3 ఓవర్లలో 81/3 (జైస్వాల్ 30, సూర్యకుమార్ 26, హార్దిక్ నాటౌట్ 22, తీక్షణ 1/16, పథిరన 1/18, హసరంగ 1/34).

రెండో రౌండ్‌లో నడాల్ X జొకోవిచ్



పారిస్: పురుషుల టెన్నిస్ సింగిల్స్ రెండో రౌండ్‌లో దిగ్గజ ఆటగాళ్లు రఫెల్ నడాల్, జొకోవిచ్ తలపడబోతున్నారు. దీంతో ఈ మ్యాచ్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఆదివారం జరిగిన తొలి రౌండ్‌లో నడాల్ 6-1, 4-6, 6-4 తేడాతో మార్టన్ ఫుక్సోవిక్స్ (హంగెరీ)పై చెమటోడ్చి గెలిచాడు. అయితే జొకో 6-0, 6-1 తేడాతో డబుల్స్ స్పెషలిస్ట్ మాథ్యూ ఎబ్డెన్ (ఆసీస్)పై సునాయాసంగా గెలిచాడు. మరోవైపు నడాల్-జొకో చివరిసారి 2022 ఫ్రెంచ్ ఓపెన్ క్వార్టర్స్‌లో తలపడ్డారు.

తెలంగాణకు కరెంటు వద్దా?

(మొదటి పేజీ తరువాయి)

అవసరం లేదా? అని ప్రశ్నించారు. ఈ మేరకు కిషన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పెద్దపల్లి జిల్లా రామగుండంలో సూపర్ థర్మల్ పవర్ ప్లాంట్లను ఏర్పాటుచేసి 4 వేల మెగావాట్ల విద్యుదుత్పత్తి చేపట్టే ప్రాజెక్టుకు కేంద్రం ఆమోదం తెలిపిన విషయాన్ని కేంద్రమంత్రి గుర్తు చేశారు. మొదటి విడతగా 800 మెగావాట్ల సామర్థ్యం గల 2 పవర్ ప్లాంట్లను ఎన్టీపీసీ ఆధ్వర్యంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చినట్టు వివరించారు. రూ.10,598.98 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ రెండు పవర్ ప్రాజెక్టుల్లో, మొదటి 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్‌ను గతేడాది అక్టోబరు 3న, రెండో 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్‌ను ఈ ఏడాది మార్చి 4న ప్రధాని నరేంద్ర మోదీ జాతికి అంకితం చేశారని పేర్కొన్నారు. ఈ 1600 మెగావాట్ల ప్రాజెక్ట్‌లో ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌లో 85 శాతం తెలంగాణ అవసరాలకే వినియోగిస్తున్నారని తెలిపారు. మిగిలిన 2400 మెగావాట్ల ప్రాజెక్టును సైతం త్వరగా పూర్తి చేయాలని కేంద్ర భావిస్తోందని, దీనికోసం ఎన్టీపీసీతో తెలంగాణ ట్రాన్స్‌కో విద్యుత్ కొనుగోలు ఒప్పందం చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్టీపీసీ గతేడాది అక్టోబరు 5న, ఈ ఏడాది జనవరి 9, జనవరి 29, ఏప్రిల్ 29 తేదీల్లో నాలుగు లేఖలు రాసినట్టు వివరించారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించలేదన్నారు. దీంతో రామగుండం ఎన్టీపీసీ-2 ప్రాజెక్టు నుంచి విద్యుత్ కొనుగోలు చేసే ఆసక్తి తెలంగాణ ప్రభుత్వానికి లేదని తాము భావించాల్సి వస్తుందని, అటువంటి సందర్భంలో, ఆ ప్రాజెక్టు నుంచి ఉత్పత్తి అయ్యే కరెంటును దక్షిణాదిలోని ఇతర రాష్ట్రాలకు విక్రయించేందుకు అనుమతి ఉంటుందని కూడా ఎన్టీపీసీ తన లేఖల్లో స్పష్టం చేసిందని కిషన్‌రెడ్డి వెల్లడించారు. తెలంగాణలో 2030 నాటికి విద్యుత్ డిమాండ్ రెట్టింపు కాబోతున్నదని, రాష్ట్ర ప్రభుత్వం దీనిని దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. తెలంగాణలో ఉత్పత్తి అయ్యే విద్యుత్‌పై తొలి హక్కు తెలంగాణ ప్రజలదేనన్నారు. దేశవ్యాప్తంగా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా కరెంటు ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు కేంద్రం ప్రయత్నిస్తుందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. దీంట్లో భాగంగానే తెలంగాణలో కూడా విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచాలని భావిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం సహకరించడం లేదన్నారు.

ఆలయాల్లో అనువంశిక అర్చకత్వమే శ్రేయస్కరం

» చిలుకూరు ఆలయ ప్రధానార్చకులు రంగరాజన్

» చెర్వుగట్టులో ప్రారంభమైన జాతీయ శైవాగమ సదస్సు

నార్కట్‌పల్లి, జూలై 28: ఆలయాల్లో అనువంశిక అర్చకత్వమే శ్రేయస్కరమని చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధానార్చకులు డాక్టర్ రంగరాజన్ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు గ్రామంలోని శ్రీ సోమేశ్వర శివజ్ఞాన పీఠంలో తెలంగాణ ఆదిశైవ బ్రాహ్మణ సంఘం, రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ప్రారంభమైన మూడు రోజుల జాతీయ శైవాగమ సదస్సుకు ఆయన హాజరయ్యారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి శైవాగమ విద్వాంసులు, పండిత జిజ్ఞాసులు హాజరైన ఈ సదస్సులో రంగరాజన్ ప్రారంభోపన్యాసం చేశారు. కొన్ని తరాలుగా అర్చక కుటుంబాలకు పలు ఆలయాలకు విడదీయరాని బంధం ఏర్పడిందన్నారు. అనువంశిక అర్చకత్వ ప్రతిపాదనపై రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని, త్వరలో శుభవార్త వింటామన్నారు. 2007లో సవరించిన ఈ చట్టం ఆంధ్రప్రదేశ్‌లో 2019 నుంచి అమల్లోకి వచ్చిందని, మన రాష్ట్రంలో కూడా సవరించిన చట్టాన్ని అమలుచేస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి హామీ ఇచ్చారని వెల్లడించారు. వంశపారంపర్య అర్చకుల బదిలీకి దేవాదాయశాఖ చేపట్టిన చర్యలు సరైనవి కావన్నారు. ఈ సందర్భంగా... రంగరాజన్‌కు 'అర్చక శిరోమణి' బిరుదును ప్రదానం చేస్తూ జాతీయ శైవాగమ సదస్సు ఆయనను ఘనంగా సత్కరించింది. తొలిరోజు సదస్సులో భాగంగా... ఆలయాల్లో సంప్రదాయ అర్చకత్వాన్ని పునరుద్ధరించాలని, వంశపారంపర్య అర్చకుల బదిలీ యోచనను విరమించాలని, అనువంశిక అర్చకత్వాన్ని కొనసాగించాలని తీర్మానాలను ప్రవేశపెట్టారు.

శాంతిభద్రతల నిర్వహణలో పోలీసులు విఫలం

» రాష్ట్రంలో 8 నెలల్లో 500 హత్యలు: హరీశ్ రావు

హైదరాబాద్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల నిర్వహణలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర పోలీసులు పూర్తిగా విఫలయ్యారని, రోజు రోజుకూ పెరుగుతున్న నేరాలే ఇందుకు నిదర్శనమని మాజీమంత్రి తన్నీరు హరీశ్ రావు అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 8 నెలల్లో 500 హత్యలు జరిగాయని, ఇదే విషయాన్ని తాను అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ప్రశ్నించిన మరుసటిరోజే హైదరాబాద్‌లో రెండు హత్యలు జరగడం తీవ్ర దిగ్భ్రాంతి కలిగిస్తోందని ఆదివారం ఎక్స్ వేదికగా ఆయన పేర్కొన్నారు. హోం మంత్రిత్వ శాఖను కూడా నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి రాష్ట్రంలో జరుగుతున్న నేరాలపై ఇంతవరకు పోలీసులతో సమీక్ష నిర్వహించలేదని విమర్శించారు. హత్యలు, అత్యాచారాలు యథేచ్ఛగా జరుగుతున్నా ప్రభుత్వానికి, పోలీసులకు చీమ కుట్టినట్టయినా లేదన్నారు. ప్రజల మానప్రాణాలను రక్షించాల్సిన బాధ్యతను పూర్తిగా విస్మరించారని మండిపడ్డారు. గత పదేళ్లలో హైదరాబాద్ సహా తెలంగాణలో నెలకొల్పిన శాంతిభద్రతల కారణంగా రూ.వేలకోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని, ప్రస్తుత పరిస్థితులు చూస్తే రాష్ట్ర ప్రతిష్ఠతోపాటు హైదరాబాద్ ప్రతిష్ఠ కూడా దెబ్బతినే అవకాశం నెలకొందన్నారు.

హామీలివ్వడం వాటి అమలుపై మాటమార్చడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని, అధికారంలోకి రాగానే, ఎల్ఆర్ఎస్ రద్దు చేస్తామని, ఉచితంగా క్రమబద్ధీకరణ చేస్తామని చెప్పిన ఆ పార్టీ మాట తప్పిందని హరీశ్ రావు అన్నారు. కాంగ్రెస్‌నేతలకు చిత్తశుద్ధి ఉంటే గతంలో తాము చేసిన ప్రకటనలకు అనుగుణంగా ఎల్ఆర్ఎస్‌ను ఎలాంటి ఫీజులు లేకుండా అమలు చేయాలని, లేదంటే మోసపూరిత హామీ ఇచ్చినందుకు ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

స్మార్ట్ మీటర్లంటూ సర్కారు కుట్ర: బీఆర్ఎస్ నేతలు

హైదరాబాద్, జూలై28 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లు పెడతామని చెబుతూ.. రేవంత్ సర్కారు వ్యవసాయ మోటార్లకు మీటర్లుపెట్టి.. విద్యుత్ చార్జీల బాదుడుకు సిద్ధమవుతోందని, తద్వారా రైతులకు ఉరి వేసేందుకు కుట్ర చేస్తోందని బీఆర్ఎస్ నేతలు జగదీశ్‌రెడ్డి, మహమూద్‌అలీ, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు ఆరోపించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ.. 2017లోనే రైతుల మోటార్లకు మీటర్లు పెట్టేందుకు కేసీఆర్ ఒప్పుకున్నట్టు అసెంబ్లీలో సీఎం అబద్ధాలు చెప్పి సభను, ప్రజలను తప్పుదోవ పట్టించారన్నారు. తెలంగాణలో మీటర్లు పెట్టనందునే అప్పులకు వెసులుబాటు ఇవ్వలేకపోయామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గతంలో చెప్పారన్నారు. కేంద్రం అమలు చేస్తున్న ఉదయ్ పథకంలో 27 రాష్ట్రాలు చేరాయని, అందులో తెలంగాణను చేర్చేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు.

నేనూ మోదీ ప్రభుత్వ బాధితురాలినే..

» 'ది వైర్' సీనియర్ ఎడిటర్ ఆర్ఫాఖానుమ్


ఆర్ఫా ఖానుమ్

హైదరాబాద్ సిటీ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఓ ముస్లిం మహిళగా, పాత్రికేయురాలిగా తాను మోదీ సర్కారు బాధితురాలినేనంటూ 'ది వైర్' సీనియర్ ఎడిటర్ ఆర్ఫాఖానుమ్ షేర్వానీ వ్యాఖ్యానించారు. మోదీ ప్రధాని అయిన మొదట్నుంచి ప్రజా వ్యతిరేక విధానాలనే అవలంబించారని.. సమాజంలో విద్వేషాలను రెచ్చగొట్టారని ఆరోపించారు. జాతీయ మీడియా సైతం మోదీ అప్రజాస్వామిక విధానాలకు వంతపాడుతూ, అబద్ధాలను వండి వార్చిందని విమర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ప్రొఫెసర్ జయశంకర్ 13వ స్మారక సభను తెలంగాణ విద్యావంతుల వేదిక నిర్వహించింది. ఈ సందర్భంగా 'సమకాలీన భారతీయ సమాజం-భావి సవాళ్లు' అంశంపై ఆర్ఫాఖానుమ్ కీలకోపన్యాసం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే శక్తిమంతులని.. సార్వత్రిక ఎన్నికల ఫలితాలే అందుకు నిదర్శనమని చెప్పారు. ప్రత్యేక తెలంగాణ నినాదాన్ని జయశంకర్ ప్రజల్లోకి తీసుకెళ్లడం వల్లే అది మలిదశ పోరాటంగా రూపుదాల్చి స్వరాష్ట్రం సిద్ధించడం.. ప్రజా ఉద్యమాల స్ఫూర్తికి నిదర్శనమని కొనియాడారు. కార్యక్రమంలో టీజేఎస్ చీఫ్ కోదండరాం, విద్యావంతుల వేదిక ప్రతినిధులు అంబటి నాగయ్య, తిప్పర్తి యాదయ్య, రమాదేవి తదితరులు పాల్గొన్నారు. రచయిత అరుంధతీ రాయ్‌తో పాటు పలువురు జర్నలిస్టులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలంటూ సంతకాల సేకరణ చేపట్టారు.

ప్రజా సందర్శనకు అనుమతినీయరా?

» కళ తప్పుతున్న అమరుల స్మృతి చిహ్నం, భారీ అంబేద్కర్ విగ్రహం




హైదరాబాద్ సిటీ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ప్రధాన పర్యాటక స్థలమైన హుస్సేన్‌సాగర్ తీరాన కోట్లాది రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ భారీ విగ్రహం, అమరుల స్మృతి చిహ్నం కళ కోల్పోతున్నాయి. వీటి నిర్మాణాలు పూర్తయి నెలలు గడుస్తున్నా ప్రజా సందర్శనకు అనుమతించకపోవడంతో సందడి. నిర్వహణ లేక వెలవెలబోతున్నాయి. ఎక్కడెక్కడి నుంచో ట్యాంక్‌బండ్‌కు వచ్చిన వారికి సెల్ఫీ పాయింట్లుగా మిగిలిపోతున్నాయి. అంబేడ్కర్ 125వ జయంతిని పురస్కరించుకుని ప్రభుత్వం రూ.146 కోట్లకు పైగా వ్యయంతో 125 అడుగుల ఎత్తు, 45.4 అడుగుల వెడల్పు, 465 టన్నుల బరువు కలిగిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేసింది. ఈ విగ్రహం దిగువన 50 అడుగుల ఎత్తు, 172 అడుగుల వెడల్పున ఉన్న పీఠంలో గ్రంథాలయం, మ్యూజియం, జ్ఞాన మందిరం, అంబేడ్కర్ జీవిత ముఖ్య ఘట్టాల ఫొటో గ్యాలరీ ఏర్పాటు చేశారు. ఈ పనులన్నీ పూర్తయినా సందర్శకులను లోపలికి అనుమతించడం లేదు. నిర్వహణ లేక పీఠంలోని నిర్మాణాలు పాడైపోతున్నాయి. మరోపక్క, ప్రపంచంలోనే అతి పెద్ద స్టెయిన్ లెస్ స్టీల్ నిర్మాణంగా పేరొందిన అమరుల స్మృతి చిహ్నం పరిస్థితి కూడా ఇలానే తయారైంది. 3.29ఎకరాల విస్తీర్ణంలో దాదాపు రూ.179 కోట్లతో మూడు అంతస్తులతో చేపట్టిన ఈ నిర్మాణం.. తెలంగాణ కోసం అమరులైన వారి త్యాగానికి గుర్తుగా నిరంతరం వెలిగే జ్యోతి రూపంలో ఉంటుంది. ఈ స్మృతి చిహ్నం లోపలి భాగంలో మూడంతస్తుల్లో మ్యూజియం, కన్వెన్షన్ హాల్‌తోపాటు జ్యోతిని సందర్శించేలా ఏర్పాట్లు చేశారు. ఈ కన్వెన్షన్ హాల్ సభలు, సమావేశాల నిర్వహణకు అనువుగా ఉండడంతో పాటు ఆదాయం తెచ్చిపెడుతుంది. కానీ ప్రస్తుతం నిరుపయోగంగా విగిలింది. కాగా, హుస్సేన్‌సాగర్ పరిసరాల్లోని పార్కులను నిర్వహిస్తున్న హెచ్ఎండీఏ ఈ అమరుల స్మృతి చిహ్నం, అంబేడ్కర్ విగ్రహ నిర్వహణకు సిద్ధంగా ఉంది. కానీ, ఆర్ అండ్ బీ అధికారులు హెచ్ఎండీఏకు అప్పగించేందుకు తాత్సారం చేస్తున్నారు. వెరసి పట్టించుకునే వారు లేక ఆయా ప్రాంగణాలు దుమ్ము పట్టిపోతున్నాయి. ఇకనైనా ప్రభుత్వం, అధికారులు ఈ కట్టడాల నిర్వహణపై దృష్టి పెట్టాలని, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.



రేపు శ్రీశైలం 6 గేట్లు ఎత్తివేత!

(మొదటి పేజీ తరువాయి)

కళకళలాడుతోంది. రెండు రోజుల్లో డ్యాం పూర్తిగా నిండే అవకాశం ఉంది. ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి ఉధృతి పెరుగుతుండడంతో జలాశయం గేట్లను ఎత్తేందుకు ఇంజనీర్లు సన్నాహాలు చేస్తున్నారు. మంగళవారం ఉదయం 11 గంటలకు ఏపీ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు 6 గేట్లను ఎత్తనున్నారు. కాగా, శ్రీశైలానికి జూరాల, సుంకేశుల నుంచి 4,41,222 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. జూరాల నుంచి 3,60,483 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ఈ ప్రాజెక్టు 41 గేట్లు ఎత్తారు. సుంకేశుల ద్వారా 1,46,746 క్యూసెక్కుల వరద వస్తోంది. ఆదివారం సాయంత్రం 6 గంటల సమయానికి శ్రీశైలం మట్టం 885 అడుగులకు గాను 873.40 అడుగులుగా నమోదైంది. నీటి నిల్వ 215.807 టీఎంసీలకు 156.38 టీఎంసీలుగా ఉంది. కుడి, ఎడమ గట్టు కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ 62,847 క్యూసెక్కులను నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. సాగర్ నీటి మట్టం 510.30 అడుగులకు (132.00 టీఎంసీలు) చేరింది. కుడి కాలువ ద్వారా 5,882, ఎస్ఎల్‌బీసీ ద్వారా 400 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. మరోవైపు, ఆల్మట్టికి 2,68,222 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 3.25 లక్షల క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. నారాయణపూర్ జలాశయానికి 3.20లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 30 గేట్లు ఎత్తి 3,27,366 క్యూసెక్కులను విడిచిపెడుతున్నారు. కాగా, తుంగభద్ర జలాశయానికి 1,27,100 క్యూసెక్కుల ఇన్ ఫ్లో ఉండగా 33 గేట్లను ఎత్తి 1,50,798 క్యూసెక్కులను దిగువకు పంపిస్తున్నారు. ఈప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 105 టీఎంసీలకు గాను 98.21 టీఎంసీలకు చేరడంతో వచ్చిన నీటిని వచ్చినట్లు వదులుతున్నారు. కాగా, మూసీలోకి వరద చేరుతుండడంతో 645 అడుగులు పూర్తి సామర్థ్యం కాగా.. 643.20 అడుగులకు చేరుకుంది.


తుంగభద్ర డ్యాం 33 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్న దృశ్యం

మేడిగడ్డకు తగ్గిన వరద

కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రధానమైన మేడిగడ్డకు వరద క్రమంగా తగ్గుతోంది. ఆదివారం 4.29 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. 85 గేట్లను ఎత్తి దీన్నంత టినీ దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద గోదావరి 5.50 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తోంది. అన్నారంలోకి 8,147, శ్రీరాంసాగర్‌లోకి 20 వేల క్యూసెక్కుల వరద వస్తోంది. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 17.730 టీఎంసీల మేర నీళ్లు ఉన్నాయి. 20,643 క్యూసెక్కుల వరద వస్తోంది. పెద్దపల్లి జిల్లా నంది పంప్‌హౌస్, కరీంనగర్ జిల్లా గాయత్రి పంప్‌హౌస్ నుంచి 12,600 క్యూసెక్కులను మధ్య మానేరుకు తరలిస్తున్నారు. కాగా, భద్రాచలం వద్ద గోదావరి తగ్గుముఖం పట్టింది. శనివారం అర్ధరాత్రి 12 గంటలకు 53.9 అడుగులకు చేరిన నీటిమట్టం ఆదివారం ఉదయం 7.30 గంటలకు 52.9 అడుగులకు పడిపోవడంతో మూడో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. ఆదివారం రాత్రి 47 అడుగులకు పడిపోవడంతో రెండో ప్రమాద హెచ్చరికను కూడా ఉపసంహరించారు. సోమవారం నాటికి మరింత తగ్గే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. భద్రాచలం అశోకనగర్ కొత్తకాలనీ, ఏఎంసీ కాలనీలు ఇంకా నడుం లోతు నీళ్లలోనే ఉన్నాయి. 106 కుటుంబాలకు చెందిన 343 మంది పునరావాస కేంద్రంలోనే ఉన్నారు. భద్రాద్రి జిల్లా జూలూరుపాడు మండలం కరివారిగూడెం గ్రామానికి చెందిన పశువుల కాపరి రమావత్ వెంకటేశ్వర్లు (60) పెద్ద వాగులో పడి మృతిచెందాడు.

నిజామాబాద్, ఆదిలాబాద్‌ను వీడని ముసురు

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాను ముసురు వర్షాలు వీడడం లేదు. ఆదివారం సగటున 3.68 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. నిర్మల్ జిల్లాలోనూ పది రోజూ వర్షం కురిసింది. కుమరంభీం ప్రాజెక్టు మూడు గేట్లను ఎత్తారు. 6 రోజుల పాటు నిలిపివేసిన ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లి అటవీ ప్రాంతంలోని బొగత జలపాతం సందర్శనను పునరుద్ధరించారు.

ఫోన్ల రికవరీలో తెలంగాణది రెండోస్థానం

» 206 రోజుల్లో 21,193 ఫోన్ల రికవరీ: డీజీపీ

హైదరాబాద్, జూలై 28(ఆంధ్రజ్యోతి): దొంగతనానికి గురైన మొబైల్ ఫోన్ల రికవరీలో దేశంలోనే తెలంగాణ రెండో స్థానంలో నిలిచిందని డీజీపీ జితేందర్ తెలిపారు. రాష్ట్రంలో ఈ ఏడాదిలో జూలై 25 వరకు 21,193 ఫోన్లను రికవరీ చేసినట్లు ఆయన వివరించారు. డిపార్ట్మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్(డీవోటీ) ఫోన్ల దొంగతనాలను అరికట్టేందుకు సీఈఐఆర్ పోర్టల్‌ను దేశవ్యాప్తంగా గతేడాది మే 17న అధికారికంగా ప్రారంభించిందని చెప్పారు. అయితే ఈ పోర్టల్ గతేడాది ఏప్రిల్ 19 నుంచే రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు. 780 పోలీస్‌స్టేషన్లలో ఈ పోర్టల్‌ను ఉపయోగిస్తున్నామని జితేందర్ చెప్పారు. తద్వారా ఈ ఏడాది జూలై 25 వరకు 206 రోజుల్లో 21,194 ఫోన్లు రికవరీ చేయగా, గత 8 రోజుల్లోనే 1,000 ఫోన్లను పట్టుకొని ఫిర్యాదుదారులకు అప్పగించామని, సగటున ప్రతి రోజూ 82 ఫోన్లను రికవరీ చేస్తున్నామని తెలిపారు. ప్రత్యేక పోర్టల్ ద్వారా ప్రజలకు మొబైల్ ఫోన్లను అతితక్కువ కాలంలోనే రికవరీ చేస్తున్నందుకు పోలీసు విభాగాలను ఆయన ప్రశంసించారు. పౌరులకు మెరుగైన సేవలు అందించేందుకు టెలికాం శాఖతో కలిసి సీఈఐఆర్ పోర్టల్‌ను తెలంగాణ పోలీస్ సిటిజన్ పోర్టల్‌తో అనుసంధానించినట్లు వెల్లడించారు. పోగొట్టుకున్న, దొంగతనానికి గురైన ఫోన్ల గురించి www.tspolice.gov.in లేదా www.ceir.gov.in వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేయాలని డీజీపీ సూచించారు.

పాక్‌లో రెండు తెగల ఘర్షణ

» 36 మంది మృతి... 162 మందికి గాయాలు

పేషావర్, జూలై 28: పాక్‌లో రెండు గిరిజన తెగల మధ్య జరిగిన ఘర్షణల్లో కనీసం 36 మంది మరణించగా 162 మందికిపైగా గాయపడ్డారు. పాక్‌లోని వాయువ్య ప్రాంతంలోని అప్పర్ కుర్రం జిల్లాలో ఈ ఘటన జరిగినట్లు అక్కడి అధికారులు ఆదివారం తెలిపారు. "రెండు గిరిజన తెగల మధ్య గత ఐదు రోజులుగా ఘర్షణలు జరుగుతున్నాయి. బోషేరా, మలిఖీలా, దండార్ ప్రాంతాల్లో కొన్ని రోజులుగా షియా, సున్నీ గిరిజన తెగల మధ్య భూ వివాదం తలెత్తింది" అని అధికారులు తెలిపారు.

కట్టినప్పుడు, కూలినప్పుడు మీరే

మీ హయాంలోనే కాళేశ్వరం ధ్వంసం.. కేసీఆర్ కుటుంబ కమీషన్ల కక్కుర్తితోనే ప్రాజెక్టు సర్వనాశనం

» ప్రాజెక్టుల రీడిజైన్ల పేరుతో దోపిడీ చేసి.. మాపై నిందలేస్తారా?

» మేడిగడ్డను నింపితే 44 గ్రామాలు, లక్షల ఎకరాలకు ముంపు ముప్పు

» నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనల మేరకే గేట్లు ఎత్తినం

» మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



హైదరాబాద్, జులై 28 (ఆంధ్రజ్యోతి): "కాళేశ్వరం కట్టినప్పుడు.. కూలినప్పుడు అధికారంలో ఉన్నది కేసీఆర్ కుటుంబమే? కూలినప్పుడు కూడా వారే అధికారంలో ఉన్నారు. రీ-డిజైనింగ్, రీ-ఇంజనీరింగ్‌తోనే మేడిగడ్డ ప్రాజెక్టు కుంగిపోయింది. కాళేశ్వరానికి మేడిగడ్డ గుండెకాయ అని చెప్పిన మీరు.. ఆ గుండెకాయ కుంగినపుడు అధికారంలో ఉండి ఏంచేశారు? వాస్తవాలను వక్రీకరించటం గులాబీ దండుకు వెన్నతో పెట్టిన విద్య" అని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ధ్వజమెత్తారు. దోపిడీ చేసింది కాకుండా.. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ, మంత్రుల మీద నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. ఆదివారం జలసౌధలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసీఆర్, కేటీఆర్‌పై మంత్రి ఉత్తమ్ విరుచుకుపడ్డారు. కేసీఆర్ కుటుంబం కమీషన్ల కక్కుర్తి కోసం రాష్ట్ర నీటిపారుదలరంగాన్ని, కాళేశ్వరం ప్రాజెక్టును సర్వనాశనం చేసిందని దుయ్యబట్టారు. "మాజీ మంత్రి కేటీఆర్‌కు సిగ్గు, అవగాహన, ఇంగిత జ్ఞానం లేదు. పచ్చి అబద్ధాలు మాట్లాడుతూ.. ప్రజల్లో తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నారు. తప్పుడు ప్రచారంలో జోసెఫ్ గోబెల్స్‌ను కేటీఆర్ మించిపోయారు. ఆయనను కేటీ రామారావు అని కాకుండా.. జోసెఫ్ గోబెల్స్ రావు అని పిలిస్తే సరిగ్గా సరిపోతుంది" అంటూ మండిపడ్డారు.

ప్రాణహిత-చేవెళ్లను కాదని..

ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తుమ్మిడిహెట్టి వద్ద చేపట్టిన ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును కొనసాగిస్తే రూ.38,500 కోట్లతో పూర్తయ్యేదని ఉత్తమ్ స్పష్టం చేశారు. "ప్రాణహిత-చేవెళ్లకు కరెంటు చార్జీలు ఏటా రూ.1000 కోట్లలోపు ఉండేవి. ఇప్పుడు కాళేశ్వరానికి మాత్రం ఏడాదికి రూ.10వేల కోట్లు కట్టాల్సి వస్తోంది. ప్రాజెక్టు పూర్తయ్యేనాటికి రూ. 1.47 లక్షల కోట్ల ఖర్చు వస్తుంది. అసలు, వడ్డీ, కరెంటు బిల్లులు కలిపి ఏడాదికి రూ.35 వేల కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. డిజైన్ మార్చేసి.. తుమ్మిడిహెట్టిలో 165 టీఎంసీల నీటి లభ్యత ఉన్నప్పటికీ, నీళ్లలేవని అబద్ధాలు చెప్పి మేడిగడ్డకు షిఫ్ట్ అయ్యారు. లక్ష కోట్లకు ప్రాజెక్టు వ్యయాన్ని పెంచారు. ఐదుగురు రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్లతో వేసిన కమిటీ.. మేడిగడ్డలో ప్రాజెక్టు నిర్మించొద్దని లిఖిత పూర్వకంగా నివేదిక ఇచ్చినా పట్టించుకోలేదు. రికార్డులు, నివేదికలను మార్చేశారు. లోపభూయిష్టమైన డిజైన్, నిర్మాణం, ప్రణాళిక, నిర్వహణతో ప్రాజెక్టు నిర్మించారు. సాయిల్ టెస్ట్ కూడా చేయలేదు. పునాది నుంచే లోపాలు జరిగాయి. ఎక్కువ వడ్డీకి స్వల్పకాలిక రుణాలు తెచ్చి రాష్ట్రాన్ని రూ.7 లక్షల కోట్ల అప్పుల్లో ముంచారు. ఇప్పుడీ ఆర్థిక భారాన్ని తెలంగాణ ప్రజలు శాశ్వతంగా భరించాల్సి ఉంటుంది. ఈ తరమే కాదు.. ముందు తరాలను కూడా తాకట్టు పెట్టారు" అని ఉత్తమ్ విమర్శించారు. కేటీఆర్ అధికారాన్ని కోల్పోయిన ఫ్రస్టేషన్‌తో నాన్‌సెన్స్ మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుపై విచారణ జరుగుతోందని, దోషులు ఎవరైనా వదిలిపెట్టేదిలేదని హెచ్చరించారు. 2019 నుంచే అన్నారం, సుందిళ్లలో బుంగలు, సీపేజీలు, లీకేజీలున్నాయని నీటి పారుదలశాఖ అధికారులు ఎల్అండ్‌టీకి లేఖలు రాసిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ అంశంపై అధికారులు-ఎల్అండ్‌టీకి ఉత్తర ప్రత్యుత్తరాలు జరుగుతున్నా పట్టించుకోలేదని విమర్శించారు. విద్యుత్తు బిల్లుల కోసం మేడిగడ్డలో పంపింగ్ నిలిపివేశారని కేటీఆర్ మాట్లాడడాన్ని తప్పుబడుతూ.. నీళ్లు లిఫ్ట్ చేసి ఎక్కడ పోయాలి? మీ నెత్తిల పోయాల్నా? అని ప్రశ్నించారు. 16 టీఎంసీలను నిల్వచేస్తే చాలా ప్రమాదం జరుగుతుందన్నారు. ఏటూరు నాగారం మొదలుకొని 44 గ్రామాలు, భద్రాచలం పట్టణం, భద్రాద్రి రామాలాయం, సీతారామా ప్రాజెక్టు, సమ్మక్క-సారలమ్మ బ్యారేజీ, దుమ్ముగూడెం ఆయకట్టు అన్నీ కొట్టుకపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు.

ఏటా ఆరున్నర లక్షల ఎకరాలకు సాగునీరు

ఏటా 6.50 లక్షల ఎకరాల చొప్పున ఐదేళ్లలో 36లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందని ఉత్తమ్ వివరించారు. ఆదివారం ఆయన జలసౌధలో ఇరిగేషన్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నీటి పారుదల రంగానికి ఈ బడ్జెట్‌లో రూ. 10,820 కోట్లు కేటాయించామని, ఏటా 6.50 లక్షల ఎకరాలకు సాగునీరివ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. "గోదావరి బేసిన్‌లో ఉన్న చిన్న కాళేశ్వరం, మొడికుంట వాగు, లోయర్ పెన్‌గంగ, చనాకా-కొరాటా, శ్రీపాద ఎల్లంపల్లి, సీతారామ, దేవాదుల, కృష్ణా బేసిన్‌లోని కోయిల్ సాగర్, రాజోలిబండ, కల్వకుర్తి, డిండి, ఏఎంఆర్ ఎస్ఎల్‌బీసీ, జవహర్‌లాల్ నెహ్రూ నెట్టెంపాడు ప్రాజెక్టులను ఈ ఏడాది పూర్తిచేస్తాం. దీంతో 5,84,770 ఎకరాలకు సాగునీరు అందుతుంది" అని ఉద్ఘాటించారు. నాణ్యతతో పనులు చేయించే అధికారులను గుర్తిస్తామని, నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

దమ్ముంటే కొడంగల్‌లో పోటీ చెయ్

» అక్బరుద్దీన్‌కు కేంద్ర మంత్రి సంజయ్ సవాల్

» డిపాజిట్ కూడా దక్కనివ్వబోమని స్పష్టీకరణ

» మజ్లిస్ గోడ మీది పిల్లి అని మండిపాటు

» బీజేపీ అధికారంలోకి వస్తే పాతబస్తీని కాశీ, అయోధ్య తరహాలో మార్చేస్తామని వెల్లడి



» సనాతన ధర్మాన్ని కించపరిస్తే ఊరుకోబోమని హెచ్చరిక

హైదరాబాద్/సిటీ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మజ్లిస్ నేత అక్బరుద్దీన్‌కు దమ్ముంటే కొడంగల్ నుంచి పోటీ చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ సవాల్ చేశారు. తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటికో ఇన్‌చార్జిగా ఉండి ఆయనకు డిపాజిట్ కూడా దక్కకుండా ఓడిస్తామని చెప్పారు. కొడంగల్ నియోజకవర్గం ఏమైనా కాంగ్రెస్, మజ్లిస్ జాగీరా? అని నిలదీశారు. 15 నిమిషాలు సమయం ఇస్తే హిందువులను నరికి చంపుతామన్న వ్యక్తిని డిప్యూటీ సీఎం చేస్తామని సీఎం రేవంత్ చెప్పడం సిగ్గుచేటని సంజయ్ విమర్శించారు. ఆదివారం ఆయన చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. లాల్‌దర్వాజ సింహవాహిని అమ్మవారిని దర్శించుకుని బంగారు బోనం సమర్పించారు. పాతబస్తీలోని పలు ఆలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వస్తే లాల్‌దర్వాజ సింహవాహిని అమ్మవారి ఆలయాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. కాశీ, అయోధ్య తరహాలో పాతబస్తీ రూపురేఖలు మారుస్తామని ప్రకటించారు. లాల్‌దర్వాజ అమ్మవారి ఆలయానికి రూ.10 కోట్లు కేటాయిస్తామని గత పాలకులు హామీ ఇచ్చి విస్మరించారని.. వారికి ఏ గతి పట్టిందో ప్రస్తుత పాలకులు గుర్తుంచుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రంజాన్ పండక్కి రూ.33 కోట్లు కేటాయిస్తే, పాతబస్తీలోని 24 దేవాలయాల కమిటీల నిర్వహణకు కేవలం రూ.5 లక్షలు ఇచ్చిందని.. బోనాలు, గణేశ్, దసరా ఉత్సవాలకు ఎందుకు నిధులివ్వరని ప్రభుత్వాన్ని నిలదీశారు. సనాతన ధర్మాన్ని కించపరిస్తే ఊరుకోబోమని సంజయ్ హెచ్చరించారు. "నేను వాస్తవాలు మాట్లాడితే మతతత్వం అంటారా? బరాబర్ మాట్లాడతా. నేను ఏ మతాన్నీ కించపరచలేదు. సనాతన ధర్మాన్ని అవమానిస్తే ఊరుకునే ప్రసక్తేలేదు" అని తేల్చిచెప్పారు. "పాతబస్తీలోని యాకత్‌పురా, కోమటివాడ, చందూలాల్ బారాదరి ప్రాంతాల్లో బోనాలు జరుపుకొనే పరిస్థితి లేదని ఒక పెద్దాయన వాపోయారు. అలాంటి వారందరికీ నేను హామీ ఇస్తున్నా. బీజేపీ అధికారంలోకి రాగానే, ప్రతి వీధిలో బోనాలను అధికారికంగా నిర్వహిస్తాం. భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయాన్ని గోల్డెన్ టెంపుల్‌గా చేస్తాం" అని ప్రకటించారు. తబ్లిగీ జమాతే సంస్థకు రూ.2.4 కోట్లు ఇచ్చినట్లు రాష్ట్ర ప్రభుత్వం నిస్సిగ్గుగా చెప్పుకొందని, ఇతర రాష్ట్రాల్లో నిషేధించిన సంస్థకు ఇక్కడ నిధులు ఎలా ఇస్తారు? అని సంజయ్ నిలదీశారు.

మజ్లిస్ గోడమీది పిల్లి..

మజ్లిస్ గోడమీది పిల్లిలాంటి పార్టీ అని, అధికారంలో ఎవరు ఉంటే వారివైపు వెళుతుందని సంజయ్ దుయ్యబట్టారు. బీఆర్ఎస్ అధికారంలో ఉంటే కాంగ్రెస్‌ను తిట్టి గులాబీ గడీలోకి వెళ్లారని.. ఇప్పుడు బీఆర్ఎస్‌ను తిట్టి కాంగ్రెస్ పంచన చేరారని ఆరోపించారు. మజ్లిస్ నేతలకు వాళ్ల వ్యాపారాలు బాగుంటే చాలని.. పాతబస్తీలో ట్యాక్స్‌లు, బిల్లులు కట్టవద్దన్నది వారి ఆలోచనని ఆరోపించారు.

యాదాద్రీశుడి క్షేత్రానికి మరిన్ని బస్సులు

» భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు: వీసీ సజ్జనార్

» పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం: పటేల్ రమేశ్‌రెడ్డి

భువనగిరి అర్బన్, జూలై 28: ప్రసిద్ధ యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి భక్తుల రద్దీకి అనుగుణంగా బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు. ఆయన ఆదివారం లక్ష్మీనృసింహుడిని కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా, ఆలయ ఈవో ఏ. భాస్కర్ రావు.. సజ్జనార్‌కు స్వామివారి చిత్రపటం, లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం సజ్జనార్ విలేకరులతో మాట్లాడుతూ.. యాదగిరి క్షేత్రానికి భక్తుల రాక ఇంకా పెరిగే అవకాశం ఉన్నందున మరిన్ని బస్సులు నడిపేందుకు సంస్థ సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. అందులో భాగంగానే యాదగిరిగుట్ట డిపోకు కొత్త బస్సులు మంజూరయ్యాయని, త్వరలో అందుబాటులోకి తేనున్నట్లు తెలిపారు. హైదరాబాద్-వరంగల్ 163 జాతీయ రహదారిపై ఉన్న యాదాద్రి భువనగిరి కలెక్టరేట్ వద్ద రిక్వెస్ట్ స్టాప్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. యాదగిరిగుట్టను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన కుటుంబసమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. కొండపైన గల హరిత హోటల్‌లో 30 గదులకు 15 మాత్రమే అందుబాటులో ఉన్నాయని మిగిలిన వాటిని మూడు నెలల్లో అందుబాటులోకి తీసుకువస్తామని భక్తులకు హామీ ఇచ్చారు. ఈ మేరకు విలేకరులతో మాట్లాడారు.


సజ్జనార్‌కు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న ఈవో ఏ. భాస్కర్



ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న తుమ్మల

రోగుల పట్ల మర్యాదగా వ్యవహరించాలి

» ఖమ్మం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో మంత్రి తుమ్మల తనిఖీ

ఖమ్మం, జూలై 28 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ప్రభుత్వ ఆస్పత్రికి వైద్యం కోసం వచ్చే రోగుల పట్ల డాక్టర్లు, సిబ్బంది మర్యాదగా వ్యవహరించాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మాటలతోనే రోగులకు సగం రోగం తగ్గిపోవాలని సూచించారు. ఖమ్మం జిల్లా కేంద్రం లోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిని కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్, కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి ఆదివారం ఉదయం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రి ఆవరణను, వార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఓ మహిళ మంత్రి వద్దకు వచ్చి ఆస్పత్రి సిబ్బంది రోగులతో అగౌరవంగా మాట్లాడుతున్నారని ఫిర్యాదు చేసింది. స్పందించిన మంత్రి వెంటనే వైద్యాధికారులతో మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చేదే పేదలని, అలాంటి వారి పట్ల గౌరవంగా వ్యవహరించాలని సూచించారు. రోగులతోపాటు వారి సహాయకులుగా వచ్చేవారికీ మర్యాద ఇవ్వాలన్నారు. వారం రోజుల్లోగా ఆస్పత్రి తీరు మారాలని, ఆవరణ అంతా శుభ్రం చేయాలని అధకారులను ఆదేశించారు. అనంతరం మంత్రి తుమ్మల విలేకరులతోనూ మాట్లాడుతూ ఖమ్మం ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది కొరత లేకుండా చూస్తామన్నారు. ఇందుకోసం కలెక్టర్‌కు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. త్వరలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రిని రప్పించి ఈ ఆస్పత్రికి కావాల్సిన అన్ని సౌకర్యాలు కలిపిస్తామని ఆయన చెప్పారు.

రేవంత్ ఆలోచన మారాలని మొక్కుకున్నా

» కులగణన తర్వాతే పంచాయతీ ఎన్నికలు పెట్టాలి: వీహెచ్

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ/అంబర్‌పేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కులగణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనలో మార్పు రావాలని మహంకాళి అమ్మవారిని కోరుకున్నట్లు కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్ తెలిపారు. ఇప్పుడే ఎన్నికలు నిర్వహిస్తే బీసీ వర్గాలకు అన్యాయం జరుగుతుందని, కులగణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం బోనాల పండుగ సందర్భంగా అంబర్‌పేట మహంకాళి అమ్మవారిని మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ తదితరులతో కలిసి ఆయన దర్శించుకున్నారు. అనంతరం వీహెచ్ మాట్లాడుతూ.. మహంకాళి అమ్మవారి దయ, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీల ప్రోత్సాహంతో నాలుగేళ్లలోనే రేవంత్ సీఎం అయ్యారన్నారు. 75 యేళ్లుగా అన్యాయానికి గురవుతున్న బీసీలకు రాజ్యాధికారం దక్కాలంటే జనాభా ప్రతిపాదికన ఆ వర్గాలకు చట్టసభల్లో అవకాశం కల్పించాలని చెప్పారు.

టీపీసీసీ ఎన్‌ఆర్‌ఐ కోఆర్డినేటర్‌గా దేవేందర్‌రెడ్డి..

టీపీసీసీ ఎన్‌ఆర్‌ఐ అంతర్జాతీయ వ్యవహారాల విభాగం సమన్వయకర్తగా హైదరాబాద్ అమీర్‌పేట్‌కు చెందిన నంగి దేవేందర్‌రెడ్డి నియమితులయ్యారు. ఆదివారం టీపీసీసీ ప్రవాస భారతీయుల విభాగం అంబాసిడర్ బీఎం వినోద్‌కుమార్ దేవేందర్‌రెడ్డికి నియామక పత్రాన్ని అందజేశారు.



అంబర్‌పేట మహంకాళి ఆలయంలో మంత్రి పొన్నం, వీహెచ్ తదితరులు



కల్వకుర్తిలో జరిగిన సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు దామోదర, జూపల్లి, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ ముఖ్యనేతలు

ఎల్లుండిలోగా లక్షన్నర మాఫీ!

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్‌కు అధికారం దక్కేదని అభిప్రాయపడ్డారు. కేంద్ర మాజీ మంత్రి, దివంగత నేత సూదిని జైపాల్ రెడ్డి ఐదో వర్ధంతి సందర్భంగా ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో సీఎం రేవంత్ ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. కొట్ర గేటు వద్ద ఏర్పాటు చేసిన జైపాల్‌రెడ్డి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కల్వకుర్తిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ఈ నెల 31లోగా రూ.లక్షన్నర రుణం నుంచి రైతులకు విముక్తి కల్పించబోతున్నామని ప్రకటించారు. ఆగస్టు 2 నుంచి 14 వరకు తాను విదేశీ పర్యటనలో ఉంటానని, వచ్చిన వెంటనే రూ.2 లక్షల రుణాలన్నీ మాఫీ అవుతాయని చెప్పారు. ఆ సొమ్ములను రైతుల ఖాతాల్లో జమ చేస్తామని స్పష్టం చేశారు. రాజకీయాల్లో సూదిని జైపాల్‌రెడ్డి లాంటి మహోన్నత వ్యక్తిత్వాలు చాలా అరుదుగా ఉంటాయని సీఎం చెప్పారు. నిజాయతీ గల నేతగా జైపాల్‌రెడ్డి తెలుగుజాతికే వన్నె తెచ్చారన్నారు. రాజకీయ నేతలకు జైపాల్‌రెడ్డి దార్శనికుడని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ఆయనది కీలక పాత్ర అని తెలిపారు. పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లును కొన్ని పక్షాలు వ్యతిరేకించిన సందర్భంలో మూడాఫ్ ద హౌస్ ప్రకారం బిల్లు పాసయ్యేలా చేయొచ్చని అప్పటి స్పీకర్ మీరాకుమార్‌ను ఒప్పించారన్నారు. పార్లమెంటు తలుపులు మూసివేసి, టీవీల్లో ప్రత్యక్ష ప్రసారం నిలిపివేసి, తెలంగాణ బిల్లు పాసయ్యేలా చేయడంలో జైపాల్‌రెడ్డి ప్రమేయం ఎంతో ఉందని చెప్పారు. అనేక ఒడుదొడుకులను ఎదుర్కొని, రాజకీయంగా జరిగే నష్టాల గురించి అంచనాలున్నప్పటికీ తెలంగాణ రాష్ట్రం ఇవ్వడంలో సోనియాగాంధీ చూపిన చొరవ తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని తెలిపారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌కు 2014 ఎన్నికల్లో అధికారం దక్కకపోవడానికి ఓ తప్పిదమే కారణమన్నారు. ఎన్నికల కంటే ముందే జైపాల్‌రెడ్డిని సీఎం అభ్యర్థిగా ప్రకటించి ఉంటే రాష్ట్ర రాజకీయాలు మరోలా ఉండేవన్నారు. తెలంగాణకు జైపాల్ రెడ్డే తొలి ముఖ్యమంత్రి అయ్యేవారని రేవంత్ చెప్పారు. ఆ ఒక్క తప్పిదం వల్లే తెలంగాణ రాష్ట్రాన్ని తెగనమ్ముకునే పరిస్థితి కేసీఆర్ కుటుంబానికి దక్కిందన్నారు. అధికారం కోల్పోయామనే బాధ కేసీఆర్, కేటీఆర్‌కు ఇంకా తగ్గలేదని ఎద్దేవా చేశారు. కేసీఆర్ అసెంబ్లీకి రాడు. నేను, నా బావనే అధికార పక్షం అడిగే వాటికి సమాధానం చెబుతామని కేటీఆర్ చెప్పాడు. కానీ, బడ్జెట్ ప్రవేశపెట్టే రోజు 11 గంటలకే కేసీఆర్ అసెంబ్లీలో ప్రత్యక్షమయ్యారు' అని రేవంత్ అన్నారు. తండ్రీకొడుకుల మధ్యనే సమన్వయం లేదనడానికి ఇదే నిదర్శనమని చెప్పారు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో మేడిగడ్డను సందర్శించి కేటీఆర్ రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు.



కల్వకుర్తిలోని కొట్రగేటు వద్ద జైపాల్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు దామోదర, జూపల్లి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

నాలుగు వరసల రహదారి..

హైదరాబాద్-కల్వకుర్తి మధ్య రహదారిని నాలుగు వరసలుగా విస్తరించనున్నట్లు సీఎం రేవంత్ చెప్పారు. శ్రీశైలం వెళ్లే భక్తుల రద్దీ పెరిగినందున.. ఈ రహదారిలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. మూడు లేన్లుగా ఉన్న ఈ రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించనున్నట్లు తెలిపారు. ఈ విషయమై తాను, మంత్రి కోమటి వెంకటరెడ్డి.. కేంద్ర మంత్రి గడ్కరీని కలిసి విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. ఇక కల్వకుర్తి నియోజకవర్గం ఆమనగల్ మండలంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు.

కార్యకర్తలను గెలిపించుకుంటాం..

నాయకుల ఎన్నికలు ముగిశాయని, కార్యకర్తలను గెలిపించుకునే స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయని సీఎం రేవంత్ అన్నారు. కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీ కోసం నిబద్ధతతో పని చేసిన కార్యకర్తలను కచ్చితంగా గెలిపించుకుంటామని భరోసా ఇచ్చారు. పుట్టిన గడ్డకు తొలిసారి వచ్చిన సీఎం.. కల్వకుర్తిపై వరాల జల్లు కురిపించారు. రూ.10 కోట్లతో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను మంజూరు చేశారు. ఆగస్టు 1 నుంచి పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. తాను చదువుకున్న కల్వకుర్తి మండలంలోని తాండ్రా పాఠశాలకు రూ.5 కోట్ల ప్రత్యేక నిధులు మంజూరు చేశారు. విగ్రహావిష్కరణ సభకు హాజరైన మంత్రి దామోదర రాజనరసింహ.. జైపాల్‌రెడ్డితో తమ కుటుంబానికున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. రాజకీయాల్లో జైపాల్‌రెడ్డి లాంటి నిబద్ధత కలిగిన వ్యక్తులు చాలా అరుదుగా ఉంటారన్నారు. 2014లో జైపాల్‌రెడ్డి రాష్ట్రానికి ముఖ్యమంత్రి అవ్వాల్సి ఉందని, ఆ లోటును ఇప్పుడు రేవంత్‌రెడ్డి భర్తీ చేశారని చెప్పారు. నల్లమల బిడ్డ తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడం శుభప్రదమని మరో మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు.

వృత్తి నైపుణ్య వర్సిటీ ఏర్పాటు స్థలాన్ని పరిశీలించిన సీఎం రేవంత్

ఇబ్రహీంపట్నం/కందుకూరు: వృత్తి నైపుణ్య యూనివర్సిటీ ఏర్పాటు కోసం రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్కాన్‌పేట వద్ద గుర్తించిన స్థలాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం సాయంత్రం పరిశీలించారు. ఇక్కడ సర్వే నంబరు 112లోని 57 ఎకరాల ప్రభుత్వ భూమిని వర్సిటీ కోసం అధికారులు గుర్తించారు. భూముల పటాన్ని పరిశీలించిన సీఎం, ఉన్నతాధికారులకు పలు సూచనలు చేశారు. నిరుద్యోగ సమస్యను దృష్టిలో పెట్టుకొని యువతకు ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో ఏర్పాటు చేయనున్న ఈ వర్సిటీకి ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. వర్సిటీ నుంచి ఔటర్ రింగ్ రోడ్డు (కొంగర కలాన్) వరకు 200 అడుగుల వెడల్పుతో రోడ్డు నిర్మాణానికి అవసరమయ్యే భూములను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. ఇందుకు నిధులు వెంటనే విడుదల చేయాలని సూచించారు. కాగా ఈ ప్రాంతంలో ఫార్మా, నాన్ ఫార్మా పరిశ్రమల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సీఎం సూచించినట్లు తెలిసింది.

స్ఫూర్తి స్థల్‌లో జైపాల్‌కు సీఎం రేవంత్ నివాళులు

కేంద్ర మాజీ మంత్రి ఎస్.జైపాల్‌రెడ్డి 5వ వర్ధంతి సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి నెక్లెస్‌రోడ్డులోని స్ఫూర్తి స్థల్‌లో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జైపాల్ రెడ్డి చేసిన సేవలను సీఎం గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సీఎంతో పాటు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, జైపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. కాగా, కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి జీవితం స్ఫూర్తిదాయకమని ఢిల్లీలోని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ అన్నారు. తెలంగాణ భవన్‌లో జైపాల్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.



జైపాల్‌రెడ్డి ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, సీఎం రేవంత్ తదితరులు

మాజీ సీఎస్ సోమేశ్‌కుమార్‌పై కేసు

(మొదటిపేజీ తరువాయి)

తేలడంతో.. ఆ శాఖ కమిషనర్ కె.రవి మూడ్రోజుల క్రితం హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్(సీసీఎస్) పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు ఐపీసీలోని సెక్షన్లు 406, 409, 120బీ, ఐటీ చట్టంలోని సెక్షన్ 65 కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసులో ఏ5గా సోమేశ్‌కుమార్ ఉన్నారు. వాణిజ్య పన్నుల శాఖ అదనపు కమిషనర్ ఎస్‌వీ కాశీ విశ్వేశ్వర రావు, డిప్యూటీ కమిషనర్ ఎ.శివరామప్రసాద్, అసిస్టెంట్ ప్రొఫెసర్ శోభన్‌బాబు, జీఎస్టీ సాఫ్ట్‌వేర్‌ను తయారు చేసిన ప్లింటో టెక్నాలజీస్‌ను ఎఫ్‌ఐఆర్‌లో నిందితులుగా చేర్చారు.

ఏమిటీ కుంభకోణం?

సాధారణంగా ఒక రాష్ట్రంలోని డీలర్లు, మరో రాష్ట్రంలోని డీలర్లకు విక్రయించే వస్తువులపై ఐజీఎస్టీని కేంద్ర ప్రభుత్వం వసూలు చేస్తుంది. దీనిని కేంద్రం, వస్తువులు కొన్న రాష్ట్రానికి చెరో 50% పంపిణీ అవుతుంది. అయితే రాష్ట్రంలోని కొంత మంది డీలర్లు దీన్ని ఆదాయ వనరుగా మార్చుకున్నారు. ఇక్కడి డీలర్లు ఇతర రాష్ట్రాల వారికి వస్తువులను విక్రయించినట్లుగా నకిలీ ట్యాక్స్ ఇన్వాయిస్‌లను సృష్టించారు. ప్రధానంగా 18% ట్యాక్స్ ఉన్న ఇనుము, ఇత్తడి, రాగి స్క్రాప్‌ను ఇతర రాష్ట్రాలకు సరఫరా చేసినట్లు ఆ ఇన్వాయిస్‌లలో పేర్కొన్నారు. నిజానికి ఈ వస్తు రవాణా భౌతికంగా జరగదు. కేవలం కాగితాల్లోనే సరఫరాలు ఉంటాయి. ఉదాహరణకు తెలంగాణలోని ఒక డీలరు పంజాబ్‌కు స్క్రాప్‌ను పంపించినట్లు ఇన్వాయిస్‌లు తయారు చేశాడు. పంజాబ్ వ్యాపారి ఆ ఇన్వాయిస్‌లను ఆధారంగా చేసుకుని 18% ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను జీఎస్టీ కౌన్సిల్ ఖాతాల నుంచి క్లెయిమ్ చేశాడు. ఈ సొమ్మును పంజాబ్ డీలరు, తెలంగాణ డీలరు పంచుకున్నారు. ఇలా తెలంగాణలోని పలువురు డీలర్లు, ఇతర రాష్ట్రాల్లోని డీలర్లు కూడబలుక్కుని సర్కారు ఖజానా నుంచి ఐటీసీని కొల్లగొట్టారు. ఇలా కొల్లగొట్టిన మొత్తం విలువ రూ.1000 కోట్లుగా ఉంటుందని వాణిజ్య పన్నుల శాఖ అధికారులు ఈ ఏడాది ఫిబ్రవరి మొదట్లోనే గుర్తించారు. ఈ కుంభకోణం జరిగిన తీరుపై 'ఆంధ్రజ్యోతి' ఫిబ్రవరి 22న పరిశోధనాత్మక కథనాన్ని ప్రచురించింది.

ఇలా కొల్లగొట్టారు..

జీఎస్టీలో పన్ను ఎగవేతలు, బకాయిలు వంటివాటిని గుర్తించడానికి వాణిజ్య పన్నుల కమిషనరేట్ ఓ ప్రైవేటు సంస్థతో సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేయించింది. అయితే ఈ సాఫ్ట్‌వేర్‌లో కీలకమైన మాడ్యుల్ లేకపోవడం వెనకా.. పోలీసులు తాజాగా కేసు నమోదు చేసిన ఇద్దరు అధికారుల ప్రమేయం ఉన్నట్లు వాణిజ్యపన్నుల కమిషనరేట్ అప్పట్లోనే గుర్తించింది. సాధారణంగా డీలర్లు తాము అమ్మిన వస్తువులకు 'జీఎస్టీఆర్-1' రిటర్నులు, ఆ తర్వాత అమ్మకాలు, కొనుగోళ్లు, చెల్లించాల్సిన పన్నుకు సంబంధించి 'జీఎస్టీఆర్-3బీ' రిటర్నులను ఫైల్ చేయాలి. వస్తువులను కొన్న ఇతర రాష్ట్రాల్లోని డీలర్లు జీఎస్టీఆర్-1తో పాటు 'జీఎస్టీఆర్-2ఏ' రిటర్నులను సమర్పించాలి. దీని ద్వారా ఎంత విలువైన వస్తువులను కొనుగోలు చేశారన్నది తేలుతుంది. వస్తువులు అమ్మిన డీలరు జీఎస్టీఆర్-3బీని సమర్పిస్తేనే వారు ప్రభుత్వానికి చెల్లించాల్సిన జీఎస్టీ వివరాలు వెల్లడవుతాయి. కానీ.. ఇక్కడి డీలర్లు వస్తువులను ఇతర రాష్ట్రాల డీలర్లకు అమ్మినట్లు జీఎస్టీఆర్-1 రిటర్నులను మాత్రమే ఫైల్ చేశారు. వీటి ఆధారంగా ఇతర రాష్ట్రాల్లోని డీలర్లు వస్తువులను కొనుగోలు చేసినట్లు జీఎస్టీఆర్-2తో పాటు జీఎస్టీఆర్-3బీని ఫైల్ చేశారు. దాంతో వారికి ఐటీసీని క్లెయిమ్ చేసుకునే అవకాశం ఏర్పడింది. పెద్ద మొత్తంలో ఐటీసీని క్లెయిమ్ చేశారు. ఇలా రిటర్నులను ఫైల్ చేసినట్లు చూపారే తప్ప.. భౌతికంగా వస్తు సరఫరా జరగలేదు. ఇక్కడి డీలర్లు జీఎస్టీఆర్-3బీని సమర్పించినట్లయితే ప్రభుత్వానికి జీఎస్టీని చెల్లించాల్సి ఉండేది. అసలు వస్తు రవాణా జరగనప్పుడు పన్ను చెల్లించాల్సిన అవసరం ఉండదు. కానీ.. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్(ఐటీసీ)ని క్లెయిమ్ చేయడానికే వస్తు సరఫరా జరిగినట్లు దొంగ ఇన్వాయిస్‌లను సృష్టించారు. అయితే రెండు రాష్ట్రాల మధ్య జరిగే లావాదేవీల ఐజీఎస్టీ సంబంధిత జీఎస్టీఆర్-3బీని సమర్పించారా? లేదా? అన్నది గుర్తించే 'మాడ్యూల్' కమిషనరేట్ రూపొందించిన సాఫ్ట్‌వేర్‌లో లేనట్లు తేలింది. రాష్ట్ర వస్తు సేవల పన్ను(ఎస్‌జీఎస్టీ), కేంద్ర వస్తు సేవల పన్ను(సీజీఎస్టీ)ల రిటర్నులను గుర్తించే మాడ్యూల్స్‌ను మాత్రమే సాఫ్ట్‌వేర్‌లో పొందుపర్చారు. ఐజీఎస్టీకి సంబంధించిన మాడ్యూల్‌ను పొందుపర్చకపోవడంతో ఇక్కడి డీలర్లు పన్ను సంబంధిత రిటర్నులను దాఖలు చేశారా? లేదా? అన్నదాన్ని సాఫ్ట్‌వేర్ గుర్తించడం లేదు. పర్యవసానంగా దొంగ ఇన్వాయిస్‌లతో ఐటీసీని కొల్లగొట్టినట్లు తేలింది. ఫిబ్రవరిలో ఈ కుంభకోణం బయటపడగానే.. అంతర్గత విచారణలో సదరు సాఫ్ట్‌వేర్ సంస్థతో ఆ మాడ్యూల్ లేకుండా చూడాలంటూ సోమేశ్‌కుమార్‌తో పాటు కాశీవిశ్వేశ్వర్‌రావు, శివరాం ప్రసాద్ సూచించినట్లు తేలింది. దాంతో.. అప్పట్లోనే కాశీవిశ్వేశ్వర్‌రావు, శివరాంప్రసాద్‌కు మెమోలు జారీ చేశారు. కాగా.. ఫిబ్రవరి 22న 'ఆంధ్రజ్యోతి' ఈ కుంభకోణాన్ని వెలికితీయడంతో.. మాజీ సీఎస్ సోమేశ్ దీనిపై విచారణ జరపొద్దంటూ అధికారులపై ఒత్తిడి పెంచారు. సోమేశ్‌కుమార్ సీఎస్‌గా ఉన్నప్పుడు వాణిజ్యపన్నులు, ఎక్సైజ్ శాఖలను తనవద్దే పెట్టుకున్నారు. రేవంత్ సర్కారు అధికారంలోకి రావడంతో.. అధికారుల బదిలీలు జరిగాయి. కొత్తగా వచ్చిన అధికారులు ఈ కుంభకోణాన్ని గుర్తించారు.

'సెంట్రలైజ్డ్ కిచెన్‌ల'తో మధ్యాహ్న భోజనం

» పాఠశాలల విద్యార్థులకు అల్పాహారం కూడా

» పైలట్ ప్రాజెక్టుగా కొడంగల్‌లో.. తర్వాత రాష్ట్రమంతా అమలు

» ఫౌండేషన్ ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష

హైదరాబాద్/కొడంగల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించడమే లక్ష్యంగా సెంట్రలైజ్డ్ కిచెన్‌లు నిర్మించాలని ప్రభుత్వం భావిస్తోంది. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతోపాటు ఉదయాన్నే అల్పాహారం కూడా అందించేలా ఏర్పాట్లు చేస్తోంది. కొడంగల్ నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్టు చేపట్టి, ఆ తర్వాత రాష్ట్రమంతా అమలు చేయాలని ప్రాథమికంగా నిర్ణయించింది. హరే రామ-హరే కృష్ణ చారిటబుల్ ఫౌండేషన్ సహకారంతో ఈ పథకాన్ని అమలు చేయనుంది. అలాగే, వివిధ కంపెనీల కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధులను సైతం ఇందుకోసం వినియోగించుకోవాలని యోచిస్తోంది. ఈ మేరకు హరే రామ-హరే కృష్ణ చారిటబుల్ ఫౌండేషన్ ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో భేటీ అయ్యారు. కొడంగల్‌లో సెంట్రలైజ్డ్ కిచెన్ పనులు పూర్తయిన వెంటనే.. ఈ పథకాన్ని అమల్లోకి తీసుకురావాలని సూచించారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 28 వేల మంది విద్యార్థులకు రోజూ ఉదయం అల్పాహారంతోపాటు మధ్యాహ్న భోజనం అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ పథకాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం చేయాలని సూచించారు.

నూతన గవర్నర్ జిష్ణుకు స్వాగతం

తెలంగాణ నూతన గవర్నర్‌గా నియమితులైన జిష్ణు దేవ్ వర్మకు ప్రజల తరఫున స్వాగతం పలుకుతున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయనకు శుభాకాంక్షలు చెబుతూ 'ఎక్స్'లో సీఎం పోస్ట్ చేశారు.



హరే రామ-హరే కృష్ణ ఫౌండేషన్ ప్రతినిధులతో చర్చిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

మన సంస్కృతిని కాపాడుకుందాం: సీఎం రేవంత్

వేల ఏళ్ల నాటి సంస్కృతి-సంప్రదాయాలను పరిరక్షిస్తూ ప్రపంచపటంలో తెలంగాణ తన ప్రత్యేకతను నిలుపుకొంటోందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. శాతవాహనులు, కాకతీయులు, కుతుబ్ షాహీలు తదితరులు ఈ ప్రాంతాన్ని పరిపాలించి తమదైన వారసత్వ సాంస్కృతిక ముద్రను వేశారని తెలిపారు. ఆదివారం కుతుబ్‌షాహీ టూంబ్స్‌లో సాంస్కృతిక శాఖ, ఆగాఖాన్ ట్రస్ట్ ఫర్ కల్చర్ ఆధ్వర్యంలో జరుగుతున్న పునరుద్ధరణ ప్రాజెక్ట్ పనుల ముగింపు కార్యక్రమంలో రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వందల, వేల ఏళ్ల నాటి చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలతో నిండిన తెలంగాణ సమ్మిళిత సంస్కృతిని కాపాడుకోవాలన్నారు. చార్మినార్, గోల్కొండ కోట, కుతుబ్‌షాహీ సమాధులు, పాయిగా సమాధులు, వేయి స్తంభాల గుడి, రామప్ప దేవాలయం, అలంపూర్ దేవాలయాలు చారిత్రక అద్భుతాలని చెప్పారు. శతాబ్దాలుగా హైదరాబాద్ 'గంగా-జమునా తెహజీబ్'గా బహుళ జాతులు, సంస్కృతుల సామరస్యాన్ని, సహజీవనానికి నిదర్శనంగా నిలుస్తోందని తెలిపారు. శతాబ్దాల క్రితం నాటి కుతుబ్‌షాహీ సమాధులను శిథిలావస్థ నుంచి పరిరక్షించేందుకు 2013లో ఆగాఖాన్ ట్రస్ట్ చేపట్టిన ప్రాజెక్టును విజయవంతంగా పూర్తి చేయడం విశేషమన్నారు. సుమారు 106 ఎకరాల విస్తీర్ణంలోని నిర్మాణాలను గుర్తించి, వాటికి పూర్వవైభవాన్ని చేకూర్చిన ఆగాఖాన్ ట్రస్ట్ ప్రతినిధులను, సాంకేతిక నిపుణులను రేవంత్‌రెడ్డి అభినందించారు. మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. ప్రపంచ పర్యాటకులకు తెలంగాణను ప్రధాన కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఎంపీ అసదుద్దీన్ మాట్లాడుతూ.. గోల్కొండ టూంబ్స్ పునరుద్ధరణ పనులు పూర్తి చేసిన ఆగాఖాన్ ట్రస్ట్‌కే వాటి నిర్వహణ బాధ్యతలూ అప్పగించాలని కోరారు.

బదిలీల్లేవ్.. పదోన్నతుల్లేవ్!

» ఆదాయం పెరుగుతున్నా.. సిబ్బంది అరకొరే

» కొత్త స్టేషన్ల ప్రతిపాదనలూ కాగితాలకే..

» సంస్కరణకు దూరంగా ఎక్సైజ్ శాఖ

హైదరాబాద్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ శాఖల్లో ప్రస్తుతం బదిలీలు జరుగుతున్నాయి. ఈ నెల 31 వరకు వీటిని పొడిగించారు. అయితే ఎక్సైజ్‌శాఖలో మాత్రం వాటి ఊసే లేదు. అధిక ఆదాయం ఆర్జించే శాఖలైన రిజిస్ట్రేషన్, ఆబ్కారీలో వీలును బట్టి బదిలీలు చేసుకునే వెసులుబాటు ఉంది. రిజిస్ట్రేషన్ శాఖలో బదిలీలు కొనసాగుతున్నా.. ఆబ్కారీలో ఆ దిశగా ఇంతవరకు ఏ నిర్ణయం తీసుకోలేదు. చివరిసారిగా ఎక్సైజ్ శాఖలో 2018లో పూర్తిస్థాయి బదిలీలు జరిగాయి. ఆ తర్వాత సాధారణ ఎన్నికల నేపథ్యంలో.. ఒకేచోట మూడేళ్లపైబడి పనిచేస్తున్న ఉద్యోగులను బదిలీ చేపట్టాలని ఎన్నికల సంఘం ఆదేశించడంతో ఆ శాఖ ఉద్యోగులకు పెద్దఎత్తున స్థానచలనం జరిగింది. అయితే అవి తాత్కాలిక బదిలీలే కావడంతో మళ్లీ తిరిగి పాత స్థానాలకు పంపి, పాత స్థానాల సర్వీసు సీనియారిటీ ఆధారంగా పూర్తిస్థాయి బదిలీలు చేపట్టాలని ఉద్యోగులు కోరుతున్నారు. ముఖ్యంగా దంపతుల బదిలీలు ఇతర శాఖల్లో పూర్తవుతున్నా.. ఎక్సైజ్‌లో చేయకపోవడంతో ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్సైజ్ చెక్ పోస్టులు ఎక్కడెక్కడో సరిహద్దులు, మారుమూల ప్రాంతాల్లో ఉంటాయి. ప్రతికూల పరిస్థితుల్లో విధులు నిర్వహించాల్సి ఉండటంతో అక్కడ ఏడాదిలో బదిలీలు చేపట్టాలి. అయితే ఏళ్ల తరబడి బదిలీలు చేపట్టకపోవడంతో ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది.

ఆదాయం సరే.. సంస్కరణలెప్పుడు..?

ఆబ్కారీ శాఖను పాలకులు బంగారు గుడ్లు పెట్టే బాతుగా చూస్తున్నారే తప్ప.. శాఖలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో విఫలమవుతున్నారు. సంస్కరణల అమలుపై దృష్టి పెట్టడం లేదు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ బడ్జెట్‌లో అదనంగా రూ.5 వేల కోట్ల ఆదాయం ఆర్జించాలని ఆబ్కారీ శాఖకు టార్గెట్ పెట్టారు. మద్యం విక్రయాలతోనే ఈ ఆదాయాన్ని సమకూర్చుకోవాలని సర్కారు భావిస్తుంది తప్ప.. సంస్కరణలు అమలుచేసి ఇతర ప్రత్యామ్నాయ మార్గాలు వెతకాలన్న ఆలోచన లేకుండా పోయింది. అబ్కారీ శాఖలో మార్పులకు శ్రీకారం చుట్టాలన్న లక్ష్యంగా గత సర్కారు ఆగస్టు-2020లో జీవో నంబర్ 94 విడుదల చేసింది. దీని ప్రకారం కొత్తగా 14 స్టేషన్లు, 8 చెక్‌పోస్టులు, డిస్టిలరీ, డిపోలు మంజూరు చేసింది. కొత్తవాహనాలు కొనుగోలుతో పాటు పోస్టింగులకు కూడా అనుమతించింది. కొత్తగా మంజూరు చేసిన పోస్టుల్లో రాష్ట్రస్థాయిలో ఒక అదనపు కమిషనర్, మరో జాయింట్ కమిషనర్, 3 డిప్యూటీ కమిషనర్లు, 4 అసిస్టెంట్ కమిషనర్లు, 12 సూపరింటెండెంట్‌లు, 18 ఇన్‌స్పెక్టర్లు, 18 సీనియర్ అసిస్టెంట్‌లు, 19 కానిస్టేబుల్, 25 ఆఫీస్ సూపరింటెండెంట్‌తో పాటు మొత్తం 131 పోస్టులున్నాయి. ఎక్సైజ్ స్టేషన్లను పెంచి అక్రమ మద్యాన్ని నియంత్రిస్తే ప్రభుత్వ ఖజానాకు మరింత ఆదాయం వస్తుందని గత ప్రభుత్వం భావించింది. అలాగే కొత్త పోస్టులతో పదోన్నతులు వస్తాయని ఇటు ఉద్యోగులూ ఆశపడ్డారు. కానీ ఈ అంశం ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉంది. నాలుగేళ్లు గడుస్తున్నా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు.

డాక్టర్ లోకేశ్వరరావు సజ్జాకు బ్లాక్‌బక్ అవార్డు



బ్లాక్‌బక్ అవార్డు అందుకుంటున్న స్టార్ ఆస్పత్రి వైద్యుడు లోకేశ్వరరావు సజ్జా

హైదరాబాద్ సిటీ, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : స్టార్ ఆస్పత్రికి చెందిన డా.లోకేశ్వరరావు సజ్జాకు వైద్య పరిశోధనలో చేసిన కృషికి 2024 సంవత్సరానికి బ్లాక్‌బక్ అవార్డు(బ్లాక్‌బక్ పయనీర్ రీసెర్చర్ అవార్డు) దక్కింది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పలువురు వైద్యులు మాట్లాడుతూ డా.లోకేశ్వరరావు సజ్జా వైద్య పరిశోధన రంగంలో చేసిన విలువైన కృషికి బ్లాక్‌బక్ రీసెర్చర్ పురస్కారం లభించిందన్నారు. దేశంలో కరోనరీ శస్త్రచికిత్సలను అభివృద్ధి చేయడానికి అంకితమైన 'సొసైటీ ఆఫ్ కరోనరీ సర్జన్స్'ను డా.సజ్జా స్థాపించినట్లు పేర్కొన్నారు. ఆయన స్ఫూర్తి యాంత్రిక 'ప్రొసైటిక్ ' హృదయ నాళ కవాటాన్ని అభివృద్ధి చేయడానికి దారితీసిందన్నారు. అనేక అంతర్జాతీయ, జాతీయ సమావేశాల్లో పరిశోధన పత్రాలు సమర్పించడంతో పాటు పేరొందిన జర్నల్స్‌లో 115 కంటే ఎక్కువ కథనాలు రచించారని తెలిపారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ కార్డియోవాస్కులర్ - థొరాసిక్ సర్జన్స్(ఐఏసీటీఎస్)2023-24 అధ్యక్షుడిగా ఎంతోమంది రోగులకు ప్రయోజనం చేకూర్చారని వైద్యులు తెలిపారు.

జానపద కళలను రక్షించాలి

» త్యాగరాయ గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి



చిక్కడపల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయ జానపద కళలను పరిరక్షించేందుకు త్యాగరాయ గానసభ ఓ నిర్ణయం తీసుకుందని సభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి తెలిపారు. ఆదివారం నిర్వహించిన త్యాగరాయ గానసభలో ఆయన ఈ మేరకు మాట్లాడారు. మరుగున పడిపోతున్న హరికథ, ఒగ్గుకథ, బుర్రకథ, చిందు యక్షగానం, పద్యపౌరాణిక, సాంఘిక నాటకం, శాస్త్రీయ జానపద కళలకు, మిమిక్రీ, మ్యాజిక్ వంటి వైవిధ్యభరితమైన కళల పరిరక్షణలో భాగంగా నెలలో ఒక రోజు ఒక కళ చొప్పున ప్రదర్శనకు గానసభలోని ఆరు హాళ్లలో ఒక హాల్‌ను 365 రోజులూ ఉచితంగా కేటాయిస్తామని వెల్లడించారు. ఆ కార్యక్రమాలను గానసభ టీవీ 1966లో ఉచితంగా ప్రసారం చేస్తామని కూడా తెలిపారు. ఆయా కళల్లో ప్రతిభావంతులు తమ ప్రదర్శనకు వేదిక కోసం 93999 20008 నంబరు ద్వారా సంప్రదించి వివరాలు తెలుసుకోవచ్చన్నారు. ఈ సమావేశంలో సభ కార్యవర్గసభ్యులు శంకరనారాయణ, చక్రపాణి, శ్రీనివాస్, గీతాదేవి పాల్గొన్నారు.

ఎంపీడీవోల సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాసరావు

హైదరాబాద్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఎంపీడీవోల (మండల పరిషత్ అభివృద్ధి అధికారుల) సంఘం నూతన కమిటీ ఎన్నిక ఆదివారం జరిగింది. రంగారెడ్డి జిల్లా జెడ్పీ కార్యాలయం ప్రాంగణంలో జరిగిన సంఘం జనరల్‌బాడీ సమావేశంలో పాత కమిటీని రద్దుచేసి కొత్త కమిటీ ఎన్నిక చేపట్టారు. ఈ సందర్భంగా టీజీఎంపీడీవోల సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా టి. శ్రీనివాసరావు, కార్యదర్శిగా జె. పద్మావతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదే విధంగా ట్రెజరర్‌గా సయ్యద్ తారిఖ్‌అన్వర్, సహాధ్యక్షులుగా కే. దన్‌సింగ్ ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

కేరళలో అయ్యప్ప భక్తులకు అన్నవితరణ

» ఆగస్టు 10, 11 తేదీల్లో కాంచీపురంలో సమావేశాలు

» ఏబీఏపీ జాతీయ సమావేశంలో తీర్మానాలు

ఖమ్మం కార్పొరేషన్, జూలై 28: శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తులకు కేరళలో అన్నవితరణ చేయాలని అఖిల భారత అయ్యప్పధర్మ ప్రచారసభ(ఏబీఏపీ) నిర్ణయించింది. ఖమ్మంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం జరిగిన ఏబీఏపీ జాతీయ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారసభ జాతీయ అధ్యక్షుడు అయ్యప్పదాస్ వెల్లడించారు. ఏబీఏపీ జాతీయ కార్యదర్శిగా బేతి తిరుమలరావును నియమిస్తూ ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు వివరించారు. "ఏబీఏపీ ఆధ్వర్యంలో కేరళలోని నారాయణతోడులో అన్నదాన మందిరాన్ని నిర్మించాలని తీర్మానించాం. తమిళనాడులోని కాంచీపురంలో ఏబీఏపీ సమావేశాలను నిర్వహించాలని నిర్ణయించాం. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు చెందిన ఏబీఏపీ ప్రతినిధులు ఇందులో పాల్గొంటారు. వారికి అయ్యప్ప సేవారత్న అవార్డులను ప్రదానం చేస్తాం" అని పేర్కొన్నారు.

2-3 రోజుల్లో నీట్ రాష్ట్రస్థాయి ర్యాంకులు

» రాష్ట్రాలవారీగా జాబితా సిద్ధంచేస్తున్న డీజీహెచ్‌ఎస్

హైదరాబాద్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సవరించిన నీట్ ఫలితాలను ఎన్‌టీఏ మూడ్రోజుల క్రితం విడుదల చేసిన నేపథ్యంలో మరో రెండు, మూడు రోజుల్లో రాష్ట్ర స్థాయి ర్యాంకులను డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డీజీహెచ్‌ఎస్) విడుదల చేయనుంది. తాజా ఫలితాల్లో చాలా మంది ర్యాంకులు మారాయి. ప్రస్తుతం డీజీహెచ్‌ఎస్ రాష్ట్రాలవారీగా అభ్యర్థుల ర్యాంకుల జాబితాను సిద్ధం చేస్తోంది. ఆ డేటాను రాష్ట్రాలకు పంపనుంది. తొలుత ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల కోసం ఆలిండియా ర్యాంక్ ఆధారంగా మెరిట్ జాబితా రూపొందిస్తారు. రాష్ట్ర స్థాయి నీట్ ర్యాంకులు విడుదల చేస్తారు. అనంతరం హెల్త్ వర్సిటీ కౌన్సెలింగ్ ప్రారంభిస్తుంది. కౌన్సెలింగ్ ఎప్పటి నుంచి అనేది వెల్లడికావాల్సి ఉంది. ఈసారి రాష్ట్రం నుంచి 77,849మంది నీట్ పరీక్ష రాయగా.. అందులో మొదట విడుదల చేసిన ఫలితాల్లో 47,371మంది ఉత్తీర్ణత సాధించారు. సవరించిన ఫలితాల్లో 47,356 మంది అర్హత పొందారు. 15 మంది అర్హత కోల్పోయారు.

తొలుత 15 శాతం ఆలిండియా కోటా సీట్లకు కౌన్సెలింగ్

తొలుత 15 శాతం ఆలిండియా కోటా సీట్లకు డీమ్డ్, సెంట్రల్ యూనివర్సిటీలు, ఈఎస్ఐసీ, ఏఎఫ్ఎంసీ, బీహెచ్‌యూ, ఏఎంయూలలో ఉండే సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. కౌన్సెలింగ్ వివరాలు, షెడ్యూల్ కేంద్ర వైద్య ఆరోగ్యశాఖతో సహా అన్ని రాష్ట్రాల వైద్య విద్యా డైరెక్టరేట్ల వెబ్‌సైట్లలో అందుబాటులో ఉంటాయి. రాష్ట్ర కోటా, రాష్ట్రాల పరిధిలోకి వచ్చే ఇతర సీట్ల కోసం నీట్ ర్యాంకర్లు తమ సొంత రాష్ట్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఆలిండియా ర్యాంక్ ఆధారంగా సంబంధిత కౌన్సెలింగ్ అధికారులు మెరిట్ జాబితా తయారు చేస్తారు.

భగవద్గీతే పెళ్లి పత్రిక!



ప్రతి ఇంటా భగవద్గీత ఉండాలనే సంకల్పంతో కామారెడ్డి జిల్లాకు చెందిన ఓ కుటుంబం భగవద్గీత పుస్తకాన్నే వివాహ ఆహ్వాన పత్రికగా రూపొందించింది. భగవద్గీత పుస్తకం అట్ట తెరవగానే పెళ్లి పత్రిక కనిపించేలా ఏర్పాటు చేసింది. ఆ పుస్తకాలనే ఇస్తూ తమ ఇంట జరగనున్న వివాహ వేడుకకు బంధు మిత్రులను వినూత్నంగా ఆహ్వానిస్తోంది. కామారెడ్డి జిల్లా పిట్లం గ్రామానికి చెందిన కోట రాజులు, నాగమణి దంపతులు తమ కుమార్తె వివాహానికి అతిథులను ఈ విధంగా ఆహ్వానిస్తూ ఆకట్టుకుంటున్నారు. - నారాయణఖేడ్

క్యాన్సర్‌ను జయించి.. శిశువుకు జన్మనిచ్చి..

» గర్భసంచి తొలగింపునకు వచ్చిన యువతికి వైద్యుల భరోసా

» ఫ్రీజ్ చేసిన పిండాన్ని గర్భసంచిలో ప్రవేశపెట్టిన వైద్యులు

» పూర్తి ఆరోగ్యంతో పుట్టిన పాప.. తల్లి, బిడ్డ ఇద్దరూ క్షేమం



క్యాన్సర్‌ను జయించి బిడ్డకు జన్మనిచ్చిన యువతి మౌనికతో వైద్యురాలు వసుంధర

రాయదుర్గం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ సోకడంతో.. గర్భసంచి తొలగింపు కోసం వచ్చిన యువతికి వైద్యులు కొత్త భరోసా ఇచ్చారు! గర్భసంచి తొలగించకుండానే క్యాన్సర్‌కు చికిత్స చేయడమే కాక.. ఆమె మళ్లీ మాతృత్వ మధురిమను పొందేలా చేశారు. హైదరాబాద్‌లోని కొండాపూర్ కిమ్స్ కడల్స్ ఆస్పత్రి వైద్యుల ఘనత ఇది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా తణుకుకు చెందిన మౌనిక (27)కు తొలుత ఒకసారి గర్భం వచ్చింది. కానీ, కొన్నాళ్ల తర్వాత గర్భస్థశిశువుకు ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తడంతో గర్భస్రావం చేయించారు. కొన్నాళ్ల తర్వాత.. ఆమె అనారోగ్యం బారిన పడడంతో పరీక్షలు చేయించగా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ వచ్చినట్టు తేలింది. దీంతో.. తప్పనిసరిగా ఆమె గర్భసంచి తొలగించాలని (హిస్టరెక్టమీ) అక్కడి వైద్యులు చెప్పారు. అందుకోసం ఆమె కొండాపూర్‌లోని కిమ్స్ కడల్స్ ఆస్పత్రికి వచ్చారు. కానీ.. 'క్యాన్సర్ ఉన్నంత మాత్రాన గర్భసంచి తొలగించాల్సిన పనిలేదు. అలా తొలగిస్తే ఇక జీవితాంతం పిల్లలు పుట్టే అవకాశం ఉండదు. దాన్ని తొలగించకుండానే క్యాన్సర్ చికిత్స చేయొచ్చు. ఆ తర్వాత పిల్లలను కూడా పొందవచ్చు' అని ఆ ఆస్పత్రిలోని సీనియర్ కన్సల్టెంట్ గైనకాలజిస్ట్, రోబోటిక్ అండ్ ల్యాప్రోస్కోప్ సర్జన్ డాక్టర్ వసుంధర చీపురుపల్లి ఆమెకు ధైర్యం చెప్పారు. వైద్యుల కౌన్సెలింగ్‌తో మౌనిక దంపతులు చికిత్సకు ఒప్పుకొన్నారు. దీంతో వైద్యులు తొలుత ఆమె పిండాలను ఫ్రీజ్ చేసి.. క్యాన్సర్ చికిత్స ప్రారంభించారు. చికిత్స పూర్తైన తర్వాత.. ఫ్రీజ్ చేసిన రెండు పిండాలను ఆమె గర్భసంచిలో ప్రవేశపెట్టారు. అయితే.. గర్భ సంచి రెండు పిండాలను మోసే పరిస్థితి ఉండకపోవచ్చని భావించి, ఒక పిండాన్ని తీసేశారు. 32వారాల తర్వాత.. ముందుజాగ్రత్త చర్యగా శిశువు ఊపిరితిత్తులు బలంగా ఉండేందుకు ఇంజెక్షన్లు చేశారు. 37 వారాల తర్వాత.. అంతా బాగుండటంతో ఆమెకు శస్త్రచికిత్స చేశామని, సంపూర్ణ ఆరోగ్యంతో చక్కటి పాప పుట్టిందని, తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని డాక్టర్ వసుంధర తెలిపారు. "ఒకదశలో.. మాకు అసలు పిల్లలు పుట్టే అవకాశం లేదనుకున్నాం. కానీ, డాక్టర్ వసుంధర, కిమ్స్ కడల్స్ ఆస్పత్రి బృందం మాకు ఎంతగానో నచ్చజెప్పారు. ఇప్పుడు మాకో చక్కటి పాప పుట్టింది. మేమంతా ఎంతో సంతోషంగా ఉన్నాం" అని మౌనిక భర్త మహేశ్ ఆనందం వ్యక్తం చేశారు.

వైద్య విద్య ముందుకెలా?

69 విభాగాధిపతి పోస్టుల్లో రెగ్యులర్ 17 మందే.. సర్కారీ మెడికల్ కాలేజీ, బోధనాస్పత్రులకు ఇంచార్జిలే దిక్కు

» పాస్ కాని అడ్మినిస్ట్రేటివ్ పోస్టుల విరమణ వయసు పెంపు బిల్లు

» 61 నుంచి 65 ఏళ్లకు పెంచిన గత సర్కారు.. నాటి గవర్నర్ తిరస్కరణ

» మరింత సమాచారం కావాలన్న ఇన్‌చార్జి గవర్నర్ రాధాకృష్ణన్



హైదరాబాద్, జూలై 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైద్య విద్య కళాశాలలకు ప్రిన్సిపాళ్లు, అనుబంధ ఆస్పత్రులకు సూపరింటెండెంట్లు దొరకడం కష్టమవుతోంది. విభాగాధిపతి(అడ్మినిస్ట్రేటివ్) పోస్టులైన వీటికి.. వయో పరిమితి పెంపు బిల్లును గత ఏడాది ఏప్రిల్‌లో బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పటి గవర్నర్ డాక్టర్ తమిళిసైకు పంపగా ఆమె తిరస్కరించారు. కాంగ్రెస్ సర్కారు వచ్చాక.. తమిళిసై వైదొలగాక.. సీపీ రాధాకృష్ణన్ ఇన్‌చార్జి గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టారు. వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు ఆయన వద్దకు వెళ్లి బిల్లు గురించి వివరించగా మరిన్ని వివరాలివ్వాలని కోరారు. ఇప్పుడు కొత్త గవర్నర్‌గా జిష్ణుదేవ్ వర్మ రానున్నారు. ఆగస్టు తొలి వారంలో రెగ్యులర్ డీఎంఈ నియామకంపై కోర్టు కేసు విచారణ ఉంది. డిసెంబరు 21న ఇన్‌చార్జిగా ఉన్న డాక్టర్ రమేశ్‌రెడ్డిని కోర్టు ఆదేశాల మేరకు తప్పించి సీనియారిటీ జాబితాలో ఉన్న డాక్టర్ త్రివేణికి ఇన్‌చార్జి డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) బాధ్యతలు అప్పగించారు. ఆమె పనితీరుపై సంతృప్తి చెందని ప్రభుత్వం ఫిబ్రవరి 20న తప్పించింది. సంగారెడ్డి వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉన్న డాక్టర్ ఎన్.వాణిని తీసుకొచ్చింది. కాగా, రెగ్యులర్ డీఎంఈని నియమించాలంటే ముందు అడ్మినిస్ట్రేటివ్ పోస్టులో ఉండే అదనపు డీఎంఈ పదవీ విరమణ వయసు పెంచాల్సి ఉంది. ఇది జరగాలంటే గవర్నర్ బిల్లుకు ఆమోదముద్ర వేయాలి. రాష్ట్రంలో వైద్యకళాశాలల సంఖ్య ఏటా పెరుగుతోంది. ప్రభుత్వ, ప్రైవేటులో కలిపి ఇప్పటికే 56 కాలేజీలున్నాయి. ఈ ఏడాది సర్కారులో 8 ప్రైవేటులో 3 కాలేజీలు రానున్నాయి. అనుభవజ్ఞులైన ఆచార్యులు కొద్దిమందే ఉన్నారు. ఈ కొరత తీర్చేందుకు గతబీఆర్ఎస్ ప్రభుత్వం విభాగాధిపతుల విరమణ వయసును 61 నుంచి 65కు పెంచింది. అసెంబ్లీలో బిల్లు పెట్టి గవర్నర్ ఆమోదానికి పంపింది. కాగా, అదనపు డీఎంఈగా పదోన్నతి పొందిన వారినే ప్రభుత్వ వైద్య కళాశాలలకు ప్రిన్సిపాళ్లు, అనుబంధ ఆస్పత్రుల సూపరింటెండెంట్లుగా నియమిస్తారు. ఆ పదోన్నతి రావాలంటే ఐదేళ్లు ప్రొఫెసర్‌గా పనిచేసి ఉండాలి. ముఖ్యంగా పదవీ విరమణకు ఏడాది సమయం కచ్చితంగా ఉండాలి. ఈ ప్రకారం 59 ఏళ్ల వయసున్న సీనియర్లకే పదోన్నతులు దక్కుతాయి. వైద్య విద్యలో ప్రొఫెసర్ విరమణ వయసును తొలుత 58 నుంచి 61కు, తర్వాత 61 నుంచి 65కు పెంచారు. అడ్మినిస్ట్రేటివ్ పోస్టుల విరమణ వయసు మాత్రం 61 వరకే ఉంది. దీన్ని కూడా 65 చేయాలనే యోచనతో గత ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు పెట్టింది.

ప్రస్తుతం ప్రభుత్వ వైద్య కళాశాలలు, వాటి అనుబంధ ఆస్పత్రుల్లో మొత్తం 66 రెగ్యులర్ అడ్మినిస్ట్రేటివ్ పోస్టులున్నాయి. డీఎంఈ కార్యాలయంలో రెగ్యులర్ డీఎంఈ, అదనపు, అకడమిక్ డీఎంఈ పోస్టులున్నాయి. వీటిని అదనపు డీఎంఈ హోదా ఉన్నవారితోనే భర్తీ చేయాలి. రాష్ట్రంలో ఈ హోదా 17 మందికే ఉంది. మిగిలిన 52 పోస్టుల్లో అందరూ ఇన్‌చార్జిలే ఉన్నారు. అంటే.. అత్యధిక వైద్య కళాశాలలు, బోధనాస్పత్రుల్లో ప్రిన్సిపాళ్లు, సూపరింటెండెంట్లు ఇన్‌చార్జిలే. దీంతో కొన్నిసార్లు పాలన గాడి తప్పుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అదనపు డీఎంఈ పదోన్నతులు చేపట్టింది. ఐదేళ్లకి మించి ఆచార్యులుగా పనిచేసిన వారి జాబితా రూపొందించింది. మొత్తం 200 మంది ఉండగా 1:3 నిష్పత్తిలో 150 మంది జాబితాను సిద్ధం చేసింది. అయితే, అడ్మినిస్ట్రేటివ్ పోస్టుల్లో ఉండేవారి విరమణ వయసు పెంపు బిల్లు ఆమోదం కాకుండా పదోన్నతులు చేపట్టబోమని సాధారణ పరిపాలన శాఖ తేల్చి చెప్పింది.

పదోన్నతులకు ముందుకు రాని వైనం

నిబంధనల మేరకు విభాగాధిపతులైన డీఎంఈ, అదనపు డీఎంఈలు 61 ఏళ్లు రాగానే విరమణ చేయాలి. అయితే ప్రొఫెసర్ల విరమణ వయసు 65. ఈ నేపథ్యంలో పదోన్నతులు తీసుకుంటే నాలుగేళ్ల సర్వీస్‌ను వదులుకోవాలి. దీనికి ఎవరూ ఇష్టపడడం లేదు. పదోన్నతులు తీసుకోకుంటే ప్రొఫెసర్‌గా 65 ఏళ్ల వరకు కొనసాగొచ్చు. పదోన్నతి పొంది.. ఏ మారుమూల కాలేజీ ప్రిన్సిపాల్‌గా లేదా, ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా పనిచేసి 61 ఏళ్ల దాటాక మళ్లీ ప్రొఫెసర్‌గా ఎలా పనిచేస్తామంటూ ఓ ఆచార్యుడు ప్రశ్నించారు.

వైద్యశాఖలో యూనియన్ నేతలకూ బదిలీ!

హైదరాబాద్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్యారోగ్యశాఖలో బదిలీల్లో ఎవరికీ మినహాయింపు ఇవ్వలేదు. ఆఫీస్ బేరర్ అంటూ లేఖలు తెచ్చుకుని బదిలీల నుంచి మినహాయింపు పొందిన వారందర్నీ.. ఆఖరికి యూనియన్ నేతలను కూడా ప్రభుత్వం బదిలీ చేసింది. వైద్యారోగ్యశాఖ బదిలీలలో యూనియన్ లేఖల పేరిట భారీగా జరిగిన అక్రమాలను సరిదిద్దుకునే ప్రయత్నం చేసింది. బదిలీల నుంచి తమను మినహాయించాలని అయా సంఘాల నుంచి లేఖలు తెచ్చుకుని బదిలీకాకుండా ఉన్న వారిపై కొరడా ఝుళిపించింది. సుమారు 250 మంది ఆఫీస్ బేరర్‌ల లేఖలను రద్దు చేసింది. వారున్న స్థానం నుంచి వేరేచోటకు బదిలీ చేస్తూ తాజాగా వైద్య ఆరోగ్యశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీల నుంచి వెసులుబాటు పొందేందుకు కొంతమంది ఉద్యోగులు ఆఫీస్ బేరర్ల పేరిట టీజీవో, టీఎన్‌జీవో, ఐఎన్‌టీయూసీ యూనియన్‌ల నుంచి లేఖలు తెచ్చుకున్నారు. ఈ లేఖలు ఇచ్చే క్రమంలో పెద్దఎత్తున డబ్బులు వసూలు చేశారంటూ ఆరోపణలు వచ్చాయి. దాంతో సర్కార్ దీనిపై విజిలెన్స్ దర్యాప్తునకు ఆదేశించింది. అలాగే ఆ లేఖలను పరిగణనలోకి తీసుకోవడంలేదని స్పష్టతనిచ్చింది. ప్రధానంగా ప్రజారోగ్య సంచాలకుల విభాగంలో వివిధ క్యాడర్లకు సంబంధించి బదిలీల నుంచి మినహాయింపు పొందిన వారిని వేర్వేరు చోట్లకు బదిలీ చేసింది. వారందర్నీ మూడు రోజుల్లోగా తామిచ్చిన పోస్టుల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఎంపీహెచ్ఈవో క్యాడర్ నుంచి 32 మంది ని బదిలీ చేశారు. వీరంతా సంఘం లేఖలతో బదిలీల నుంచి మినహాయింపు పొందిన వారేనని వైద్యవర్గాలు తెలిపాయి. ఇదే క్యాడర్‌లోని ఐఎన్‌టీయూసీ యూనియన్ నాయకుడు వెంకటేశ్వర్ రెడ్డిని వికారాబాద్ జిల్లాకు బదిలీ చేయడం చర్చనీయాంశంగా మారింది. అదేవిధంగా స్టాఫ్‌నర్స్ క్యాడర్‌లో యూనియన్ నాయకురాలు సుజాత రాథోడ్‌ను ఉస్మానియా ఆస్పత్రి నుంచి సూర్యాపేట మెడికల్ కాలేజీకి బదిలీ చేశారు. వివిధ యూనియన్లకు చెందిన మరో 30 మంది నాయకులనూ జిల్లాలకు పంపించినట్లు తెలిసింది.

జగన్ ఇంత పిరికితనమా..!

సిగ్గు సిగ్గు

అసెంబ్లీకి పోని మీరు తక్షణమే రాజీనామా చేయాలి: షర్మిల



అమరావతి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డిపై ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల మరోసారి తీవ్ర వ్యాఖ్యలతో విరుచుకుపడ్డారు. 'సిగ్గు సిగ్గు.. మాజీ సీఎం జగన్! ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీలో అడుగుపెడతా అనడం మీ అజ్ఞానానికి నిదర్శనం' అంటూ షర్మిల మండిపడ్డారు. ఆదివారం ఎక్స్ వేదికగా ఆమె స్పందించారు. 'అసెంబ్లీకి పోననడాన్ని విజ్ఞంచిన పిరికితనం, చేతకానితనం, అహంకారం ఎక్కడా కనపడవు, వినపడవు. మోసం చేయడం మీకు కొత్తేమీ కాదు జగన్. కానీ మిమ్మల్ని ఎన్నుకుని, అసెంబ్లీకి పంపిన ప్రజలను ఇలా వెర్రిగా, వింతగా మోసం చేయడం, ఓట్లు వేసిన ప్రజలను అవమానించడం మీకే చెల్లింది. అసెంబ్లీకి పోకుండా ప్రజాస్వామ్యాన్ని హేళన చేయడం దివాలాకోరుతనం. ఎమ్మెల్యే అంటే మెంబర్ ఆఫ్ లెజిస్లేటివ్ అసెంబ్లీ.. మెంబర్ ఆఫ్ మీడియా అసెంబ్లీ కాదు. ఎమ్మెల్యేగా గెలిచింది చట్టసభల్లో ప్రజల గొంతుక అవ్వడానికా లేక మీడియా ముందు సొంత డబ్బా కొట్టుకోవడానికా? ఐదేళ్ల పాలన అంతా అవినీతి, దోపిడీ అని, రాష్ట్రాన్ని మీరు అప్పుల కుప్ప చేసి పెట్టారని, నిండు సభలో అధికారపక్షం శ్వేతపత్రం విడుదల చేస్తుంటే.. తాపీగా ప్యాలెస్‌లో కూర్చుని మీడియా మీట్లు పెట్టడానికి కాదు ప్రజలు మిమ్మల్ని ఎమ్మెల్యేను చేసింది. ప్రజలకు అన్యాయం జరిగితే అధికార పక్షాన్ని ఫ్లోర్ ఆఫ్ ది హౌస్‌లో ప్రశ్నించే బాధ్యత మీది కాదా? అసెంబ్లీకి పోనని చెప్పే మీరు, ప్రతిపక్ష హోదాకే కాదు, ఎమ్మెల్యే హోదాకు కూడా అర్హులు కారు. అంసెబ్లీకి పోని జగన్ తక్షణమే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోంది' అని షర్మిల పేర్కొన్నారు.

వేడిగా కశ్మీర్

» జూలై ఉష్ణోగ్రతల్లో 25 ఏళ్ల గరిష్ఠ స్థాయి

శ్రీనగర్, జూలై 28: రుతుపవనాల ప్రవేశంతో దేశవ్యాప్తంగా ఆయా రాష్ట్రాలు తడిసిముద్దవుతుంటే.. కశ్మీర్ మాత్రం వడగాలులతో ఉక్కిరిబిక్కిరవుతోంది. ఆదివారం శ్రీనగర్‌లో అత్యధికంగా 36.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయినట్లు అక్కడి వాతావరణ కేంద్రం తెలిపింది. గత 25 ఏళ్లలో జూలై మాసంలో ఈస్థాయి ఉష్ణోగ్రతలు నమోదు కావడం ఇదే ప్రథమం. 1999, జూలై 9న చివరిసారి 37 డిగ్రీల గరిష్ఠ స్థాయిని తాకడం గమనార్హం. అంతకుముందు 1946, జూలై 10న రికార్డు అయిన 38.3 డిగ్రీల ఉష్ణోగ్రతే.. ఇప్పటి వరకు అత్యధికం. కాగా, దక్షిణ కశ్మీర్‌లోని ఖాజీగండ్, కొకర్‌నాగ్ ప్రాంతాల్లో సైతం ఆదివారం 35 డిగ్రీలు నమోదు కావడం విశేషం.





ఎన్‌టీఆర్ నగర్‌లో బోనాలతో బారులుదీరిన మహిళలు

బోనమెత్తిన భాగ్య నగరం

(మొదటిపేజీ తరువాయి)



ఎన్‌టీఆర్ నగర్‌లో మైసమ్మకు పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి సీతక్క



తీర్చుకున్నారు. ఏటా లాల్‌దర్వాజలో ఉత్సవాలు జరిగే రోజునే నగరవాసులందరూ బోనాల పండుగను జరుపుకుంటారు. పండుగ సందర్భంగా నగరంలోని వివిధ ఆలయాల్లో కొలువుదీరిన అమ్మవార్లకు కోళ్లు, యాటలతో భక్తులు మొక్కులు చెల్లించారు. మహిళలు అమ్మవార్లకు తొట్టెలు కట్టారు. విద్యుత్ దీపాల వెలుగులు, రంగు రంగుల పూలతో చేసిన అలంకరణలతో ఆలయాలు ప్రత్యేక శోభను సంతరించుకున్నాయి. బోనాల నేపథ్యంలో నగరంలోని వివిధ ఆలయాలకు రాజకీయ ప్రముఖులు తరలివెళ్లారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర హోంశాఖ మంత్రి బండి సంజయ్, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ లాల్‌దర్వాజ మహంకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. చార్మినార్ శ్రీభాగ్యలక్ష్మి అమ్మవారిని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి దర్శించుకుని పట్టు వస్త్రాలు సమర్పించారు. అమీర్‌పేటలోని కనకదుర్గ అమ్మవారిని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దర్శించుకున్నారు. లోయర్‌ట్యాంక్ బండ్ శ్రీకనకాల కట్టమైసమ్మ దేవాలయంలో మంత్రి శ్రీధర్‌బాబు పూజలు చేశారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మీర్ ఆలం మండి మహా కాళేశ్వర ఆలయంలో అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కాగా, గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ రాష్ట్ర ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

ఏపీ సర్కారు చేతికి పెద్దిరెడ్డి గుట్టు?

» హైదరాబాద్‌లోని సన్నిహితుడి ఇంట్లో సోదాలు.. కీలక ఫైళ్లు, డాక్యుమెంట్లు సీజ్

» మదనపల్లె దహనం కేసులో పురోగతి

అమరావతి/తిరుపతి/రాయచోటి/మాదాపూర్, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఏపీలోని అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో భూ రికార్డుల దహనం కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి అత్యంత సన్నిహితుడు, ఆయనకు వ్యక్తిగత సహాయకుడిగా పనిచేసిన శశికాంత్ (ఆలియాస్ శశి)ను అదుపులోకి తీసుకునేందుకు హైదరాబాద్‌లోని నివాసానికి వెళ్లిన పోలీసులకు అత్యంత కీలకమైన డాక్యుమెంట్లు లభించాయి. పది మంది పోలీసులు దాదాపు 8గంటల పాటు నిర్వహించిన సోదాల్లో మొత్తం నాలుగు ట్రంకుపెట్టెల్లో ఫైళ్లు, డాక్యుమెంట్లను గుర్తించారు. వాటితో పాటు ఒక ల్యాప్‌టాప్‌ను సీజ్ చేసి అమరావతికి తరలించారు. వాటిలో గనుల శాఖతో పాటు, మదనపల్లి, తిరుపతి, హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ తదితర ప్రాంతాల భూముల ఫైళ్లు, రికార్డులు ఉన్నట్లు గుర్తించారని సమాచారం. ఫైళ్ల దహనం కేసులో ఈ పరిణామం చాలా కీలకమైనదిగా ప్రభుత్వం భావిస్తోంది. పెద్దిరెడ్డికి శశికాంత్ నమ్మిన బంటు. జగన్ ప్రభుత్వంలో గనులు, అటవీ శాఖలకు పెద్దిరెడ్డి మంత్రిగా ఉన్నప్పటికీ అసలు మంత్రిగా శశినే వ్యవహరించారని అధికార వర్గాలు చెబుతున్నాయి. గనుల శాఖలో విజిలెన్స్ దాడులు, వసూళ్లు, బదిలీలు, పదోన్నతుల వ్యవహారంలో గోల్‌మాల్, వ్యాపారులను బెదిరించడం, అడ్డగోలుగా లెటర్ ఆఫ్ ఇంటెంట్‌లు ఇప్పించారని ఆయనపై ఫిర్యాదులు ఉన్నాయి. గనులశాఖ అక్రమాలపై విచారణ జరిగితే శశి పాత్ర బయటపడుతుందని భావించినా మదనపల్లి ఫైళ్ల దహనం కేసులో ఆయన పాత్ర ఉన్నట్లు తెలిసింది. పక్కా సమాచారంతో పోలీసులు హైదరాబాద్‌లోని అయ్యప్ప సొసైటీలోని ఆర్‌ఆర్ రెసిడెన్సీకి వెళ్లారు. ఈ విషయం తెలిసిన శశి తన ఫ్లాట్‌కు తాళం వేసి బయటకు వెళ్లిపోయారు. ఫ్లాట్ యజమాని, పామర్రు మాజీ ఎమ్మెల్యే అనిల్ సమక్షంలో పోలీసులు తాళాలు తెరిచారు. మరోవైపు ఓ బృందం శశి కోసం తీవ్రంగా గాలిస్తున్నట్లు తెలిసింది.

వైసీపీ నేతల ఇళ్లల్లో సోదాలు

భూ రికార్డుల దహనం కేసు దర్యాప్తులో భాగంగా తిరుపతి నగరం మంగళం రోడ్డులోని మాజీ మంత్రి పెద్దిరెడ్డి పీఏ తుకారాం నివాసంలో ఆదివారం పోలీసులు, సీఐడీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సుమారు 15 కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. పలు అంశాలపై తుకారాంను ప్రశ్నించారు. తదుపరి విచారణ కోసం ఆయన్ను అదుపులోకి తీసుకుని మదనపల్లె తరలించారు. మదనపల్లె డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి నేతృత్వంలో పోలీసులు, సీఐడీ సీఐ రామకిశోర్, ఎస్ఐ మంజుల, సిబ్బంది పాల్గొన్నారు. పెద్దిరెడ్డి పీఏ నివాసంలో తనిఖీలు, తుకారాంను అదుపులోకి తీసుకున్న విషయాన్ని అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ధ్రువీకరించారు. కాగా, శనివారం అర్ధరాత్రి తంబళ్లపల్లె వైసీపీ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఇంట్లో సోదాలు జరిగినట్లు సమాచారం. ఆ సమయంలో ఎమ్మెల్యే ఇంట్లో లేరని తెలిసింది. ఇక్కడ పోలీసులకు ఎటువంటి రికార్డులు, డాక్యుమెంట్లు దొరకలేదని సమాచారం.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.